Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం, జనవరి 11, 2025 | సంపుటి - 20 | సంచిక 104 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## నేటి నుంచి సంక్రాంతి సెలవులు

**మళ్లీ 18వ తేదీన తెరుచుకోనున్న బడి తలుపులు**



హైదరాబాద్ : తెలంగాణలో సంక్రాంతి పండుగ హడావుడి మొదలైంది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఎందుకంటే రేపట్నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు కాబట్టి. స్కూల్ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై పాఠశాలలకు వెళ్లారు.

2




విలేకరులు కావలెను

అనతికాలంలోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొందుతున్న ది క్రైమ్ న్యూస్ దిన పత్రికకు ఉమ్మడి జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకర్గాల వారిగా ఆర్‌సీ ఇంచార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవజ్ఞులకు ప్రాధాన్యత ఇవ్వబడును

ది క్రైమ్ న్యూస్ తెలుగు దినపత్రిక

రాజకీయ అవగాహన కలిగిన కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.

వివరాలకు సంప్రదించండి 6305584064


# కాలుష్యరహితనగరంగా హైదరాబాద్

**చంద్ర మండలానికి వెళ్లిన భూమ్మిద ఎలా ఉండాలో తెలియటం లేదు**

**కాలుష్యకారక వాహనాలను అవుటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలిస్తున్నాం**

**వారు క్యాంటీన్లు ఏర్పాటు చేసుకుందుకు చర్యలు**

**విద్యార్థులకు 40 శాతం డైట్, 200 శాతం కాస్మొటిక్ ఛార్జీలను పెంచాం**

**సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని, చంద్రమండలానికి వెళ్తున్నాం.. కానీ భూమిపైన ఎలా ఉండాలో మాత్రం తెలుసుకోలేకపోతున్నామని అన్నారు. సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ ప్రతినిధులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కాలుష్యకారక వాహనాలను అవుటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలిస్తున్నామన్నారు.

హైదరాబాద్ : తెలంగాణలో స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేయించామన్నారు. మహిళా సంఘాలతో సోలార్ పవర్ స్టేషన్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి చేసేలా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని, హైటెక్ సిటీ పక్కనే మహిళా సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మూడున్నర ఎకరాల స్థలంలో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ ఛార్జీలను పెంచామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మహిళాభివృద్ధి ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రామీణ మహిళల సాధికారత కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. తెలంగాణలో ఆటో మొబైల్ రంగంపై ప్రత్యేక దృష్టి 2లో

## 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'

**సాగుయోగ్యమైన భూమికి మాత్రమే రైతుభరోసా**

**అనర్హులకు పథకాలు అందకుండా చూడాలి**

**ప్రభుత్వ పథకాలకు పూర్తి బాధ్యత మీదే**

**గ్రామసభలు నిర్వహించి పక్కగా అమలు చేయాలి**

**కలెక్టర్ల సదస్సులో సిఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు**

ఈనెల 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పథకాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నాలుగు పథకాల అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించాలని.. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కలెక్టర్లకు దిశానిర్దేశర చేశారు. ఈ మేరకు కలెక్టర్లతో జరుగుతోన్న సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

హైదరాబాద్ : 'ఈ నెల 26 తర్వాత జిల్లాల్లో పర్యటిస్తాను. అన్ని జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేస్తా. సాగు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా చెల్లించాలి. పంట వేసినా.. వేయక పోయినా.. సాగుయోగ్యమైన భూమికి రైతు భరోసా ఇవ్వాలి. అనర్హులకు ఇవ్వొద్దు. ఇందుకోసం క్షేత్ర స్థాయిలో పర్యటించి అనర్హులను గుర్తించాలన్నారు.. సాగు యోగ్యం కాని భూములను గుర్తించి మినహాయించాలి. స్థిరాస్తి భూములు, లేఅవుట్లు, నాలా కన్వర్షన్, మైనింగ్, గోదాములు నిర్మించిన భూములు,



# మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్

**మారనున్న మెట్రో ముఖచిత్రం**

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్‌ను అనుసంధానం చేస్తూ 36 వరకు రోడ్డు మార్గాలు, నాలుగు చోట్ల రైలు మార్గాలు ఉన్నాయి. రోడ్డు, రైలు మార్గాలతో పాటు మెట్రో మార్గం కలిస్తే భవిష్యత్ ప్రజా రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉండే అవకాశాలున్నాయి. ఆ దిశగానే సీఎం రేవంత్ రెడ్డి ఉత్తర హైదరాబాద్ వైపు రెండు మెట్రో కారిడార్లు, దక్షిణ హైదరాబాద్ వైపు మరో కారిడార్‌కు డీపీఆర్‌లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మెట్రోరైలు సౌకర్యం ఔటర్ రింగు రోడ్డును దాటి నగర శివారు ప్రాంతాలకు అందుబాటులోకి రానుంది. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు మొదటి దశలోని జేబీఎస్ నుంచి ఎంబీజీఎస్ మార్గంలో 11 కిలోమీటర్లు ప్రస్తుతం నగరవాసులకు అందుబాటులో ఉంది. రెండో దశలో చేపట్టబోయే జేబీఎస–శామీర్‌పేట (22 కి.మీ), ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట (7.5 కి.మీ), చాంద్రాయణ గుట్ట నుంచి ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా ఆరాంఘర్ 2లో



## సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై అసంతృప్తి

ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని హైకోర్టు ఆదేశం

గేమ్‌ఛేంజర్‌కు ప్రత్యేక అనుమతులపై విచారణ 24కు వాయిదా

2

# ఫార్ముల-ఈ కార్ రేస్ కేసులో ఏసిబి దూకుడు

**హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి విచారణ**

**నిధుల విడుదలకు అనుమతులపై ప్రశ్నలు**



హైదరాబాద్ : ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి ఏసీబీ విచారణ కొనసాగింది. శుక్రవారం దాదాపు 6 గంటలుగా బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ రికార్డులను పరిశీలించిన ఏసీబీ అధికారులు వాటిని బీఎన్ఎల్ రెడ్డి ముందు ఉంచి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. హెచ్‌ఎండీఏ బోర్డు ఖాతా నుంచి ఎఫ్‌ఈవోకు రూ.55 కోట్లు రిలీజ్ చేయడంలో బీఎల్ఎన్ రెడ్డి కీలకంగా 2

## అసెంబ్లీలో మాటలకే విలువ లేకుంటే ఎలా ?

ఊసరవెల్లి సైతం సిగ్గుపడేలా ప్రత్యేక పరిమితులా

గేమ్‌ఛేంజర్ టిక్కెట్ ధరల పెంపు, షోలపై హరీష్ రావు విమర్శలు



హైదరాబాద్ : గేమ్ చేంజర్ సినిమా అదనపు షోలు వేసుకునేందుకు అనుమతి ఇవ్వడంపై హరీష్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు హాట్ కామెంట్స్ చేశారు. సీఎం తీరు చూస్తే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందన్నారు. ఇదే అంశంపై ట్విట్టర్ వేదికగా స్పందించిన హరీష్ రావు.. 'ఒక మహిళ మృతి చెందారు. ఇక మీదట సినిమాలకు స్పెషల్ ప్రివిలేజ్ ఇచ్చేది లేదంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి రెడ్డి.. 2లో

## ఎమ్మెల్సీ ఎన్నికలకు బిజెపి అభ్యర్థుల ప్రకటన

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి**

**టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్య**

**మరో అభ్యర్థిగా సర్వోత్తం రెడ్డిల పేర్లు వెల్లడి**




హైదరాబాద్ : తెలంగాణలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. అందరి కంటే ముందుగానే మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ప్రత్యర్థి పార్టీలకు బీజేపీ షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు నిజామాబాద్– ఆదిలాబాద్– కరీంనగర్– మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి పేరును బీజేపీ ఖరారు చేసింది.నిజామాబాద్ –అదిలాబాద్– కరీంనగర్– మెదక్–టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా 2లో

# కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

**ఫార్మూలా రేస్ కేసులో నిధులు ఎందుకు బదలాయించారు**

**700 కోట్లు ఎ క్కడ లాభాలు వచ్చాయో కెటిఆర్ చెప్పగలడా**

**కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటు విమర్శలు**



కరీంనగర్ : ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ అరెస్ట్ అయితే ఆందోళనలు ఎందుకు చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కేటీఆర్ ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడా అని ప్రశ్నించారు. అందు కోసం ఏమైనా జైలుకు వెళతారా అని నిలదీస్తూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్ అయ్యారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సర్కార్ సొమ్మును అక్రమంగా కట్టబెట్టి పైగా అడ్డగోలుగా మాట్లాడతవా అని కేటీఆర్ పై సీరియస్ అయ్యారు. కేబినెట్ ఆమోదం లేకుండా విదేశీ కంపెనీకి అంత అర్జెంట్‌గా 55 కోట్లు విడుదల చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఫార్ములా ఈ రేస్‌తో ప్రభుత్వానికి రూ.700 కోట్లు లాభం వచ్చిందని కేటీఆర్ అంటున్నారు.. మరీ ఆ లాభాలు ఎక్కడ వచ్చాయో చూపించాలని డిమాండ్ చేశారు. లొట్టపీసు సీఎం, లొట్ట పీసు ప్రభుత్వం అని కేటీఆర్ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నా.. 2లో

## చలికి వణుకుతున్న ఉత్తరాది రాష్ట్రాలు

**ఉదయం వేళల్లో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేని స్థితి**

**వరుసగా చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు**



2

న్యూఢిల్లీ : చలి తీవ్రతకు ఉత్తరభారతం వణుకుతోంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు యూపీ, పంజాబ్, జార?ండ్, పశ్చిమబెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది.

# నేటి నుంచి సంక్రాంతి సెలవులు

రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలలకు జనవరి 11 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. 18వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. ఇక జూనియర్ కాలేజీలకు జనవరి 11 నుంచి 16 వరకు సెలవులు ప్రకటించారు. 17న పునఃప్రారంభం కానున్నాయి. సెలవు దినాల్లో ఎట్టి పరిస్థితుల్లో కూడా తరగతులు నిర్వహించకూడదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలను హెచ్చరించింది. ఇంటర్ బోర్డు నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# అసెంబ్లీలో మాటలకే విలువ లేకుంటే ఎలా ?

రెండు వారాలు కూడా తిరగకముందే ఊసరవెల్లి సైతం సిగ్గుపడేలా మాట మార్చారు' అంటూ విమర్శలు గుప్పించారు. టికెట్ రేట్లు పెంచేది లేదంటూ అదే అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలు సైతం స్వల్ప వ్యవధిలోనే నీటి మూటలు అయ్యాయన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన దానికే విలువ లేకపోతే ఎట్లా? అని హరీష్ రావు ప్రకటించారు. అసెంబ్లీని కూడా తప్పుదోవ పట్టిస్తూ టికెట్ రేట్లు, అదనపు షోస్‌కి అనుమతి ఇవ్వడం సభను అవమానించడమేనని అన్నారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు ముఖ్యమంత్రిపై, మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ మోషన్ పెడతామని హరీష్ రావు ప్రకటించారు. మాట తప్పం, మడమ తిప్పం అంటూ బీరాలు పలికి ఇప్పుడు టికెట్ రేట్ల పెంపునకు ఎలా అనుమతి ఇచ్చారు? ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హరీష్ రావు సూటిగా ప్రకటించారు.'గతంలో మీరు బెనిఫిట్ షోలకు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతి ఇవ్వడం వల్లే ఒక మహిళ మృతి చెందారు. మరో పసివాడు ఇంకా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ పాపం మీ ప్రభుత్వానిదే కదా రేవంత్ రెడ్డి. ఆ దురదృష్ట ఘటనను మరిచిపోకముందే ఎందుకు ఈ యూ టర్న్ తీసుకున్నారు. దీని వెనుక ఉన్న మర్మం ఏమిటి' అని హరీష్ రావు ప్రశ్నించారు.

# మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్

శంషాబాద్ టౌన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు (35 కి.మీ), అదేవిధంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ(ఫ్యూచర్ సిటీ) వరకు (40 కి.మీ).. ఇలా మొత్తం 115 కిలోమీటర్ల మెట్రో మార్గం ఉత్తర దిక్కున ఉన్న శామీర్‌పేట ఔటర్ రింగు రోడ్డు నుంచి దక్షిణ దిక్కున ఉన్న ఫోర్త్ సిటీతో అనుసంధానం అవుతుంది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు ఉత్తరాన ఉన్న శామీర్‌పేట నుంచి సికింద్రాబాద్, ముషీరాబాద్, ఎంజీబీఎస్, చార్మినార్ మీదుగా చాంద్రాయణగుట్ట, శంషాబాద్ విమానాశ్రయం అక్కడి నుంచి ఫోర్త్ సిటీ వరకు మెగా మెట్రో కారిడార్ అవతరించనుంది. హైదరాబాద్ మహానగరంలో ఉత్తర–దక్షిణ దిక్కులను కలిపే మెగా మెట్రో కారిడార్‌లో ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్ స్టేషన్‌లు, ఎంఎంటీఎస్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగించే సికింద్రాబాద్, ఫలక్‌నుమా, బుద్వేల్, శంషాబాద్, అల్వాల్, బొల్లారం వంటి రైల్వే స్టేషన్‌లతో అనుసంధానం అవుతుంది. ఇక అత్యంత కీలకమైంది శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం. భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా విమానాల నెట్‌వర్క్ కలిగిన విమానాశ్రయంతో కూడా ఈ మెట్రో కారిడార్ కలిస్తే అన్ని రకాల ప్రజా రవాణా వ్యవస్థలు ఒకే మార్గంలో ఉండనున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న ప్రాంతాలను కలపడమే కాకుండా నివాస, వ్యాపార వాణిజ్య కేంద్రాలను, ఔటర్ రింగు రోడ్డు ఇంటర్‌చేంజ్ కేంద్రాలను కలిపేలా మెగా మెట్రో మార్గం అందుబాటుకి వస్తే హైదరాబాద్ మహానగరంలో ప్రజా రవాణా వ్యవస్థ ముఖ చిత్రం సమూలంగా మారిపోనుంది.

# చలికి వణుకుతున్న ఉత్తరాది రాష్ట్రాలు

ఆయా ప్రాంతాలను దట్టమైన పొగ కమ్మేసింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. ఈ క్రమంలో పొగమంచు కారణంగా ఢిల్లీ లఖ్‌నవూ జాతీయ రహదారిపై అరడజనుకుపైగా వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. శుక్రవారం ఉదయం ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఫలితంగా దృశ్యమానత దారుణంగా పడిపోయింది. కొన్ని ఏరియాల్లో విజిబిలిటీ జీరోగా నమోదైంది. ఈ కారణంగా ముందు వెళు న్న వాహనాలు కనిపించని పరిస్థితి. ఫలితంగా ఇవాళ ఉదయం ఢిల్లీ లఖ్‌నవూ జాతీయ రహదారిపై ఆరుకుపైగా కార్లు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఆ కార్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడినట్లు సమాచారం. ఆ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రంగంలోకి దిగిన అధికారులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# నెక్నాంపూర్ చెరువులో ఆక్రమణల కూల్చివేత

## అక్రమ కట్టడాలను కూల్చేసిన హైడ్రా

హైదరాబాద్ : నగరంలోని మణికొండలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో ఆక్రమణలను కూల్చివేసింది. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన నాలుగు విల్లాలను నేలమట్టం చేసిన హైడ్రా సిబ్బంది.. మరికొన్ని విల్లాలను కూల్చివేయడానికి సన్నద్ధమయ్యారు. అయితే నెక్నాంపూర్ చెరువును కబ్జా చేయడంతో గతంలో రెవన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు కూల్చివేశారు. మూడు సార్లు కూల్చివేసినా మళ్లీ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు కూల్చివేతలు సాగుతున్నాయి. అలాగే విల్లాలను నిర్మించిన బిల్డర్లపైన హైడ్రా కేసు నమోదు చేసింది. నెక్నాంపూర్ చెరువుపై అక్రమంగా నిర్మించిన దాదాపు 10కి పైగా విల్లాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. గతంలో కూల్చివేతలు చేసినప్పటికీ తిరిగి నిర్మాణాలు చేయడంపై హైడ్రా అధికారులు సీరియస్ అయ్యారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు వచ్చినటువంటి నేపథ్యంలో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా ఈరోజు కూల్చివేతలను చేపట్టింది హైడ్రా. దాదాపు నాలుగు విల్లాలను కూల్చివేసిన అధికారులు... మరో పది విల్లాలను కూల్చివేయనున్నట్లు తెలుస్తోంది. నెక్నాంపూర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఈ నిర్మాణాలు వెలిశాయి. గతంలో టౌన్ ఎ÷–లానింగ్ అధికారులు, రెవన్యూ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఆ తరువాత తిరిగి నిర్మాణాలు వెలిశాయి. మూడు సార్లు కూల్చివేతలు జరిగినప్పటికీ స్థానిక అధికారులను మేనేజ్ చేసుకుని అక్రమ నిర్మాణాలను చేస్తున్నారంటూ స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో నెక్నాంపూర్ చెరువులో వెలసిన అక్రమ విల్లాలను హైడ్రా అధికారులు నేలమట్టం చేస్తున్నారు.

# కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్

సారించామని, మచిలీపట్నం పోర్ట్‌ను అనుసంధానం చేస్తు రోడ్లు రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రీజనల్ రింగ్ రైల్వే లైన్ మంజూరు చేయాలని ప్రధాని మోదీని కోరామని చెప్పారు. చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, అవుటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్లు నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ప్రతి యేడాది లక్షా పదివేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. ఎక్కువ మంది విద్యార్థుల్లో స్కిల్ ఉండటం లేదని, టాటా గ్రూప్‌తో కలిసి 2400 కోట్లతో రాష్ట్రంలోని ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామన్నారు. నైపుణ్యాల పెంపు కోసం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఐఎస్ బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీ కోసం ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ కార్పస్ ఫండ్ కోసం సీఐఐ ప్రతినిధులు మద్దతు ఇవ్వాలని, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీఐఐ ప్రతినిధులు ఎప్పుడైనా వచ్చి తనను కలవచ్చు.. తమ ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించుకున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచంలో హైదరాబాద్‌ను చైనాకు ప్లస్ సిటీగా మార్చే వ్యూహంతో ముందుకు వెళు న్నామని అన్నారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్ , దుబాయ్ వంటి నగరాలతో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని వివరించారు. భారతదేశంలోనే గొప్ప నగరాన్ని నిర్మించాలని అనుకుంటున్నాం.. ఇందులో సేవారంగం మాత్రమే ఉంటుందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు పన్నును తొలగించామని ప్రకటించారు. ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 3,200 ఈవీ బస్సులను ఆర్టీసీలోకి తీసుకువస్తున్నామని అన్నారు. భారతదేశంలోనే ఎలక్ట్రిక్ వాహనాలు అత్యంత వేగంగా తెలంగాణలో అమ్ముడవుతున్నాయని ముఖ్యమంత్రి వివరించారు.

# 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'

వివిధ ప్రాజెక్టులకు సేకరించిన భూముల వివరాలను సేకరించాలి. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులను క్రోడీకరించుకోవాలి. గ్రామాల మ్యాప్‌లను పరిశీలించి క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకోవాలి. వాటిపై గ్రామ సభల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని సీఎం వివరించారు. ఈ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తోందని.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన కులగణన సర్వే 96 శాతం పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్లకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కలెక్టర్లేనని అన్నారు. కలెక్టర్ల పనితీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం అని తెలిపారు. కలెక్టర్లు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చాం.. కానీ కొంతమంది ఇంకా ఆఫీసులలో కూర్చునే పనిచేయాలని భావిస్తున్నారని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సమస్యలు వచ్చినప్పుడు సమర్ధవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది.. మీ పని తీరును మరింత మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మరోవైపు.. వ్యవసాయ యోగ్యం కాని భూములకు కూడా గతంలో రైతు పెట్టుబడి సాయం అందించారు.. అనర్హులకు రైతు భరోసా ఇవ్వొద్దని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో వెళ్లి అనర్హులను గుర్తించాల్సిందే.. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలన్నారు. రాష్ట్రంలో వన్ రేషన్ వన్ స్టేట్ విధానాన్ని తీసుకురాబోతున్నాం.. తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలని సీఎం కలెక్టర్లకు చెప్పారు. ఈ నెల 11 నుంచి 15 లోగా పథకాల అమలుకు కావాల్సిన ప్రిపరేటరీ వర్క్ పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్లు అర్హుల జాబితాను ఇంఛార్జి మినిస్టర్ కు అందించాలని సీఎం చెప్పారు. ఇంఛార్జ్ మినిస్టర్ ఆమోదంతోనే కలెక్టర్లు అర్హుల జాబితాను విడుదల చేయాలన్నారు. జనవరి 26న అంత్యంత ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేయబోతున్నాం.. ఇందుకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని, గొప్పగా పనిచేస్తున్నదన్న నమ్మకం ప్రజలకు కలిగించాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా హాస్టల్స్ విజిట్ చేసి రాత్రి బస చేయాలని తెలిపారు. మహిళా అధికారులు బాలికల హాస్టల్స్‌కు వెళ్లి అక్కడి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపండని చెప్పారు. సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోండి.. జనవరి 26 తరువాత తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని అన్నారు. నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి కలెక్టర్లను హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు ప్రధాన పథకాలను ఈనెల 26వ తేదీ నుండి అమలుచేయాలని నిర్ణయించామన్నారు. భారీ వ్యయంతో కూడుకున్నప్పటికీ.. రాష్ట్రంలోని పేదలకు మేలు చేయాలన్న భావనతో విస్తృతంగా చర్చించిన మీదటే.. ఈ పథకాలను అమలు చేయాలనే నిర్ణయం తీసుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇప్పటికే.. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశామని.. ఈ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యం తీసుకోవాలని సూచించారు. లబ్దిదారుల ఎంపికను, ప్రతీ ఉమ్మడి జిల్లాలో ఇంఛార్జి మంత్రులు ఇందిరమ్మ కమిటీలతో చర్చించిన మీదటే చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుతం నిర్ణయించే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల వివరాలను ప్రతీ గ్రామంలో ప్లెక్సీల ద్వారా ప్రకటించాలని అన్నారు. ఇప్పటికే, రాష్ట్రంలో రూ.22000 కోట్ల రైతు రుణ మాఫీలను చేశాం.. ఈ వివరాలను కూడా ప్రతీ గ్రామంలో ప్రకటించాలని తెలిపారు. ఈ నాలుగు పథకాలను సంబంధించి సవివరమైన మార్గ దర్శకులతో ఉత్తర్వులు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్దిదారులను ఎంపిక చేయాలి.. ఈ పథకాలపై జిల్లాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు.

# సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై అసంతృప్తి

హైదరాబాద్ : గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రత్యేక ప్రదర్శనల అనుమతిపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందగా... బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ జైలుకు వెళ్లి.. బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే తొక్కిసలాట ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై బెన్‌ఫిట్‌షోల కు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. దిల్ రాజు నేతృత్వంలో సినీ పెద్దలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలువగా ఇదే విషయాన్ని తేల్చి చెప్పారు సీఎం. ఇదిలా ఉండగా... శంకర్ దర్శకత్వంలో రాంచరణ్ నటించిన గేమ్ చేంజర్ సినిమా టికెట్‌ల ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అర్ధారత్రి ఒంటి గంటకు బెనిఫిట్ షోలకు అనుమతించని ప్రభుత్వం.. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల షోకు అనుమతినిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల పెంపు, స్పెషల్ షోలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొందరు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. గురువారం ఈ పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి విచారించగా.. గేమ్ చేంజర్ సినిమా స్పెషల్ షోకు అనుమతి ఇవ్వడంపై పిటిషనర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. టికెట్ పెంపుపై ఉత్తర్వులు ఇవ్వకుండా ఆదేశించాలని హైకోర్టును పిటిషనర్ కోరారు. దీనిపై విచారణను శుక్రవారానికి వాయిదా వేసిన కోర్టు.. నేటి విచారణలో ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 24కు హైకోర్టు వాయిదా వేసింది.

# మరుభూమిలా లాస్‌ఏంజిల్స్ నగరం

## సందెట్లో సడేమియాలా లూటర్లు 20మంది అరెస్ట్

లాస్ ఏంజిల్స్ : ఒకప్పుడు సంపదతో తులతూగిన లాస్ ఏంజెలెస్ నగరం నేడు మరుభూమిని తలపిస్తోంది. అక్కడ ధనవంతులు, హాలీవుడ్ స్టార్లు వదిలేసి వెళ్లిపోయిన ఇళ్లల్లో విలువైన వస్తువులను దొంగలు దోచుకుంటున్నారు. తాజాగా అక్కడి షరీఫ్ డిపార్ట్‌మెంట్ 20మంది లూటర్లను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. ఎవరైనా వదిలేసిన ఆస్తుల జోలికివస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. సంక్షోభ సమయంలో ప్రజలను దోచుకునేవారు సిగ్గుపడాలని కౌంటీ సూపర్‌వైజర్ కాథరిన్ బెర్జర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. అందుకే షరీఫ్ డిపార్ట్‌మెంట్ గస్తీలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు.పసిఫిక్ పాలిసాడ్స్ ప్రాంతాన్ని కార్చిచ్చు పూర్తిగా దగ్ధం చేసింది. ప్రపంచంలోనే అతిపెద్దదైన బన్నీ మ్యూజియం ఈ కార్చిచ్చులో పూర్తిగా దగ్ధమైంది. ఇక్కడే అతిపెద్ద బన్నీ కలెక్షన్ ఉన్నట్లు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో గతంలో స్థానం సంపాదించింది. దాదాపు 46,000 కుందేళ్ల రూపంలో ఉన్న వస్తువులు మంటల్లో కాలిపోయాయి. ఈ విషయాన్ని ఉపగ్రహ చిత్రాలు స్పష్టంగా చెబుతున్నాయి. ఇక ఆల్టడెనా ప్రాంతంలో నేడు 83 సంవత్సరాల వృద్ధుడు ఈ కార్చిచ్చులో ప్రాణాలు కోల్పోయారు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. మొత్తం 9,000 నిర్మాణాలు కాలిబూడిదయ్యాయి. ఒక్క పాలిసాడ్స్‌లోనే 5,300 నిర్మాణాలు దగ్ధమయ్యాయి. ఉడ్‌లాండ్ హిల్స్‌లో ఓ వ్యక్తి ఉద్దేశపూర్వకంగా కెన్నిత్ కార్చిచ్చును అంటించినట్లు అనుమానించడంతో భద్రతా దళాలు అతన్ని అదుపులోకి తీసుకొన్నాయి. పాలిసాడ్స్‌లో దాదాపు 20 వేల ఎకరాలు, ఈటొన్స్ ÷ర్ 13,600 ఎకరాలు, కెన్నెత్స్ ÷ర్, 791 ఎకరాలు, సన్‌సెట్స్ ÷ర్ 60 ఎకరాలు, హుర్స్ట్స్ ÷ర్ 855 ఎకరాలను దహించేశాయి. ఇప్పటికే 1.80 లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలిఫోర్నియా చరిత్రలోనే అత్యంత భారీ నష్టం చేసిన కార్చిచ్చు ఇదే. ఇప్పటివరకు అక్యూవెదర్ అంచనాల ప్రకారం నష్టం 150 బిలియన్ డాలర్లు (సుమారు రూ.12లక్షల కోట్లు)గా ఉంటుందని అంచనా వేసింది. కేవలం 24 గంటల్లోనే ఈ అంచనాలు మూడింతలు పెరగడం గమనార్హం. అమెరికాలోనే అత్యంత ఖరీదైన గృహాలు ఇక్కడ ఉండటమే ఇందుకు కారణమని ఆ సంస్థ ప్రధాన వాతావరణ శాస్త్రవేత్త జోనాథన్ పోర్టర్ తెలిపారు. తీవ్రమైన పెనుగాలుల కారణంగా మంటలు శరవేగంగా వ్యాపిస్తున్నాయి. అమెరికా బీమా రంగం కూడా ఈ కార్చిచ్చు దెబ్బకు కదేలయ్యే పరిస్థితి నెలకొంది. జేపీ మోర్గాన్, మార్నింగ్ స్టార్ అంచనాల ప్రకారం 20 బిలియన్ డాలర్ల వరకు బీమా సంస్థలకు నష్టం రావచ్చని పేర్కొంది. కాలిఫోర్నియాలోని అతిపెద్ద బీమా సంస్థ స్టేట్ ఫామ్ కొన్ని నెలల కిందటే పాలిసాడ్స్‌లోని కొన్ని ప్రాంతాల్లోని ఇళ్లకు కార్చిచ్చు ముప్పు ఉందని గ్రహించి పాలసీలు ఇవ్వడం మానేసింది. ఆర్థిక వైఫల్యాలను నుంచి కాపాడుకోవడానికే ఇలా చేసినట్లు పేర్కొంది. తాజాగా ఇప్పుడు అదే ప్రాంతంలో కార్చిచ్చు దాదాపు 5,600 ఇళ్లను కాల్చేసింది. గత మూడేళ్లలో చాలా బీమా సంస్థలు ఈ ప్రాంతాల్లో కవరేజీని తగ్గించేశాయి. మరోవైపు దక్షిణ కాలిఫోర్నియాలో కార్చిచ్చు బాధిత ప్రాంతాల్లో ఆరు నెలల పాటు ప్రభుత్వం ఖర్చులు భరిస్తుందని అధ్యక్షుడు జోబైడెన్ ప్రకటించారు. శిథిలాల తొలగింపు వంటి చర్యల్లో సాయం చేస్తామన్నారు. ఓ పక్క వేల మంది అగ్నిమాపక సిబ్బంది అక్కడ మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నా.. గాలుల కారణంగా వ్యాప్తి తీవ్రంగానే ఉంటోంది. తరచూ తక్కువ వాటర్‌ప్రెజర్ కారణంగా నీటిని చిమ్మడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఫైర్ హైడ్రాంట్స్‌లో కూడా నీరు వెంటనే ఖాళీ అవుతుండటం ఇక్కడి సమస్యలకు ప్రధాన కారణంగా నిలిచింది.

# ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఎసిబి దూకుడు

వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. ఈ మేరకు నేడు విచారణ చేపట్టింది. అయితే ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ఆదేశాలతోనే నగదు రిలీజ్ చేసినట్లు విచారణలో బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాను ప్రొసీడింగ్స్ అన్ని పూర్తి చేశానని రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. ఇందులో తన సొంత ప్రయోజనాలు ఏమీ లేవని ఏసీబీ అధికారులకు బీఎల్ఎన్ రెడ్డి వివరించినట్లు సమాచారం. ఒకవైపు మంత్రి కేటీఆర్.. మరోవైపు పైఅధికారి ఒత్తిడి వల్లే రూ.55 కోట్లకు సంబంధించి తాను ప్రొసీడింగ్స్ చేసినట్లు బీఎల్ఎల్ రెడ్డి విచారణలో చెప్పారు. నగదు బదిలీ చేస్తే భవిష్యత్తులో ఇరుక్కుపోతామని తనకు ముందే తెలుసని ఏసీబీ అధికారులకు బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. అయినా అప్పటి పరిస్థితుల వల్లే నిబంధనలకు విరుద్ధంగా ముందుకు వెళ్లాల్సి వచ్చినట్లు చెప్పినట్లు సమాచారం. తాను ఏసీబీ విచారణకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని, ఈడీ అడిగిన ప్రశ్నలనే మీరూ అడుగుతున్నారని ఏసీబీ అధికారులకు ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. ఈడీ అడిగిన ప్రశ్నలన్నిటికీ తాను సమాధానం ఇచ్చానని, ఏసీబీ విచారణలో బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారు..? ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌ను అడ్డగోలుగా తిడుతున్నా పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేంటని అన్నారు. ఢిల్లీ వెళ్లి కేసీఆర్ కాంగ్రెస్ హై కమాండ్‌కు కప్పం కడుతున్నందుకే రేవంత్ ఏం చేయలేకపోతున్నారా.. అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని.. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలపై, కేసీఆర్ కుటుంబ అవినీతిపై బీజేపీ రాజీలేని పోరు కొనసాగిస్తోందని ఈ సందర్భంగా బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు బిజెపి అభ్యర్థుల ప్రకటన


మల్క కోమరయ్య పేరును ప్రకటించింది. అలాగే వరంగల్- ఖమ్మం-నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సర్వోత్తం రెడ్డిని కాషాయం పార్టీ ప్రకటించింది. అన్ని ప్రధాన పార్టీల కంటే ముందే తమ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ.. ప్రచారంలోనూ దూకుడు పెంచేలా కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మెరుగైన స్థానాలు సాధించడంతో ఎమ్మెల్సీ ఎన్నికలపైనా ప్రస్తుతం ఫోకస్ పెట్టింది. ముందుగానే అభ్యర్థులను ప్రకటించి ప్రజల దృష్టిని ఆకర్షించేలా చేస్తోంది. ఈ మూడు స్థానాలను సైతం కైవసం చేసుకునే దిశగా పావులు కదుపుతోంది.

# తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా వైకుంఠద్వార దర్శనం

**వైష్ణవాలయాలకు పోటెత్తిన భక్తజనం**

**యాదాద్రి, భద్రాద్రి, ధర్మపురిల్లో ఉత్తర ద్వారదర్శనం**

హైదరాబాద్ : వైకుంఠ ఏకాదశి వేడుకలు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి నుంచి పలు వైష్ణవాలయాలకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఆలయాలను తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. ఈ రోజు విష్ణువును దర్శించుకుంటే వైకుంఠం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. దీంతో ఈ పుణ్య రోజున భక్తులు లక్షలాదిగా వైష్ణవాలయాలకు తరలివస్తారు. తిరుమలలో స్వామివారికి ఏకాంతంగా కైంకర్యాలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం 4.30 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. భద్రాచలంలో సరిగ్గా ఉదయం 5 గంటలకు భక్తులకు సీతారామచంద్ర స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. స్వామి సేవలో తరించేందుకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. యాదగిరిగుట్టలో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. గరుడ వాహనంపై వాసుదేవుడి రూపంలో స్వామివారు ఉత్తర ద్వార దర్శనం ఇవ్వనున్నారు. ఇవాళ స్వామివారికి గరుడ సేవోత్సవం, తిరువీధిసేవ నిర్వహించనున్నారు. ధర్మపురి నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. జంటనగరాల్లో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హిమాయత్ నగర్, జూబ్లీహిల్స్ వెంకటేశ్వరాలయాలు, బంజారాహిల్స్ వేంకటేశ్వరాలయం, చిక్కడపల్లి, పెద్దమ్మగుడి, నానాక్‌రామ్ గూడ, ఓల్డ్ సిటీ రంగనాథ స్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు చేసారు. వేకవ జామునుంచే ఆలయాలను దర్శించుకుని వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. చిలుకూరు ఆలయానికి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# హుజురాబాద్ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తా



**- పార్టీ విలువలకు ప్రాధాన్యత ఇవ్వండి...**

**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**

జమ్మికుంట జనవరి 10 (ది క్రైమ్ న్యూస్) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ ని గారిని ఈరోజు కరీంనగర్ లో లోని వారి నివాసంలో కలిసి హుజురాబాద్ నియోజకవర్గం కి ఈజీఎస్ నిధుల కింద కేటాయించిన పనులు కాకుండా మరికొన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, బిజెపి జమ్మికుంట మండలాధ్యక్షుడు సంపెల్లి సంపత్ రావు లు కోరగా కేంద్ర మంత్రి దీనికి సానుకూలంగా స్పందించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ప్రణాళిక లు చేయాలని అదేవిధంగా స్థానిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని అప్పుడే స్థానిక సంస్థలు గెలుపొందే అవకాశం ఉంటుందని అన్నారు.

# శిక్షణతో నూతన పరిజ్ఞానం పొందాలి.

**సింగరేణి ఎస్.ఓ టూ జీఎం రాముడు.**



యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్): సింగరేణి రామగుండం రెండవ డివిజన్ యాజమాన్యం, డివిజన్ పరిధిలో పనులు చేస్తున్న మహిళా ఉద్యోగులకు డిసిగ్నేషన్ పోస్టుల కేటాయించింది. శుక్రవారం ఓసీపీ.3 ప్రాజెక్టు అధికారి కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి డివిజన్ ఎస్.ఓ టూ జీఎం ఏం.రాముడు అధ్యక్షత వహించి 40 మంది మహిళా ఉద్యోగులకు డిసిగ్నేషన్లు కల్పించారు. డివిజన్ పరిధిలోని జనరల్ మేనేజర్ కార్యాలయం, ఓసిపి.3 స్టోర్స్, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయం, ప్రాజెక్ట్ అధికారి కార్యాలయాల్లో పనులు చేస్తున్న మహిళా బదిలీ వర్కర్లు / జనరల్ మజ్దూర్ లకు సర్ఫేస్ లో ఏర్పడిన ఖాళిల్లో 16 డిసిగ్నేషన్ లలో మహిళా ఉద్యోగాలకు సీనియారిటీ పద్ధతిన అవకాశం కల్పిస్తూ.. ఆయన పోస్టులు కేటాయించారు. ఇక ఈ సందర్భంగా ఎస్.ఓ టూ జీఎం రాముడు ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎంచుకున్న ఉద్యోగాలకు అనుగుణంగా తగిన శిక్షణ ఇచ్చిన తర్వాత, సంభందిత విధులు నిర్వహించేందుకు ఆయా స్థానాలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఇక చేస్తున్న పనిలో నైపుణ్యతను పెంపొందిచుకుంటూ.. నూతన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన మహిళా ఉద్యోగులకు సూచించారు. ఈ డెసిగ్నేషన్ ల కేటాయింపు కార్యక్రమంలో అధికారులు మురళీకృష్ణ, డిజిఎం (పర్సనల్) %ు% అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డా.మహిపాల్, సంక్షేమాధికారులు రాజు, అజీజ్ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## తొలి వైకుంఠ ఏకాదశి..శ్రీరామమందిర ఆలయానికి పోటెత్తిన భక్తులు..



ఉమ్మడి కరీంనగర్ బ్యూరో(ది క్రైమ్ న్యూస్) :కరీంనగర్ జిల్లా కేంద్రంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠ ఏకాదశి కావడంతో భారీగా భక్తులు తరలివస్తున్నారు. విష్ణునామ స్మరణతో మారుమోగుతున్నాయి. తెల్లవారు జాము నుంచే వైష్ణవ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణంలోని శాతవాహన యూనివర్సిటీ శ్రీరామ్ నగర్ లోని శ్రీరామ మందిరం ఆలయానికి భక్తులు పోటెత్తారు. వైకుంఠ ఏకాదశి కావడంతో ఉత్తర ద్వారం దర్శనం కోసం భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తి శ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ నిర్వహణ అధ్యక్షులు మాధవరావు, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు నరోత్తం రెడ్డి, నరసింహ చారి అధ్వర్యంలో క్యూలైన్లను ఏర్పాటు మంచినీటి వసతి వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

# పోలీసులకు సంక్రాంతి కానుక

## 187మందికి ఎస్ఐలుగా ప్రమోషన్

హైదరాబాద్ ) :కానిస్టేబుల్స్‌కు తెలంగాణ ప్రభుత్వం సంక్రాంతి కానుక ప్రకటించింది. 1989, 1990 బ్యాచ్ లో ఎంపికైన పోలీస్ కానిస్టేబుల్స్‌కు ప్రభుత్వం ప్రమోషన్ కల్పించింది. హైదరాబాద్ రీజియన్లోని 187 ఏఎస్‌లకు ఎస్ఐ గా ప్రమోషన్ కల్పించింది. ఈ మేరకు డిజిపి జితేందర్ఆదేశాలతో ప్రమోషన్లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రీ ప్రమోషనల్ ట్రైనింగ్ పూర్తి చేసిన రోజునే ప్రమోషన్స్ ఇవ్వడంతో సిబ్బందిలో ఆనందోత్సవాలతో సంబరాలు చేసుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో పోలీస్ డిపార్ట్ మెంట్ ను పెద్దగా పట్టించుకోలేదు. కానిస్టేబుళ్ల ప్రమోషన్స్ ను నిర్లక్ష్యం చేసింది. కోర్టుల్లో కేసులున్నాయంటూ ప్రమోషన్లు ఆపేసింది. ఇతర డిపార్టమెంట్లలో తమతో పాటు జాయిన్ వారు పెద్ద పొజిషన్‌లో ఉండగా.. తాము మాత్రం ఎక్కడికక్కడే మిగిలిపోవాల్సివచ్చిందని కానిస్టేబుల్స్ బాధ పడేవారు. ఈ క్రమంలో 187 మందికి ప్రమోషన్ కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వం.

# భగవతి, ఆర్విన్ ట్రీలో సంక్రాంతి సంబరాలు....






కరీంనగర్ టౌన్, జనవరి10(ది క్రైమ్ న్యూస్) : భగవతి , ఆర్విన్ ట్రీ పాఠశాలలలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ బి. రమణ రావు దీప ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించగా చిన్నారులు భగవద్గీత శ్లోకాలను చాలా చక్కగా ఆలపించారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులతో చూపరులను ఆకట్టుకోగా , వేదికను సంక్రాంతి పండగకు అనుగుణంగా భోగి మంటలు , ఎడ్ల బండి , భోగి పండ్లు , చెరకు గడలతో పండగ , ముగ్గులతో వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్లుగా కనిపించేలా చేయగా , డూ డూ బసవన్నలు , గాలి పటాలు ఎంతో ఆకట్టుకున్నాయి . విద్యార్థులు , ఉపాధ్యాయులు సంక్రాంతి పర్వదినం గురించి వివరించారు. విద్యార్థులు పండగ విశిష్టతను తెలియచేసేలా నృత్య గీతాలతో అలరింపచేసారు. విద్యార్థులు పాఠశాల ముందు తమలోని సృజనాత్మకతను జోడిస్తూ వేసిన రంగవల్లులు ఎంతో ఆకర్షణీయంగా నిలవగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొని తమలోని సృజనాత్మకతను వెల్లివిరిసేలా పోటీ పడ్డారు. పాఠశాల ఛైర్మన్ బి. రమణ రావు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో పాల్గొని పండగ వాతావరణాన్ని తలపించిన విద్యార్థులకు , ఉపాధ్యాయులకు అభినందనలు తెలియచేశారు. విద్యార్థులకు మన పండగలు , విశిష్టత, ఆచార సాంప్రదాయాల పట్ల అవగాహన కలుగుతుందని , ముగ్గులు వేయడం ద్వారా వారిలోని సృజనాత్మక శక్తి వెలికి తీయవచ్చని తెలియచేశారు. ప్రతీ పండగ విశిష్టతను, భారతీయతను ఎప్పటికప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేయాలని వివరించారు. అందరికీ ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు.

# భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు.





యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్): స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం కన్నుల పండుగగా, భక్తిశ్రద్ధలు మధ్య జరిగిన కార్యక్రమంలో సింగరేణి రామగుండం రెండవ డివిజన్ జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య, వనజా దంపతులు, ఎస్.ఒ టూ జీఎం ఎం.రాముడు దంపతులు పాల్గొని, వైకుంట (ఉత్తర) ద్వారం నుండి దర్శనము ఇచ్చిన శ్రీ మహా విష్ణువు ను దర్శించుకుని, స్వామివారి పల్లకి సెవలో పాల్గొన్నారు. అనంతరం వేదపండితుల వేదమంత్రాల మధ్య అర్చన, ప్రత్యేక పూజా కైకర్యాలు నిర్వహించారు. ఇక ఈ సందర్భంగా జిఎం వెంకటయ్య స్వామివారిని ప్రార్థిస్తూ.. ఏరియాలోని ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు ధనుంజయ, ఎర్రన్న, మురళీకృష్ణ, చంద్ర శేఖర్, రాజారెడ్డి, షరీఫ్ మహమ్మద్, రాధాకృష్ణ, కాలనీ పట్టణ భక్తజనుల పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను వసూళ్లలో రాష్ట్రస్థాయిలో తొలి స్థానంలో కొనసాగుతున్న జమ్మికుంట మున్సిపాలిటీ...

**- మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయ్యాజ్**



జమ్మికుంట జనవరి 10 (ది క్రైమ్ న్యూస్) : రాష్ట్రంలో మున్సిపాలిటీల ఆస్తి పన్ను లలో రాష్ట్ర స్థాయిలో మొదటి వరుస సాధించినందుకు మున్సిపల్ ఛైర్మన్, వైస్ చైర్మన్ పాలక వర్గానికి, మున్సిపాలిటీ ప్రజలకు , పత్రిక మిత్రులకు మున్సిపల్ కమిషనర్ ముహమ్మద్ అయాజ్ ధన్యవాదాలు తెలిపారు. శనివారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్ లతో ప్రత్యేక సమావేశం నిర్వచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మొహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో ముందు వరుసలో నిలిచామని ఆయన అన్నారు. నల్ల బిల్లు వసులు లో స్టేట్ లో మూడో స్థానం, భువన్ లో వంద శాతం పూర్తి చేసుకొని నాలుగో స్థానములో నిలిచాము. జమ్మికుంట మున్సిపాలిటీలో ఇంకా పన్నులు చెల్లించె వారు ఉన్నారని వచ్చే నెల చివరి వరకు పూర్తిస్థాయిలో పన్నుల వసూళ్లు చేయాలని కమిషనర్ ఆయాజ్ అన్నారు. మార్చి నెల చివరి వరకు వంద శాతం వసులు చేయాలని చెప్పినారు. పన్నుల వసూళ్లకు సహకరిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, పాలక వర్గానికి, వైస్రాయ్ మున్సిపల్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, రెవెన్యూ ఇన్ స్పెక్టర్, భాస్కర్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు పలువురు పాల్గొన్నారు.

## మృతి చెందిన గుమస్తా కుటుంబానికి ఆర్థిక సాయం...

జమ్మికుంట జనవరి 10 (ది క్రైమ్ న్యూస్) : జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బండి వెంకటేష్ అనే



గుమస్తా గత నెల మూడో తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. గుమస్తాల సంఘం అధ్యక్షులు పోశాల వెంకన్న ఆధ్వర్యంలో గుమస్తాలు అందరూ కలిసి అత్తిదారుల సహాయంతో 53000 కలెక్ట్ చేసి వాటి రూపాయలను మృతుడి కూతురైన అన్విత శ్రీ పేరుమీద సుకన్య యోజన పథకంలో పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్ డిపాజిట్ చేశారు. తనతో పని చేసిన గుమస్తాకు అండగా తాము ఉన్నామని తెలియజేస్తూ ఆ కుటుంబానికి ఆర్థిక చేయూతని అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## అనుమతి లేకుండా ర్యాలీ

**కెటిఆర్‌పై బంజారాహిల్స్ పోలీసుల కేసు**

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు బంజారాహిల్స్ పోలీసులు షాక్ ఇచ్చారు. అనుమతి లేకుండా ర్యాలీ చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు నమోదు అయ్యింది. గురువారం ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో భాగంగా ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను విచారించిన సంగతి తెలిసిందే. అయితే విచారణ అనంతరం ఎటువంటి అనుమతి లేకుండా ఏసీబీ కార్యాలయం నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వరకూ కేటీఆర్ పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు సృష్టించారంటూ ట్రాఫిక్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు నమోదు అయ్యింది. కాగా, ఇప్పటికే ఫార్ములా-ఈ కార్ రేస్ కేసు మెడకు చుట్టుకుని కేటీఆర్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాజాగా మరో కేసు నమోదు అవ్వడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నారు.

## ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి మెట్టుపల్లి డివిజన్ కమిటీ సమావేశ ఏర్పాటు...



కరీంనగర్ టౌన్, జనవరి10(ది క్రైమ్ న్యూస్) : ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి మెట్టుపల్లి డివిజన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. మానుపాటి రవి కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి బిజిలి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి బిజిలి శ్యామ్ దాసరి వెంకటేష్ ఎరుకల ఉద్యోగుల సంఘం జాతీయ కో-కన్వీనర్ దాసరి కిషన్ ఎరుకల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఓలుగుత్తుల పోచయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మెట్పల్లి డివిజన్ కమిటీని నియమించడం జరిగినది మెట్టుపల్లి డివిజన్ కమిటీ అధ్యక్షులుగా అంగిడి ధనుంజయ్ అధ్యక్షులుగా అంగిడి పెద్ద పోచయ్య, సలహాదారుగా అంగిడి పురుషోత్తం ప్రధాన కార్యదర్శిగా కండ్లీ లక్ష్మణ్ ఉపాధ్యక్షులుగా లోకిని కిష్టయ్య అంగిడి జంపయా కోశాధికారి పాలకుర్తి లింగయ్య సహాయ కార్యదర్శులుగా లోకిని రవీందర్ లోకిని మహేష్ ప్రచార కార్యదర్శిగా లోకిని సునీత్ కమిటీ సభ్యులుగా జియో దశరథం అంగిడి ప్రసాద్ లోకిని గంగారం లోకి కుమార్ లోకిని రవీందర్ లోకిని గంగ పోచయ్య నియమించడం జరిగినది. ఈ సమావేశంలో మానుపాటి రవి ఎరుకల కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఎరుకల ప్రజలు సామాజిక రాజకీయంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని వారికి ప్రభుత్వం ద్వారా వస్తున్నటువంటి పథకాలు అందడం లేదని ప్రభుత్వం నిర్మించబోయే ఇందిరమ్మ ఇల్లు ఎరుకలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం బ్యాంకుల పూచికత్తు లేకుండా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగినది మెట్పల్లి డివిజన్ అధ్యక్షులుగా ప్రధాన కార్యదర్శిగా నియమించబడిన ధనుంజయ్ కండ్లి లక్ష్మణ్ మాట్లాడుతూ మెట్టుపల్లి డివిజన్లో గల ఎరుకల ప్రజల అభివృద్ధి కోసం ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి కావలసిన నిధులు నియామకాల కోసం పోరాడుతామని సంఘ బలోపేతం కోసం కృషి చేస్తామని ఈ కమిటీకి సహకరించినటువంటి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

# సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్

**23 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్**

హైదరాబాద్ : హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్లో భాగంగా రూ. 5.29 కోట్ల మోసాలకు పాల్పడ్డ 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు పోలీసులు. ఈ సైబర్ చీటర్స్ ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో ఉంటూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు పోలీసులు. తెలంగాణలో వీరిపై 30 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు పోలీసులు. పోలీసులు అరెస్ట్ చేసిన కేటుగాళ్లు దేశవ్యాప్తంగా 328 కేసుల్లో నిందితులుగా ఉన్నారని.. ఇన్వెస్ట్మెంట్, డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్, ఏపీకే, జాబ్ ఫ్రాడ్ కేసుల్లో మోసాలకు పాల్పడ్డట్లు తెలిపారు పోలీసులు. 70 ఏళ్ళ బాధిత వృద్ధుడు మొబైల్ హ్యాక్ అయ్యి రూ1.9 కోట్లు మోసపోయాయని ఫిర్యాదు చేయగా.. ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు పోలీసులు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం అంటూ మొబైల్ కి వచ్చే మెసేజ్ లలో ఉన్న లింకులను ఎట్టి పరిస్థితిలో క్లిక్ చేయొద్దని.. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేసి ఓటీపీలు వంటి కీలక సమాచారాన్ని ఇవ్వొద్దని సూచించారు పోలీసులు.

## తిరుపతి ఘటనలో కుట్ర కోణం

**మంత్రి సవిత సంచలన ఆరోపణలు**

అమరావతి ) :తిరుపతి ఘటన బాధాకరమని మంత్రి సవిత అన్నారు. తొక్కిసలాట ఘటనపై ఆమె మాట్లాడుతూ.. 'తిరుపతి ఘటనలో కుట్రపూరితంగా చేశారని అంటున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలని కావాలని చేశారని అంటున్నారు. క్లారిటీ వచ్చాక ఈ విషయాలపై మాట్లాడతాం. సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. మృతులకు 25 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. మాజీ సీఎం జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు. సీఎంగా ఉండగా జగన్ ఏమి చేశారో మాకు తెలుసు. బాబాయ్ గొడ్డలి పోటు, కోడికత్తి, గులకరాయి డ్రామాలు తెలుసు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 30 మంది చనిపోయారు. రాజకీయ ఉనికి కోసమే జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు. జగన్ పాలనపై విరక్తి చెంది జనం 11 సీట్లకు పరిమితం చేశారు. జగన్ ఏనాడైనా జనంలోకి వచ్చారా? దోచుకున్నది దాచుకోవడానికి పరిమితమయ్యారు..' అని మంత్రి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# సూర్యాపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఒడిషాకు చెందిన ఐదురుగు దుర్మరణం

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒడిశాలోని రాయగడ ప్రాంతానికి చెందిన ఐదుగురు మృతిచెందారు. ఆగి ఉన్న లారీని ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలంలోనే నలుగురు, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. 16 మంది కూలీలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. కూలీలు పనుల కోసం ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సంపాదకీయం

## గగ్గోలు పెడితే..అబద్ధాలు నిజాలు కావు !

తప్పు చేయలేదు..కానీ వేలకోట్ల ఆస్తులు మాత్రం సమకూరాయి. భూములన్నీ హాంఫట్ అయ్యాయి. ధరణి పేరుతో పేదలను జలగల్లా పీల్చారు. పథకాల పేరుతో డబ్బులు పందేరం చేశారు. సిరిసిల్లలో 2500 ఎకరాల ప్రభుత్వ భూమి అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టారు. ఇదంతా యువరాజా వారు కెటిఆర్ అవినీతిపై పుంఖానుపుంఖాలుగా వస్తున్న ఆరోపణలు. చెల్లెలు కవితమ్మ కూడా అవినీతి చేయలేదు. కానీ లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కుని జెయిల్‌కు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. చూస్తుండగానే కాళ్లకుచెప్పులు లేని వారు కోట్లకు పడగలెత్తారు. తెలంగాణలో వీరి కుటుంబం కోట్లకు పడగలెత్తింది. దీనికి సమాధానం లేదు. ఇప్పుడు ఫార్ములా–ఇ రేస్ కేసు మలుపుల మీద మలుపులు తిరుగుతూ పవర్‌ఫుల్ యాక్షన్ మూవీని తలపిస్తోంది. మాజీ మంత్రి కేటీఆర్‌పై ఫార్ములా–ఈ రేస్ కేసు రచ్చ రేపుతోంది. ఫార్ములా–ఈ రేస్ కేసులో పైసావంతు కూడా అవినీతి జరగేలదని కెటిఆర్ వాదిస్తున్నారు. 55 కోట్లు మాత్రం ఇచ్చేశానంటున్నాడు. ఓ మంత్రిగా, ఎవరి అనుమతి లేకుండా ఇంత పెద్దమొత్తంలో డబ్బులు ఎందుకు దాటవేశారన్నదానికి సమాధానం చెప్పడం లేదు. అవినీతి జరరగలేదు. ఏం చేసుకుంటారో చేసుకోండని, వెయ్యి కేసులు పెట్టినా భయపడేది లేదన్న వాదనతో కెటిఆర్ అబద్దాన్ని నిజం చేయాలని చూస్తున్నారు. ఇక్కడ అనుమతులు లేకుండా మంత్రిగా ఇంత డబ్బును విదేశాలకు ఎలా తరలించారన్న దానిపైనే కేసు పెట్టారు. కానీ దీనికి కెటిఆర్ ఇప్పటికీ సూటిగా సమాధానం చెప్పడం లేదు. సుప్రీంకోర్టు దాకా వెళ్లి క్వాష్ పిటిషన్లు మాత్రం వేస్తున్నారు. అబద్దాలు ఆడేవారికి అరుపులు ఎక్కువ అన్నట్లుగా ఉచ్చనీచాలు మరచి ఇష్టం వచ్చినట్లుగా విమర్శలు చేస్తున్నారు. కాళేశ్వరం అవినీతి అబద్ధమా..ధరణి అక్రమాలు అబద్ధమా...సిరిసిల్ల భూముల పందేరం అబద్ధమా...ఫార్ములా కేసులో 55 కోట్లు దాటించింది అబద్ధమా.. అన్నది మాత్రం చెప్పడం లేదు. నోరుంది కదాని, రాయడానికి, వినడానికి కొందరు ఉన్నారు కదాని పదేళ్ల అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు నానాయాగీ చేస్తున్నారు. ఎసిబి విచారణను తప్పుపడుతున్నారు.ఇక్కడ గమనించాల్సిందేమంటే..అరెస్టును నిలుపుదల చేయాలన్న కేటీఆర్ అప్పీల్ కూడా తిరస్కరణకు గురైంది. ఈ క్రమంలో కేటీఆర్‌కు మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న విచారణకు రావాలని ఈడీ అధికారులు నోటీసుల్లో తెలిపారు. నాపై అక్రమ కేసు పెట్టారని, ఇది రాజకీయ ప్రేరేపిత లొట్టపీసు కేసు అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కేసులో అసలు పసలేదని భావిస్తే...హైకోర్టు క్వాష్ పిటిషన్ ఎందుకు కొట్టేసినట్లు..కెటిఆర్ సమాధానం చెప్పాలి. ఎసిబి విచారణ చేయవచ్చని కూడా చెప్పింది. అవినీతిపరులకు అంతా అవినీతే కనిపిస్తుందని ఆరోపించి నంత మాత్రాన కెటిఆర్ అవినీతి వ్యవహారం నుంచి తప్పించుకోలేరని గుర్తించాలి. అధికారం అడ్డుపెట్టుకుని అక్రమ కేసు పెట్టారని ఆరోపిస్తున్న కెటిఆర్...అదే అధికారం అడ్డం పెట్టుకుని పదేళ్ల పాటు విచ్చలవిడిగా చేసిన అక్రమాలపై ఎందుకు సమాధానం చెప్పడం లేదు.నేనెలాంటి తప్పూ చేయలేదని, నాకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది... సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తా... జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో చర్చకు సిద్ధం...ఏసీబీ, ఈడీ విచారణకు కూడా హాజరవుతా ..అంటున్న కేటిఆర్ పదేపదే కోర్టు మెట్లు ఎక్కాలని ఎందుకు చూస్తున్నారో చెప్పాలి. ప్రపంచంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తేవాలని ఫార్ములా ఈ–కార్ రేస్‌ను నిర్వహించామని, దాని నిర్వహణకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలకు మంత్రి హోదాలో సంతకాలు చేశానని ఏసీబీ అధికారుల ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చినట్టు సమాచారం. అయితే ఆర్థిక అనుమతులు లేకుండా ఎందుకు డబ్బును దాటించారన్న దానికి సూటిగా సమాధానం చెప్పడం లేదు. డొంకతిరుగుడు మాటలు మానేసి డబ్బులు ఎందుకు దాటించారో చెప్పాలి. కానీ దీనికి సమాధానం లేదు. ఈ ఫార్ములా ఆగిపోవడంతో హైదరాబాద్ బ్రాండ్ దెబ్బతిన్నదని గగ్గోలు పెడితే చెవిలో ఎవరూ పూలు పెట్టుకోలేదని గుర్తించాలి. ముఖ్యంగా క్యాబినెట్ ఆమోదం లేకుండా డబ్బులు ఎలా బదిలీ చేశారనే అంశం గురించి ప్రశ్నిస్తుంటే..ఇంతవరకు కెటిఆర్ లేదా ఆయన అనుచర గణం సమాధానం ఇవ్వండ లేదు. ఈ ఒక్క కేసే కాదు వంద కేసులు పెట్టినా పోరాటం ఆపబోమని, ప్రతినిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటామని అహంకార పూరిత ప్రకటనలు చేసినంత మాత్రాన అవినీతి కేసులు ఆగిపోవు. నేను ఎలాంటి తప్పూ చేయలేదు.. ఎవరికీ తలవంచేది లేదు అని ప్రజలు ఎంతోకాలం మభ్య పెట్టలేమని కెటిఆర్ గుర్తిస్తే మంచిది. ఫార్ములా ఈ రేస్‌లో ముఖ్యమంత్రి డైరెక్షన్‌లోనే ఏసీబీ విచారణ చేపట్టిందని వాదించడం ద్వారా కెటిఆర్ తన పార్టీ వాళ్లకు నమ్మకం కలిగించవచ్చు..కానీ ప్రజలకు, ఎసిబికి నమ్మకం కలిగించలేరు. ఏసీబీ కేసులో పసలేదనే విషయం కేసు పెట్టినవారికి కూడా తెలుసంటూ ఇంకా బుకాయింపులు ఎందుకో కెటిఆర్ చెప్పాలి. పస ఉందా లేదా అన్నది వారు విచారణలో తేలుస్తారు. అప్పటి వరకు కొంచెం ఓపిక పట్టాలి. అవినీతి కేసులు ఒక్కొక్కటి బుసకొడుతూ బయటకు వస్తుంటాయి. సీనియర్ ఐఏఎస్ అర్వింద్‌కుమార్‌తోపాటు, హెచ ఎండీఏ కమిషనర్ దానకిశోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా కేటీఆర్‌ను ఎసిబి ప్రశ్నిస్తోంది. రేసు రద్దు వల్ల జరిగిన నష్టానికి ముఖ్య మంత్రి పైన కూడా కేసు నమోదు చేయాలనే వితండవాదన కూడా కెటి ఆర్ తెరపైకి తెచ్చారు. రేసుల వల్ల ఇమేజ్ పెరిగితే గుర్రాలు, పత్తాల రేసులు కూడా పెట్టుకోవచ్చు. ఇక రేసులతో ఏమైనా చేయవచ్చనే మూర్ఖవాదన నుంచి కెటిఆర్ బయటపడితే మంచిది. అవినీతి ఎవరు చేసినా శిక్షార్హులే. అందుకు కెటిఆర్ కాదు..మరెవరూ అతీతం కాదని గుర్తించాలి.

# దేశ నిర్మాణమే మా లక్ష్యం



### చైర్మన్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ

న్యూఢిల్లీ : ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్‌ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా 'ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తారు..? ఎంతసేపని భార్య ముఖం తదేకంగా చూడగలరు? ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన వ్యాఖ్యలపై నెట్టింట తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పలువురు సెలబ్రిటీలు సైతం ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ చైర్మన్ చేసిన వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది. దేశ నిర్మాణమే తమ సంస్థ ప్రధాన లక్ష్యం అని పేర్కొంది. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా భారతదేశ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్ టీ మెరుగుపరిచిందని వివరించింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ ఫలితాలు సాధించాలంటే అసాధారణమైన కృషి అవసరమని పేర్కొంది. ఈ విస్తృత లక్ష్యాన్నే చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయని వివరణ ఇచ్చింది. ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్‌ఎన్ సుబ్రహ్మణ్యన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఎల్‌అండ్‌టీ ఉద్యోగులతో ఇటీవల ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో వారానికి ఆరు రోజుల పని విధానాన్ని అమలు చేయడాన్ని ఓ ఉద్యోగి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా.. 'ఆదివారాలు కూడా మీతో పని చేయించలేకపోతున్నందుకు నేను బాధపడుతున్నాను. మీతో ఆదివారాలు సైతం పని చేయిస్తే చాలా సంతోషపడతాను. ఎందుకంటే, నేను ఆదివారాలు కూడా పని చేస్తున్నాను. ఎంత సేపు ఇంట్లో కూర్చుంటావు? ఎంతసేపు నీ భార్యను అలా తదేకంగా చూస్తూ ఉండగలవు? ఆఫీసుకు వెళ్లి పని చేయడం ప్రారంభించు' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతటితో ఆగని సుబ్రహ్మణ్యన్.. వారానికి 90 గంటలు పని చేయాలని సైతం ఆయన సెలవిచ్చారు. తాను ఒక చైనా వ్యక్తితో మాట్లాడానని, చైనా కార్మికులు వారానికి 90 గంటలు పని చేస్తారని, అమెరికన్లు 50 గంటలే పని చేస్తారు కాబట్టి కొన్ని రోజుల్లో అమెరికాను చైనా దాటేస్తుందని ఆ వ్యక్తి చెప్పినట్టు సుబ్రహ్మణ్యన్ చెప్పుకొచ్చారు. 'మీరు కూడా ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే వారానికి 90 గంటలు పని చేయాల్సిందే. ముందుకొచ్చి పని చేయండి' అని ఆయన పిలుపునిచ్చారు. ఆయనపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలను చిన్నచూపు చూసేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు.

## రియల్‌ఎస్టేట్ రంగం అభివృద్ధికి కృషి :

### రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ

విజయవాడ .: రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శుక్రవారం విజయవాడలో క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామమోహన్, బోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, గత ఐదేళ్లలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిందని అన్నారు. భవన నిర్మాణాలు, లే అవుట్లు అనుమతులను సులభతరం చేస్తూ జీవోలు జారీ చేశామని చెప్పారు. దేశంలోని 10 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి సరళమైన నిబంధనలు రూపొందించామని తెలిపారు. లే అవుట్‌లలో రోడ్లను 12 మీటర్ల నుంచి 9 మీటర్లకు తగ్గించామన్నారు.15 మీటర్లలోపు భవనాలు నిర్మాణాలకు ఎలాంటి అనుమతి లేకుండా లైసెన్సెడ్ సర్వేయర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నామని తెలిపారు. రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. భవన నిర్మాణాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా సింగిల్ విండో విధానం అమల్లోకి తెస్తున్నామని, ప్రాపర్టీ షోలో నిర్వహణ ద్వారా కొనుగోలుదారులకు అవగాహన వస్తుందన్నారు. ప్రతి ఏటా రెండు సార్లు రియల్ ఎస్టేట్ అసోసియేషన్‌ల ప్రతినిధులతో సమావేశం అవుతానని, ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కాగా భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులకు సంబంధించి నిబంధనలను సులభతరం చేస్తూ ఏపీ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బిల్డింగ్ రూల్స్ –2017, ఏపీ ల్యాండ్ డెవలప్మెంట్ రూల్స్ – 2017లో సవరణలు చేస్తూ వేర్వేరుగా ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన, లే అవుట్ల అనుమతుల్లో మార్పులు తీసుకువచ్చామని అన్నారు. ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా కీలక సంస్కరణలతో ఉత్తర్వులు జారీ చేశామని మంత్రి నారాయణ తెలిపారు. సంక్రాంతి కానుకగా బిల్డర్లు, డెవలపర్లు, ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిబంధనల్లో మార్పులు చేస్తూ జీవోలు జారీ చేశామని అన్నారు. లే అవుట్లలో రోడ్లకు గతంలో ఉన్న12 మీటర్లకు బదులు 9 మీటర్లకు కుదిస్తూ సవరణ చేశామని చెప్పారు. 500 చ.మీ. పైబడిన స్థలాలు, నిర్మాణాల్లో సెల్లారుకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. టీడీఆర్ బాండ్ల జారీ కమిటీలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్‌లు తొలగిస్తూ జీవో జారీ చేశామని తెలిపారు. రాష్ట్ర, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీ.సర్వీస్ రోడ్డు ఏర్పాటు నిబంధన తొలగించినట్లు చెప్పారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పులు చేశామన్నారు. వీటితో పాటు మరిన్ని నిబంధనలు సులభం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. రియల్ ఎస్టేట్ అసోసియేషన్‌ల ప్రతినిధులతో చర్చించి తుది నిబంధనలు జారీ చేసినట్లు వివరించారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకోనుందని మంత్రి నారాయణ ప్రకటించారు.

## ఇండియా బ్లాక్ శాశ్వతం

### ఎన్నికల్లో పోటీ కోసం కాదు : ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్ : ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' బ్లాక్ శాశ్వతమని జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసమే కాదని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. 'ఇండియా' బ్లాక్‌లో భాగమైన ఆప్, కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పరస్పరం తలపడుతున్నాయి. ఈ కూటమికి చెందిన టీఎంసీ, శివసేన (యూబీటీ) వంటి పార్టీలు ఆప్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో 'ఇండియా' కూటమి ఐక్యత, మనుగడపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే అయితే ఈ కూటమిని ముగించవచ్చని ఫరూక్ అబ్దుల్లా కుమారుడు, జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా గురువారం సూచించారు. కాగా, ఈ పరిణామాల నేపథ్యంలో 'ఇండియా' కూటమి భవిష్యత్తు గురించి మీడియా అడిగిన ప్రశ్నకు ఫరూక్ అబ్దుల్లా సమాధానమిచ్చారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసం కాదని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. 'ఈ కూటమి శాశ్వతం. ఇది ప్రతి రోజు, ప్రతి క్షణానికి సంబంధించినది' అని అన్నారు. అయితే ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్రంతో పోరాటం చేయదని తెలిపారు. జమ్ముకశ్మీర్ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## తొక్కిసలాట బాధితులకు వైకుంఠ దర్శనం

**కుటుంబ సభ్యులుతో కలసి 52మందికి దర్శన భాగ్యం**

**సిఎం చంద్రబాబు ఆదేశాలతో చర్యలు తీసుకున్న టిటిడి**


తిరుమల : తిరుపతి తొక్కిసలాట బాధితులకు టిటిడి అధికారులు శ్రీవారి ప్రత్యేక దర్శనం కల్పించారు . సీఎం ఆదేశాల మేరకు క్షతగాత్రులకు టీటీడీ వైకుంఠ ద్వార దర్శనం చేయించింది. తొక్కిసలాటలో గాయపడి.. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వారందరికీ ఈ అవకాశం కల్పించారు. తొక్కిసలాట బాధితులతోపాటు వాళ్ల కుటుంబసభ్యులకు కూడా వైకుంఠ ద్వార దర్శనం చేయించింది. మొత్తం 52మందికి వైకుంఠ ద్వార ప్రత్యేక దర్శనం కల్పించారు. సీఎం చంద్రబాబు, మంత్రుల పరామర్శ సమయంలో తిరుపతి తొక్కిసలాట బాధితులు ఇదే కోరుకున్నారు. తమకు వైకుంఠ ద్వార దర్శనం చేయించి.. ఇంటికి పంపాలని విజ్ఞప్తి చేశారు. దీంతో వారికి ఆ వెసులుబాటు కల్పించారు. క్షతగాత్రులు కోరిన మేరకు మొత్తం 52మందికి టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శనం చేయించారు. తిరుపతి స్విమ్స్‌లో ఇంకా 16మంది తొక్కిసలాట బాధితులకు చికిత్స కొనసాగుతోంది. క్షతగాత్రుల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. డిశ్చార్జ్ అయిన 33మందికి 2లక్షల రూపాయల చొప్పున పరిహారం కూడా అంజేయ నున్నారు. బాధితులను ఇంటికి చేర్చే బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుంది. మరోవైపు తిరుపతి తొక్కిసలాటలో మరణించిన భక్తుల మృతదేహాలను వాళ్లవాళ్ల స్వస్థలాలకు తరలిస్తున్నారు. పోస్టుమార్టం తర్వాత డెడ్‌బాడీస్‌ను కుటుంబసభ్యులకు అప్పగించారు. తిరుపతి తొక్కిసలాటలో ఉమ్మడి విశాఖకి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. నలుగురిలో లావణ్య, శాంతి, రజనీది విశాఖకాగా.. నాయుడుబాబుది నర్సీపట్నం. నలుగురి మృతదేహాలనూ.. వాళ్ల స్వగృహాలకు తరలించారు. మృతదేహాలు చూసి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా తిరుమలలో శుక్రవారం టీటీడీ పాలక మండలి అత్యవసర సమావేశం కానుంది. తొక్కిసలాట మృతుల కుటుంబాలకు పరిహారంపై తీర్మానం చేయనుంది. సాయంత్రానికి పరిహారం చెక్కులు అందించే యోచనలో ఉంది టీటీడీ బోర్డు. వైకుంఠ దర్శనాలు మూడురోజులకే పరిమితం చేయాలా.. మిగిలిన వారం రోజులకు టికెట్లు ఇవ్వాలా? అన్న అంశంపై అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.



## యాదగిరిగుట్టలో వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

యాదాద్రి భువనగిరి : యాదగిరిగుట్టలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా యాదగిరి లక్ష్మీనరసింహా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నారు. ఉదయం 5:15 నిమిషాలకు గరుడ వాహనంపై యాదగిరీశుడు ఉత్తరద్వార దర్శనమిచ్చారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్షపుష్పార్చన, ఆర్జిత సేవలు రద్దు చేశారు. అలాగే నేటి నుంచి ఈ నెల 15 వరకు యాదగిరిగుట్టలో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. 6 రోజుల పాటు అలంకార సేవల్లో లక్ష్మీనరసింహా స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు.





ఆధ్యాత్మికం

ది క్రైమ్ న్యూస్

# పేదరికంపై తప్పుడు అంచనాలు



## దేశంలో నాలుగో వంతు మంది పేదలే
## అమెరికా జనాభా కంటే మన దేశంలో పేదవారే అధికం
## నిగ్గు తేల్చిన అధ్యయనం

న్యూఢిల్లీ : దేశంలో పేదరికం దాదాపు అంతరించిపోయిందంటూ కొన్ని ప్రభుత్వ సంస్థలు ఊదరగొడుతున్నాయని, కానీ వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని ఓ అధ్యయనం తేల్చింది. ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆ అధ్యయనం తెలిపింది. సీఏ సేతు, ఎల్టీ అభినవ్ సూర్య, సీఏ రుతు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ఇటీవల ప్రచురితమైంది. అధికారిక గణాంకాల ప్రకారం దేశంలో నాలుగో వంతు మంది ప్రజలు అంటే జనాభాలో 26.4 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారని అధ్యయనం తెలిపింది. ఇది 2022-23లో నిర్వహించిన కుటుంబ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) నుండి తీసుకున్న సమాచారమేనని చెప్పింది. దేశంలో పేదరిక నిష్పత్తి ఐదు శాతం కంటే తక్కువగానే ఉన్నదంటూ నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం మాటలకు ఇది పూర్తి భిన్నం. 'వ్యవసాయ అధ్యయనాల సమీక్ష' పేరిట వచ్చిన సంపాదకీయం ఓ పత్రికలో ప్రచురితమైంది. దేశంలో పేదరికం ఏ మేరకు ఉన్నదన్న విషయంపై గత దశాబ్ద కాలంగా ప్రభుత్వం పెదవి విప్పడం లేదని ఆ సంపాదకీయం గుర్తు చేసింది. అందుకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఒకటి నాణ్యమైన సమాచారం అందుబాటులో లేకపోవడం. రెండోది పేదరికాన్ని లెక్కించే విధానంలో ప్రభుత్వం మార్పులు చేయడం. జీవన ప్రమాణాలకు సంబంధించిన వివిధ కోణాల నుండి పేదరికాన్ని లెక్కించడానికి వినియోగ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. బెంగళూరులోని వ్యవసాయ అధ్యయనాల ఫౌండేషన్ ఆన్‌లైన్‌లో నిపుణులతో చర్చా గోష్టిని నిర్వహించింది. పేదరికాన్ని ఏదో ఒక పద్ధతిలో లెక్కించాల్సిన అవసరం ఉన్నదని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ మధురా సామినాథన్ చెప్పారు. పేదరికానికి సంబంధించిన చిట్టచివరి అధికారిక అంచనాలు 2013లో ప్రణాళికా సంఘం నుండి వెలువడ్డాయి. ప్రొఫెసర్ సురేష్ టెండుల్కర్ నేతృత్వంలోని నిపుణుల బృందం సిఫార్సు చేసిన దారిద్ర్య రేఖ ఆధారంగా ఆ అంచనాలను రూపొందించారు. కాగా దేశ జనాభాలో పేదలు గ్రామీణ ప్రాంతాలలో 25.7 శాతం, పట్టణ ప్రాంతాలలో 13.7 శాతం ఉన్నారని సంపాదకీయం తెలిపింది. యూపీఏ ప్రభుత్వం సి.రంగరాజన్ నేతృత్వంలో మరో నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. టెండూల్కర్ బృందం సూచించిన దారిద్ర్యరేఖ కంటే రంగరాజన్ బృందం సూచించింది కొంచెం ఎక్కువగా ఉంది. మనుగడ కోసం ఆహార వస్తువులపై పెట్టే ఖర్చుతో పాటు కొన్ని అత్యవసర ఆహారేతర వస్తువులపై పెట్టే వ్యయాన్ని కూడా అది పరిగణనలోకి తీసుకుంది. 2011-12లో దేశ జనాభాలో గ్రామీణ ప్రాంతాలలో 30.9 శాతం, పట్టణ ప్రాంతాలలో 26.4 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని నిపుణుల బృందం అంచనా వేసింది. అయితే ఈ అంచనాలను ప్రభుత్వం ఎన్నడూ అంగీకరించలేదు. 2011-12 నుండి 2024 ప్రారంభం వరకూ వినియోగ వ్యయంపై అధికారిక గణాంకాలేవీ విడుదల కాలేదు. 2022 ఆగస్ట్ నుండి 2023 జూలై వరకూ జరిపిన వినియోగ వ్యయ సర్వే వివరాలను గత సంవత్సరం విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన కుటుంబ వినియోగ వ్యయ సర్వే సమాచారాన్ని గతంలో జరిపిన సర్వేలు అందించిన సమాచారంతో పోల్చలేము. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. నమూనాల రూపకల్పనలో, ప్రశ్నావళిలో, సమాచార సేకరణలో అనుసరించిన పద్ధతులలోనూ మార్పులు చోటుచేసుకోవడమే దీనికి కారణం. తమ అధ్యయనం కారణంగా వెలుగు చూసిన విషయాలను పరిశీలిస్తే సిగ్గుచేటుగా ఉన్నాయని 'వ్యవసాయ అధ్యయనాల సమీక్ష' వ్యాఖ్యానించింది. 'దేశ జనాభాలో గ్రామీణ ప్రాంతాలలో 27.4 శాతం, పట్టణ ప్రాంతాలలో 23.7 శాతం మంది పేదలు ఉన్నరన్న అంచనా ప్రకారం గ్రామాలలో 246.7 మిలియన్లు, పట్టణాలలో 114.4 మిలియన్ల మంది పేదలు ఉన్నారని అర్థమవుతోంది. మొత్తంగా చూస్తే 361 మిలియన్ల ప్రజలు రంగరాజన్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ నిర్ధారించిన కనీస వ్యయాన్ని సైతం భరించే స్థితిలో లేరు. అమెరికా మొత్తం జనాభా కంటే మన దేశంలోని పేదలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. జీడీపీ లేదా జాతీయాదాయాన్ని బట్టి చూస్తే ప్రపంచంలో భారత్ ఐదో స్థానంలో ఉంది. పేదరికంతో బాధపడుతున్న వారిని సంఖ్యాపరంగా చూస్తే ప్రపంచంలో మనదే మొదటి స్థానం. ఇది సిగ్గుచేటైన రికార్డు' అని ఆ అధ్యయనం వివరించింది.
రంగరాజన్ కమిటీ ప్రతిపాదించిన పద్ధతిపై అధ్యయన రచయితలు దృష్టి సారించారు. దారిద్ర్యరేఖను లెక్కించడానికి దానినే ఉపయోగించారు. దేశంలో పేదరికంతో బాధపడుతున్న వారు జనాభాలో 26.4 శాతం ఉన్నారని తేల్చారు.

# ఇదేనా నీ సంతకం విలువ?

## ఏపీ సీఎం చంద్రబాబుపై శ్యామల సెటైర్లు



**అమరావతి,:** సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేశారని వైసీపీ అధికార ప్రతినిధి ఆరె శ్యామల విమర్శించారు. మహిళలకు ఎన్నో పథకాలను అమలు చేస్తామని చెప్పి మోసం చేశారని శ్యామల అన్నారు. శనివారం నాడు ఆరె శ్యామల మీడియాతో మాట్లాడుతూ.. మహిళలకు చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆరె శ్యామల ప్రశ్నించారు. దీపం పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. నమ్మించి, మాటిచ్చి ప్రజలను చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. ఏరు దాటాక తెప్ప తగలేయడం బాబుకు అలవాటే అని ఎద్దేవా చేశారు. చేతగానప్పుడు.. చేయలేనప్పుడు.. శుష్క వాగ్దానాలు చేయకూడదని హితవు పలికారు.సూపర్ సిక్స్ పేరుతో బాండ్ పేపర్లు ఇచ్చి మరీ ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆరె శ్యామల మండిపడ్డారు. ఇదేనా నీ సంతకం విలువ అని ప్రశ్నించారు. మహిళలను మోసం చేసినందుకు చంద్రబాబుపై 420 కేసు పెట్టవచ్చని తెలిపారు. హామీలు మాత్రం జనాల్లో ఇచ్చి.. పథకాలను ఇవ్వలేకపోతున్నామని నాలుగు గోడల మధ్య ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించారు. తల్లికి వందనం పేరు చెప్పి జగన్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అమ్మ ఒడి పథకాన్ని కూడా ఆపేశారని విమర్శించారు. తల్లికి వందనం ఇవ్వట్లేదని టీడీపీ నేతలు జనాల్లోకి వచ్చి చెప్పాలన్నారు. 2025 జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ ఇస్తామని నారా లోకేశ్ ప్రకటించిన విషయాన్ని ఆరె శ్యామల గుర్తు చేశారు. ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో కాదు కదా.. కనీసం జాబ్ క్యాలెండర్ ఎప్పుడు ప్రకటిస్తారనే విషయాన్ని కూడా చెప్పడం లేదని విమర్శించారు. హామీలు అమలు చేయలేకపోవడంపై కూటమి నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే బాగుండేదని ప్రతి ఒక్కరూ అనుకుంటున్నారని తెలిపారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీల అమలుపై వైసీపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు సంపద సృష్టి అని చంద్రబాబు అంటే ప్రజలకేమో అని అనుకున్నామని.. కానీ ఆయన సొంతంగా సంపద సృష్టించు కోవడం అని ఇప్పుడే తెలిసిందని ఆరె శ్యామల ఎద్దేవా చేశారు.

# బెదిరించి టీడీపీ సభ్యత్వాలు నమోదు

## గుడివాడ అమర్నాథ్

విశాఖపట్నం, జనవరి : టీటీడీ సభ్యత్వ నమోదుపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పలు విమర్శలు గుప్పించారు. ముచ్చెర్ల గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదుపై అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. బెదిరించి, మభ్యపెట్టి ప్రజల నుంచి టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేశారని వ్యాఖ్యలు చేశారు. ఆ గ్రామంలో టీడీపీ తప్ప వేరేపార్టీలు లేవా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యత్వంపై దొంగలెక్కలు చెబుతున్నారని అన్నారు. ప్రజలకు తెలియకుండానే వారి ఆధార్ కార్డులు తీసుకుని సభ్యత్వాలు నమోదు చేశారని విమర్శించారు. ముచ్చెర్ల గ్రామంలో వందకు వంద శాతం టీడీపీ సభ్యత్వం నమోదు అనేది పచ్చి అబద్ధం అని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. గ్రామంలో 1400 మంది ప్రజలు టీడీపీ సభ్యత్వం నమోదయిందని చెప్తున్నారని.. కొన్ని చోట్ల బెదిరించి సభ్యత్వం నమోదు చేశారని ఆరోపించారు. ముచ్చెర్ల గ్రామంలో వైఎస్ఆర్సీపీ బలంగా ఉంది..ఈ గ్రామంలో వైసీపీతో పాటు జనసేన, బీజేపీ పార్టీలు లేవా అని ప్రశ్నించారు. ముచ్చర్ల గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ వైసీపీ గెలుచుకుందన్నారు. సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పి టీడీపీ నేతలు ప్రజలు వద్ద నుంచి ఆధార్ కార్డులు తీసుకొని టీడీపీ సభ్యత్వం నమోదు చేశారని వ్యాఖ్యలు చేశారు. 100 శాతం సభ్యత్వం జరిగిందని మంత్రి లోకేష్ ముచ్చెర్ల గ్రామానికి ఎలా వస్తారని ప్రశ్నించారు. ముచ్చెర్ల గ్రామంలో 600 ఎకరాల భూమిని తెలుగుదేశం పార్టీ నాయకులు కొట్టేసే ప్రయత్నంలో భాగంగా సభ్యత్వంపై దొంగ లెక్కలు చెబుతున్నారంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు టీటీడీ లెటర్ అమ్ముకునే స్థితికి హోంమంత్రి అనిత పేషి చేరుకుందని విమర్శించారు అమర్నాథ్. సనాతన ధర్మం గురించి మాట్లాడే నాయకులు టీటీడీ లెటర్ గురించి ఏమీ చెపుతారని ప్రశ్నించారు. మంత్రులు నెల వారీగా వసూళ్లు చేస్తున్నారని గుడివాడ అమర్నాథ్ ఆరోపణలు గుప్పించారు.

# కార్పొరేట్లకు కట్టబెడుతూ..



అంబాని, అదాని, టాటా తదితర కార్పొరేట్ గ్రూపులకు రాష్ట్రంలో ఎక్కడ ఎంత కోరితే అంత భూమి ఇవ్వడానికీ, వారి కార్యకలాపాలకు అవసరమైన ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు అప్పగించడానికీ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చూపుతున్న ఆసక్తి ఘోరంగా వుంది. గురువారంనాడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం చేసిన నిర్ణయాలు, శుక్రవారంనాటి ఎయిర్‌పోర్టులపై ముఖ్యమంత్రి సమీక్ష అనంతరం వెలువడిన ప్రకటన పరిశీలిస్తే తెలుగు గడ్డను కార్పొరేట్ల అడ్డాగా మార్చడానికి సర్కారు ఎంతగా తహతహలాడుతున్నదో బోధపడుతుంది. గత వైసిపి ప్రభుత్వం వేలకోట్ల రూపాయల అవినీతితో రాష్ట్ర ఖజానాకు లక్షల కోట్ల నష్టం కలిగించే రీతిలో అదాని విద్యుత్ కొనుగోలుకు సెకితో ఒప్పందం కుదుర్చుకోవడంపై చర్చ సాగుతూనే వుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన హక్కులను కాలరాస్తూ పంప్డ్ స్టోరేజి పవర్ పేరిట అదానీ గ్రూపునకు భూపందేరం చేయడం, గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను హారతి పళ్లెంలో పెట్టి అప్పగించడం చూశాం. అంబానీ గ్రూపులో కీలకమైన పరిమళ్ నత్వానీని ఆ పార్టీ తరఫున రాజ్యసభకు సైతం పంపడం వంటి చర్యలతో గత ప్రభుత్వం కార్పొరేట్లకు ఎంతగా లొంగిపోయిందో అందరికీ తెలిసిందే! ఇప్పుడు టిడిపి కూటమి చేస్తున్న పందేరం, ప్రజల సంపదను కార్పొరేట్ల పరంచేయడానికి పడుతున్న తపన చూస్తుంటే ఇటువంటి విషయాల్లో ఈ రెంటి నడుమ ఎలాంటి తేడా లేదని స్పష్టమవుతోంది. పరస్పరం దూషించుకోవడంలో మాత్రమేగాక కార్పొరేట్ల సేవలోనూ ఎంతలా పోటీ పడుతున్నారో తేటతెల్లమవుతోంది. కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల కోసం రిలయన్స్ సంస్థకు రాష్ట్రంలో 'ఎంత భూమి అవసరమైతే అంత భూమిని, ఎక్కడ కోరుకుంటే అక్కడ' కేటాయించాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. ఈ సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల ఎకరాల భూములు కేటాయించాలని ఇటీవల జరిగిన రాష్ట్ర ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశంలోనే తీర్మానించుకున్నారు. మంత్రిమండలి ఆ ప్రతిపాదనను ఆమోదించేసింది. ప్రభుత్వ భూములైతే ఎకరాకు రూ.15 వేలు, రైతుల వద్ద నుంచి నేరుగా తీసుకుంటే ఎకరాకు రూ.30 వేలు వంతున 15 సంవత్సరాల కాలపరిమితితో లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఏర్పాటయ్యే ఇతర పరిశ్రమలకు కూడా ప్రాధాన్యత ప్రాతిపదికన భూములు కేటాయించాలని నిర్ణయించినట్లు మంత్రి సెలవిచ్చారు. విశాఖలో టిసిఎస్ ఏర్పాటుకు వీలుగా ఎపిఐఐసికి చెందిన మిలీనియం టవర్స్ ఎ, బి బ్లాకుల్లో 2.08లక్షల చదరపు అడుగులు కేటాయించారు. రిలయన్స్ ఇండిస్టీస్ రాష్ట్ర ప్రభుత్వంతో గత నవంబర్ 24న ఎంఓయు చేసుకుందని, 45 రోజుల్లో తమకు కావాల్సిన భూముల వివరాలు తెలిపితే అడ్వాన్స్ పొజిషన్ సౌకర్యం కూడా కల్పిస్తామంటూ అపర శిబి చక్రవర్తి లా అమాత్యవర్యులు గొప్పగా ప్రకటించారు.రాష్ట్రంలో పరిశ్రమలు రావాలి..యువతకు ఉపాధి కలగాలి..ఆ యా ప్రాంతాలు అభివృద్ధి కావాలి. పరిశ్రమలు, పోర్టులు, ఎయిర్ పోర్టుల వంటి మౌలిక వసతుల కల్పనకు భూమి కావాలి. తప్పదు. అయితే, పడావుగా పడివున్న భూములైతే అంతగా అభ్యంత రాలుండవు. కానీ రెండు- మూడు పంటలు పండే సుక్షేత్రాలను అభివృద్ధి పేరిట కార్పొరేట్లకు కట్టబెట్టడం సర్కారుకు తగని పని. వాటిపై ఆధారపడిన రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలుదార్లు ఇతర ప్రజానీకాన్ని నిరాశ్రయుల్ని చేయడం దారుణం. ఎక్కడ ఎంత అడిగితే అంత భూమిని అడ్వాన్స్ పొజిషన్‌లో అప్పగిస్తామంటే కార్పొరేట్లు ఆగుతారా? పురాణాల్లో చెప్పినట్లు హిరణ్యాక్షుడి మాదిరిగా భూమిని చుట్ట చుట్టేయరా? సెజ్‌లు, పరిశ్రమలు, హబ్‌లు, ఇండిస్టియల్ పార్కులంటూ లక్షల ఎకరాలు చేజిక్కించుకొని, బ్యాంకుల్లో కుదువబెట్టి అప్పులు ఎగ్గొట్టిన ప్రబుద్ధులెందరో ఉన్నారు. అయినా, ఏలినవారు కార్పొరేట్ల పట్ల తమ విధేయతను ఇలా చాటుకుంటున్నారు. ప్రజల సంపదను వారికి కట్టబెడుతున్నారు. దుర్విధానాలతో అగచాట్ల పాలై విసిగిపోయిన జనం ఎన్నికల్లో ఓ పార్టీని ఓడించి ఈ కూటమిని గెలిపించినా అవే విధానాలు కొనసాగుతున్నాయి. కనుక ఆ విధానాలపై పోరాడడం%ౌ%వాటిని ఓడించడమే ఏకైక మార్గం.

## వ్యవసాయంలో యాంత్రీకరణ అవసరం : వ్యవసాయ మంత్రి అచ్చెనాయుడు

గుంటూరు, జనవరి : వ్యవసాయంలో యాంత్రికరణ అవసరమని వ్యవసాయ మంత్రి అచ్చెనాయుడు అన్నారు. గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మంత్రి అచ్చెన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. వ్యవసాయంపై కనీస దృష్టి పెట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని.. యాంత్రికరణను ప్రోత్సాహిస్తామని వెల్లడించారు. డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయ రంగంలో ప్రవేశపెడతామని తెలిపారు. వ్యవసాయంలో భూసార పరీక్షలు అవసరమన్నారు. భూసార పరీక్షలకు కూడా ఆధునిక టెక్నాలజీ వచ్చిందని.. సేంద్రీయ వ్యవసాయ ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. సేంద్రీయ వ్యవసాయం ప్రకృతి విపత్తులను తట్టుకుంటుందన్నారు. సేంద్రీయ పద్దతిలో పండించిన కూరగాయలకు మంచి డిమాండ్ ఉందని. వ్యవసాయ పనిముట్లను సబ్సిడీలో రైతులకు అందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వ్యవసాయాన్ని ప్రోత్సాహిస్తోందని నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు అన్నారు. రైతులకు ఉపయోగపడేలా విద్యార్థులను ప్రోత్సాహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయలో యాంత్రికరణ అవసరమన్నారు. సాంకేతికతను జోడించి వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చేలా వ్యవసాయం చేయాలని అన్నారు. నూతన విధానాలతో వ్యవసాయ సాగు చేయాలని ఎంపీ శ్రీకృష్ణ దేవరాయల సూచనలు చేశారు. కాగా.. గుంటూరు జిల్లా విజ్ఞాన్ యూనివర్శిటీలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో భాగంగా అభ్యుదయ రైతులకు పురస్కారాలు ప్రధానం చేశారు. రైతు నేస్తం ఫౌండేషన్ - విజ్ఞాన్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. మొత్తం 250 మంది రైతులకు పురస్కారాలు వరించాయి. మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా రైతులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో మంత్రి అచ్చెన్నాయుడితో పాటు ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు, విజ్ఞాన్ విద్యా సంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య , రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


## కమ్యూనిటీ హాల్ బిల్డింగు పరిశీలించిన పెండెం రామానంద్



నర్సంపేటజనవరి శిధిలావస్థకు చేరుకున్న మూడో వార్డ్ ఎస్ సి కాలనిలోని కమ్యూనిటీ హల్ బిల్డింగ్ ను టీ పి సి సి సభ్యులు పెండెం రామానంద్ శనివారం పరిశీలించారు.ఈ సందర్బంగా రామానంద్ మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల శితిలా వస్థకు చేరుకున్న కమ్యూనిటీ బిల్డింగ్ పునర్ నిర్మాణం చేపట్టాలనే, నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు కమ్యూనిటీ హాల్ బిల్డింగును వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ తో కలిసి 15 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పరిశీలించిన చేసినట్లు తెలిపారు.
మిషన్ భగీరథ పనులతో వార్డులో పాడైన రోడ్లను వెంటనే నిర్మాణం చేపట్టాలని, మిషన్ భగీరథ ఏ ఈ తో ఫోన్లో మాట్లాడడం జరిగిందని పేర్కొన్నారు. ఎస్సీ కాలనీలో పాడైన రెండు బోరింగ్ పంపులను రిపేర్ చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బీరం భరత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శులు బిట్ల మనోహర్, జన్ను మురళి, బీరం భాస్కర్ రెడ్డి, మంచినీళ్ల నాగరాజు, అంగోతు బాలు, మంచినీళ్ల కృష్ణమూర్తి, సముద్రాల సదానందం, నాళ్ళం రవికిషన్, తాడబోయిన ప్రశాంత్, గోనెల భాస్కర్, కోమాండ్ల మధు, తప్పెట్ల రాము, సముద్రాల శ్రీనివాస్, వడ్నాల అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే వందేభారత్ స్లీపర్ రైళ్లు





## 180 కిమీ వేగంతో దూసుకు పోయేలా పరీక్షలు
## అన్ని పరీక్షల్లోనూ నెగ్గినట్లు గుర్తింపు
## కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వీడియో వైరల్

న్యూఢిల్లీ,జనవరి5: త్వరలోనే వందేభారత్ స్లీపర్ రైళ్లు కూడా మనలను పలకరించ బోతున్నాయి. ఇప్పటికే వందేభారత్ రైళు సంచలనంగా మారడంతో పాటు, ప్రయాణికులు కూడా బాగా ఆదరిస్తున్నారు. రైల్వేల చరిత్రలో ఇవి విప్లవాత్మకంగా మారయి. ఈ క్రమంలో దేశంలో మొట్టమొదటిసారిగా వందే భారత్ స్లీపర్ రైళ్లను పట్టాలు ఎక్కించేందుకు రైల్వే శాఖ ముమ్మర కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే రైలు వేగాన్ని క్రమక్రమంగా పెంచేందుకు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో రైలు గరిష్ఠంగా గంటకు 180 కిలోమీటర్ల వేగాన్ని అందుకున్నట్లు తెలిసింది. ఈమేరకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఓ వీడియోను షేర్ చేశారు. అందులో వందే భారత్ స్లీపర్ రైలు 180కిలోమీటర్ల వేగంతో రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్లింది. అంత వేగంలోనూ రైల్లో సీటు వద్ద ఉన్న ట్రేపై పెట్టిన గ్లాసులో చుక్క నీరు కూడా కింద పడకపోవడం విశేషం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సూచనల మేరకు రాజస్థాన్‌లోని కోటా రైల్వే డివిజన్‌లో ఈ పరీక్షలు నిర్వహించారు. తొలుత జనవరి 1న రైలును 130 కి.మీ వేగంతో నడిపారు. ఆ తర్వాత వేగాన్ని 140, 150, 160కి పెంచారు. తాజాగా గురువారం ఈ వేగాన్ని గంటకు 180 కిలోమీటర్లకు పెంచారు. రాజస్థాన్‌లోని కోటా నుంచి లబాన్ స్టేషన్ల మధ్య 180 కిమీ వేగంతో దూసుకెళ్లింది. ఆ సమయంలో సాధారణ ప్రయాణికులను సమం చేసేంత బరువును రైల్లో ఉంచారు. విభిన్నమైన ట్రాక్ పరిస్థితుల్లో దీన్ని పరీక్షించారు. వచ్చే నెలలోనూ ఈ ట్రయల్స్ కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. మరికొన్ని నెలల్లో వందే భారత్ స్లీపర్ రైళ్లను పట్టాలెక్కించే అవకాశాలున్నాయి. ఈ స్లీపర్ రైల్లో మొత్తం 16 బోగీలు ఉంటాయని అందులో 10 థర్డ్ ఏసీకి, 4 సెకండ్ ఏసీకి, ఒక బోగీ ఫస్ట్ ఏసీకి కేటాయించారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. వందే భారత్ స్లీపర్ రైలులో సీటింగ్‌తో పాటు లగేజీ కోసం రెండు బోగీలు అందుబాటులో ఉంటాయి. కొత్తగా సిద్ధం చేసిన వందేభారత్ స్లీపర్ కోచ్ రైలు పరీక్షల నిమిత్తం ఇటీవల కోటకు వచ్చింది. అక్కడ దానిపై బరువు ఉంచి, వేర్వేరు వేగంతో ఖాళీగా రన్ చేయడం ద్వారా పరీక్షించారు. అందులో బ్రేకింగ్ సిస్టమ్, ఎయిర్ సస్పెన్షన్, కప్లర్ ఫోర్స్‌లను పరీక్షించారు. ఈ రైలును గంటకు 180 కి.మీ వేగంతో నడిపారు. ఈ పరీక్ష డిసెంబర్ 31 నుంచి కోట రైల్వే డివిజన్‌లోని ఢిల్లీ-ముంబై రైల్వే ట్రాక్‌పై ప్రారంభమైంది. ఇందులో వందే భారత్ ట్రయల్ మొదట నాగ్దా మధ్య.. తర్వాత సవాయి మాధోపూర్, కోట మధ్య నిర్వహించబడుతోంది. ఈ పరీక్షల అనంతరం పూర్తి నివేదికను రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే బోర్డుకు పంపనుంది. కోటా నాగ్దా రైల్వే సెక్షన్‌లోని రోహల్ ఖుర్ద్, చౌమహ్లా మధ్య మొదట్లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులతో సమానమైన బరువుతో నడిచింది. ఇందులో మొదట్లో 130, తర్వాత 140, తర్వాత 150 స్పీడ్‌తో ట్రయల్‌ను తీసుకున్నారు. దీని తర్వాత రైలును జనవరి 1న 160 వేగంతో, రోహల్ ఖుర్ద్ విక్రమ్‌ఘర్‌లో 177 వేగంతో అదే ట్రాక్‌పై పరీక్షించారు. అలాగే రోహల్ ఖుర్ద్, కోటా మధ్య 40 కిలోమీటర్ల దూరంలో 180 కి.మీ వేగంతో రైలు ట్రయల్ చేశారు. ఇందులో భాగంగా వందేభారత్ స్లీపర్ టెస్టింగ్ మూడో రోజు గురువారం కూడా జరిగింది. దీని కింద కోటా నుంచి లాబన్ మధ్య 30 కిలోమీటర్ల దూరంలో ప్రయాణికుల సమాన బరువును ఉంచుతూ వందే భారత్ 180 కి.మీ వేగంతో నడపబడింది. ఇవి సక్సెస్ అయితే ఇక ప్రయాణగమ్యం తగ్గి ప్రయాణం సుఖవంతంకానుంది.

## ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలు అమలు చేయాలి



నర్సంపేటజనవరి : కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులకు ఎన్నికల మీనిఫెస్టోలో ఇచ్చినటువంటి హామీలు అమలు పరుచాలని బి ఆర్ టీ యు రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు డిమాండ్ చేశాడు. వాసవి కల్యాణ మండపంలో అంగన్వాడీ, ఆశాల ఆధ్వర్యంలో. శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ అంగన్వాడీలకు18 వేలు,ఆశాలకు 12 వేలు, మున్సిపల్ కార్మికులకు 21 వేల రూపాయలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చి సంవత్సర కాలం గడిచిన అమలకు నోచుకోలేదని విమర్శించాడు. రాష్ట్రంలో కార్మికులు పోరుబాట పట్టరాని, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు గత 28.రోజులుగా సమ్మె చేస్తున్నారని, గ్రామ పంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయబోతుంన్నారని అన్నాడు. వచ్చే బడ్జెట్లోలో హామీలు అమలు అయ్యే విదంగా బడ్జెట్ రూపాకల్పన చేయాలని అన్నారు. లేని పక్షలో దశల వారిగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో బి ఆర్ టీ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, ఆశాల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష, బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగుల రమేష్, హమాలి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ ,సీనియర్ నాయకులు గుండెబోయిన కొమురయ్య, ఆశాల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బండారి మంజుల,,అంగన్వాడీ రాష్ట్ర నాయకులు రామ తార, విమల శిరీష ,రాధ ,యూనియన్ రాష్ట్ర నాయకులు నాయిని వేణు, పెరమండ్ల రవి, డివిజన్ నాయకులు తరిగొప్పుల రణధీష్ తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న క్యాన్సర్ పేషెంట్లు

## ప్రభుత్వ పరంగా అందని సంపూర్ణ వైద్యం
## ప్రైవేట్ ఆస్పత్రలకు వెళ్లలేక మృత్యువాత



విజయవాడ, : ఇటీవలి కాలంలో క్యాన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగు తుండడం కలవరపెడుతున్నది.అందులో చాలా మందికి పూర్తి స్థాయిలో వైద్యం అందక మృత్యువాత పడుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. వైద్య చికిత్స కోసం ఖర్చు భరించే స్థోమత లేకపోవడం.. ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ దవాఖానలకు వెళ్లే పరిస్థితి లేకపోవడం నిరుపేద రోగుల ప్రాణాల మీదకు వస్తున్నది. ఈ నేపథ్యంలో క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయడం ముఖ్యం. క్యాన్సర్ కారకాలపైనా ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోక్యాన్సర్ రోగుల సంఖ్యం టేటా పెరుగుతున్నది. ప్రభుత్వ ప్రధాన దవాఖానతోపాటు వివిధ ప్రైవేట్ వైద్యశాలల్లో ఏటా చికిత్స పొందుతున్న రోగులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతున్నది. గతంతో పోలిస్తే ఇప్పుడు క్యాన్సర్ ఆస్పత్రులు కిటకిటాడుతున్నాయి. అలాగే వ్యాధి ఎంతలా విస్తరిస్తున్నదో నివేదికలను బట్టి అర్థమవుతుంది. క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటేటా పెరుగుతున్న క్రమంలో స్థానికంగా ప్రభుత్వ వైద్యం పూర్తి స్థాయిలో అందుబాటులో లేక నిరుపేద రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స చేయించుకుంటే ఆర్థిక భారం తప్పడం లేదు. క్యాన్సర్ సోకిన నిరుపేదలైతే చికిత్స చేయించుకునే స్థోమత లేక, దూర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ దవాఖానలకు వెళ్లలేక మృత్యువాత పడుతున్నారు. చికిత్స పొందుతున్న రోగుల్లో ఏటా వేలల్లో మరణాలు సంభవిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. క్యాన్సర్ మునుపటిలా ప్రాణాంతకం కాదని, మొదటి దశలో గుర్తించి సరైన వైద్యం చేయించుకుంటే నయమయ్యే అవకాశమున్నదని వైద్య నిపుణులు చెబుతున్నారు. వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ప్రభుత్వ దవాఖానలో పూర్తి స్థాయిలో వైద్యం అందించే పరిస్థితి లేక ప్రైవేట్ క్యాన్సర్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. చాలా మంది అక్కడికి వెళ్లలేక వ్యాధిని నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకునే స్థోమత లేక పోవడంతో మహిళలు చాలా మంది క్యాన్సర్ వ్యాధిని పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. మహిళల్లో ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, ఒరాల్ క్యాన్సర్ వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇక పురుషుల్లోనూ స్కిన్, బోన్, గొంతు, స్టమక్, పెద్దపేగు వంటి క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాలు మహిళల్లోనూ ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తున్నది. క్యాన్సర్ చికిత్స అందించేందుకు వైద్య విధానంలో పలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా క్యాన్సర్‌ను ఉన్న స్టేజీలోనే ఉంచే విధంగా పాటి కీమోథెరపీ, నయం చేసేందుకు ఇమ్యూనోథెరపీ పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. తక్షణమే జిల్లాకో క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ దవాఖానను ఏర్పాటు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. క్యాన్సర్ రోగులు పెరుగుతున్న నేపథ్యంలో సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటుకు కేంద్రం కూడా ముందుకు రావాల్సి ఉంది. క్యాన్సర్‌కు పూర్తి స్థాయిలో ప్రభుత్వ వైద్యం అందిస్తే నిరుపేద రోగులపై ఆర్థిక భారం పడకుండా ఉంటుంది.

# కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ కోర్టు లైసెన్ ఆఫీసర్స్ తో సమీక్షా సమావేశం



**నిందితులకు శిక్ష పడటం లో కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనది**
**కన్వెక్షన్ రేట్ పెంచాలి : పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్.,**

గోదావరిఖని :కోర్టు డ్యూటీ ఆఫీసర్ లు నేరస్థులు శిక్షల నుండి తప్పించుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి నేరస్తులకు శిక్షలు పడుటకు కృషి చేయాలని రామగుండము పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్.,(ఐజి) అన్నారు. రామగుండము పోలీస్ కమీషనరేట్ పరిదిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిదిలోని పోలీస్ స్టేషన్ లలో పనిచేస్తున్న కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ మరియు కోర్టు లైసెన్ ఆఫీసర్స్ తో కమీషనరేట్ లో సిపి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ... గౌరవ కోర్ట్ లలో అండర్ ట్రయల్ ఖైదీలని జైలు నుండి పోలీసు ఎస్కార్ట్ ద్వారా తగు జాగ్రత్తలు తీసుకొని మరియు జైల్ అథారిటీస్, గౌరవ కోర్టు స్టాఫ్ మరియు సంబధిత అధికారులతో సమన్వయ%శీ% తో గౌరవ కోర్ట్ లో యందు ప్రవేశపెట్టాలని అదేవిధంగా నేరస్థులకు శిక్ష పడే విధంగా సాక్షలను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగే విధంగా చూడాలని సిపి కోర్టు లైజన్ మరియు కోర్టు డ్యూటీ అధికారులకు సూచించడం జరిగింది. నిందితులకు శిక్షలు పడేటట్లు సాక్షులను మోటివేషన్ చేయాలన్నారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం సాక్షులను కోర్టులో హాజరుపర్చాలని సూచించారు. పెండింగ్, పెట్టి కేసులు వెంటనే డిస్పోజల్ చేయాలని, నేరస్తులకు శిక్షలు పడితే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. నేరస్తులకు శిక్షలు పడేవిధంగా కృషిచేయాలని, కన్విక్షన్ రేటును పెంచాలని అన్నారు. కోర్టు నందు ఎఫ్ఐఆర్ లను సరైన సమయంలో అందించాలని కేసుల్లో ఉన్నటువంటి ప్రాపర్టీని సరైన సమయంలో కోర్టు నందు డిపాజిట్ చేయాలి. కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషిచేయాలని, నేరస్తులకు వారంట్స్, సమన్స్, సత్వరమే ఎగ్జిక్యూటివ్ అయ్యే విధముగా చర్యలు తీసుకోవాలని, కోర్టు ప్రాసిక్యూషన్ కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు తెలియజేయాలని, కేసు ట్రయల్స్ సమయములో పబ్లిక్ ప్రాసిక్యూటర్ యొక్క సలహాలు సూచనలు పాటించాలని, కోర్టు పెండింగ్ ట్రయల్ కేసులు, వారెంట్స్, సమన్స్, సి.సి.టి.యన్.యస్ లో ( కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్) లో డాటా ఎంటర్ చేయాలని సూచించారు.కోర్టులో డిస్పోజలైన కేసులను ( సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ) లింకు నందు తప్పకుండ అప్లోడ్ చేయవలెను. కోర్టు నందు ట్రయల్ జరిగిన కేసులు ఎంటర్ చేసినచో పెండింగ్ లేకుండా వుంటుందని తెలిపారు. భాదితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, భాదితులకు మరింత నమ్మకం పెరిగేలా ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని సూచించారు.అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు , ఎసిపి ప్రతాప్, సురేంద్ర, లీగల్ సెల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సిసి ఆర్ బి ఇన్స్పెక్టర్ సతీష్, పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ల కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## జాతీయ అవార్డులు అందుకున్న ఎండి ఇబ్రహీం, ఈదునూరి శంకర్

రామగుండం : సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు ఇండియన్ గెలాక్సీ పౌండేషన్ న్యూఢిల్లీ,అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్ లో ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన వేడుకలలో అంబేద్కర్ భారత్ భూషణ్ అవార్డు ను ఈదునూరి శంకర్ మరియు అంబేద్కర్ నేషనల్ ఎక్సెన్సీ అవార్డు ను ఇన్కమ్ టాక్స్ ఆడిటర్ ఎండి ఇబ్రహీం లు ఈరోజు జరిగిన కార్యక్రమంలో నేషనల్ కమిషన్ ఫర్ మైనార్టీస్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మెంబర్ రించన్ లామో మరియు మాజీ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి మీనాక్షి లేకి చేతుల మీదుగా ఈరోజు జాతీయ అవార్డులు అందుకోవడం జరిగింది



# పథకాల అమలు పక్కాగా సాగాలి !

పథకాలు ఏవైనా ఓటు బ్యాంక్‌తో కాకుండా..ప్రజల సర్వతో ముఖాభివృద్ధిని కాంక్షించి కొనసాగించాలి. అవసరం మేరకే పథకాలను ప్రవేశ పెట్టడం జరగాలి. అలా జరిగినప్పుడే వాటికి సార్థకత ఉంటుంది. కొత్తగా రేషన్ కార్డుల మంజూరు, రైతుభరోసాకోసం తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా మళ్లీ రేషన్ కార్డులు ఇస్తామని కూడా అంటున్నారు. ఇప్పటికే జనాభాను మించి పేద కుటుంబాలను గుర్తించి బియ్యం పంపిణీ చేస్తున్నారు. ధరలు పెరిగిన నేటి కాలంలో కిలో రూపాయి బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఎపిలో వేలకోట్ల రూపాయల బియ్యం పక్కదారి పట్టాయి. గోడౌన్ల నుంచే మాయం అయ్యాయి. నేతలే సూత్రధారులుగా మారి పక్కదారి పట్టించారు. ఇలాంటి సమయంలో తెలుగు రాష్ట్రాల్లో బియ్యం పథకాన్ని తక్షణం సమీక్షించాలి. వ్యాపా రంగా మారిన చౌకబియ్యం ధరలను పెంచాలి. అలాగే పేదలను గుర్తించి వారికి మాత్రమే బియ్యం అందేలా చేయాలి. దీంతో ఖజానకు వేలకోట్లు ఆదా అవుతాయి. దీనిని సంస్కరించ కుండా పోరాదు. ఉచిత విద్యుత్ కూడా సక్రమంగా పొలాలకు వెళ్లేది లేనిది లెక్క కట్టాలి. రైతుభరోసా కూడా కేవలం పంటలు వేసే వారికి అందాలి. ఈ పథకాలను పక్కాగా లెక్కలు తీసి అమలు చేయాలి. అప్పుడు వేలకోట్లు ఆదా కావడంతో ఖజనాకు భారం తప్పుతుంది. రైతుభరోసాకు సంబంధించి త్వరలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించదిం, రైతు భరోసాపై మంత్రివర్గానికి చేయాల్సిన సిఫార్సులపై కేబినెట్ సబ్ కమిటీ చర్చించింది.సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితిని పెట్టవద్దని కమిటీ అభిప్రాయపడింది. అలాగే, రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సబ్ కమిటీ నిర్ణయించింది. ఇదే సందర్భంలో రేషన్ బియ్యం, ఉచిత విద్యుత్ పొందుతున్న రైతుల నుంచి కూడా దరఖాస్తులు తీసుకోవాలి. ఇక్కడే ఎవరు పేదో..ఎవరు కాదో తెలుస్తుంది. గ్రామాల్లో ఎవరెవరు ఉచితంగా పథకాలు అప్పనంగా పొందుతున్నారో క్షేత్రస్థాయి అధికారులకు తెలుసు. పక్కాగా వీటిని అమలు చేయడంలో ఎవరికీ అభ్యంతరాలు ఉండవు. రైతుభరోసా కోసం అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములను గుర్తించాలనుకోవడం మంచిదే. గతంలో లాగా ఎవరికి పడితే వారికి రైతుభరోసా పేరుతో దుబారా చేయకపోవడం మంచిదే. ఇది పంటలు పండించే రైతులకు కూడా ధైర్యం ఇచ్చేది కానుంది. జనవరి 5 నుంచి 7 వరకు రైతు భరోసా దరఖాస్తులు స్వీకరించే అవకాశముందని, సంక్రాంతి పండుగ తర్వాత సర్కార్ రైతు భరోసాను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్దం అవుతున్న వేళ... ప్రత్యేక శ్రద్ద పెట్టాల్సిందే. కేబినెట్ భేటీలో రైతు భరోసాకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోనున్నందున వివరాలు సేకరించడంలో తప్పులేదు. గత ప్రభుత్వం ఒక కోటీ 53 లక్షల ఎకరాలకు రైతుబంధు ఇచ్చింది. గుట్టలు, వెంచర్లు, సాగుచేయని భూములకు కూడా గత ప్రభుత్వం రైతు బంధు ఇచ్చి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని, ఇప్పుడు అలా కాకుండా కేవలం సాగు చేసే భూములకు రైతు భరో సా నిధులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ధరణి పోర్టల్ రికార్డుల ప్రకారం ఒకకోటి 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఇందులో సాగుచేసే భూమి కోటి 30 లక్షలు ఎకరాలుగా ప్రభుత్వం గుర్తించింది. కేవలం ఈ భూ ములకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. తెలంగాణ విస్తీర్ణం 1,12,000 చదరపు కిలోమీటర్లు... అంటే దాదాపు 2 కోట్ల 75 లక్షల ఎకరాల భూమి. దీనిలో కోటీ 60 లక్షల ఎకరాలు వ్యవసాయ భూమి, 66 లక్షల ఎకరాలు అటవీ భూమి, మిగిలినవి గ్రామకంఠాలు, పట్టణాలు, దేవాలయ మాన్యాలు, వక్ఫ్, ఇనాం, శిఖం కింద ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కూడా ఉజ్జాయింపు లెక్కలే కానీ, వాస్తవమైన రుజువులు చేయగలిగే స్పష్టమైన లెక్కలు లేవు. దీని కోసం ఎంత కష్టమైనా పొజిషన్ ప్రకారం సమగ్ర భూసర్వే చేసి తీరాలి. భూమికి సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ మేరకు కార్యాచరణ సాగాలి. అన్యాక్రాంతం, కబ్జా అయిన ప్రభుత్వ భూముల రక్షణ తో పాటు దేవాదాయ భూములను కూడా రక్షించాలి. ఇందుకోసం ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేయాలి. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌లో అవతవకలు జరిగాయని గుర్తించినందున సరిదిద్దే పనిలో పారదర్శకంగా, పక్కాగా పనిచేయాలి. నిజానికి తెలంగాణ భూ సమాచారం విషయంలో దాపరికాలు ఏమీ ఉండవు. ఏ ఊరిలోకి వెళ్లినా, ఈ భూమి ఎవరిది అని అడిగినా... పూర్తి సమాచారాన్ని ప్రజలు నోటితో చెప్పేస్తారు. అటువంటి తెలంగాణలో భూ విషయంలో రహస్యం చేయడం వెనక ఉన్న మతలబు ఎవరికీ అర్థం కాలేదు. నేడు భూమాతలో ప్రతి విషయాన్ని నిర్భయంగా, నిర్దిష్టంగా తెలుసుకునే అవకాశం కల్పించారు. రానున్న మూడు నెలల్లో మరిన్ని అంశాలను పొందుపరుస్తూ, నిపుణుల నుండి మరికొన్ని సూచనలు, సలహాలు తీసుకొని తెలంగాణ రైతాంగ సమస్యలను తీర్చేందుకు, సులువైన మార్గాలను పొందుపరిచేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా భూమాత పనిచేస్తే రైతులకు గొప్ప భరోసా కల్పించినట్లే అవుతుంది. ఈ క్రమంలోరైతు భరోసా సాయం మీద కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. గత ప్రభుత్వం పాస్ పుస్తకం ఉన్న ప్రతి ఒక్కరికి రైతుబంధు ఇచ్చింది. కొండలు, గుట్టలు, ఫామ్‌హౌస్‌లు, కంచెలకు కూడా డబ్బులిచ్చింది. ఈ ప్రభుత్వం కేవలం వ్యవసాయానికి మాత్రమే సాయం అందించాలనే దృఢమైన లక్ష్యంతో ఉన్నది. ప్రతి గ్రామంలోని విలేజ్ అగ్రికల్చరల్ ఆఫీసర్, శాటిలైట్ సహాయంతో పంట పొలాలను గుర్తించి నిజమైన రైతులకు సాయం అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నా తీరు అభినందనీయం.

# ఎన్నికలకు మరో 200 కొత్త పంచాయితీలు



హైదరాబాద్, జనవరి : కొత్తగా మరో 200 గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ప్రభు త్వం ఆలోచన చేస్తోంది. శాసనసభ ఎన్నికలకు ముందు ఆయా ప్రజాప్రతినిధులు స్థానికంగా ఇ చ్చిన హామీ మేరకు ఇప్పుడు ఒత్తిడి పెరుగుతోంది. కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయాలని కోరు తూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిల నుంచి పం చాయతీరాజ్ శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు. తండాలు, గూడెంలు, పెద్ద గ్రామాలకు అనుబంధంగా ఉన్న కొన్ని ఆవాసాలను కొత్తగా వంచాయతీలుగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు. ఎన్నికల ప్రచార స మయంలో ఆయా స్థానిక ప్రజల కోరిక మేరకు త ప్పకుండా పంచాయతీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు పంచాయతీ సమరానికి సమయం దగ్గర పడడంతో కొత్త పంచాయతీల ఏర్పాటు అంశం తెరమీదకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే పం చాయతీరాజ్ చట్ట సవరణ చేసి పలు మార్పులు చేర్పులు చేసింది. కొన్నిచోట్ల పంచాయతీలను ము న్సిపాలిటీల్లో కలిపింది. మరికొన్ని మున్సిపాలిటీల ను నగర పాలక సంస్థలుగా మార్పు చేసింది. దీం తో పాటు చట్టంలో పలు నిబంధనలను కూడా స వరించింది. పంచాయతీల్లో రిజర్వేషన్లు, ఎన్నికలు తదితర అంశాలను ప్రభుత్వం కొలిక్కి తెస్తోంది. ఇదే సమయంలో కొత్త పంచాయతీలను కూడా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను పరిష్కరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంచాయతీల సంఖ్య పెరిగితే అందుకు అనుగుణంగా కేంద్ర నిధులు పెరుగుతాయని భావిస్తున్నారు. కొత్త పం చాయతీల ఏర్పాటుకు ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్ ఆమోదముద్ర వేసిన తర్వాత ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే త్వరలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోన్న నేపథ్యంలో పాత పంచాయతీలతో పాటు కొత్తగా ఏర్పాటు అవుతున్న మరో 200 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ఒకేసారి నిర్వహించేలా అధికారులు యోచిస్తున్నారు. కొత్త పంచాయతీల్లో వార్డులు, ఓటర్ల జాబితా కూడా సిద్ధం చేస్తున్నారు. తాజాగా 200 పంచాయతీలను ఏర్పాటు చేస్తే మొత్తం రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల సంఖ్య 13,191కు పెరుగుతుంది. కాగా కొత్త పంచాయతీల ఏర్పాటుపై ప్రభుత్వం అధికారికంగా నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉంది. కొత్తగా ఏర్పాటు చేయాలని కోరుతున్న గ్రామపంచాయతీల్లో అత్యధికంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ములుగు వంటి ఏజెన్సీ జిల్లాల్లోనే ఉన్నాయని సమాచారం. ఆయా జిల్లాల్లో కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు కోసం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల నుంచి పంచాయతీ రాజ్ శాఖకు విజ్ఞప్తులు రావడంతో ప్రభుత్వం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. కొత్త గ్రామ పంచాయతీలపై ఎన్నికలకు ముందు హామీ ఇచ్చామని, ఎలాగైనా ఏర్పాటుచేసి తీరాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వంపై డిమాండ్ చేస్తున్నారు. దీంతో అవసరమైన చోట్ల ఇప్పటికే ప్రతిపాదనలను తీసుకున్న పంచాయతీ రాజ్‌శాఖ పరిశీలన తర్వాత జనాభా దూరం తదితర పారామీటర్ల ఆధారంగా సుమారు 200 కొత్త పంచాయతీల ఏర్పాటు చేయాలనే ఆలోచనకు వచ్చింది. అయితే ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు తక్కువ జనాభా ఉండడంతో చాలా ప్రతిపాదనలను తిరస్కరించి, ఆయా ప్రజాప్రతినిధులకు ఇప్పటికే సమాచారాన్ని ప్రభుత్వం అందించింది. ఒక గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలంటే కనీసం 350 మంది జనాభా ఉండానే నిబంధన కారణంగా ఇబ్బంది ఎదురవుతోంది. 350 జనాభా నిబంధన చాలా చోట్ల అడ్డంకిగా మారింది. ఈ కనీస జనాభా నిబంధనను మార్చయినా అన్నింటికీ ఒకే చెప్పాలని ప్రభుత్వంపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. తాము ప్రతిపాదించిన ఒక్క గ్రామాన్ని కూడా తొలగించవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలు ఆయా గ్రామ పంచాయతీలకు దూరంగా ఉండడం వల్ల పాలనాపరమైన సమస్యలు వస్తున్నాయి. అభివృద్ధి విషయంలో తమను నిర్లక్ష్యం చేస్తున్నారని గూడాలు, తండాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన అభ్యర్థుల ముందు ఇదే డిమాండ్ పెట్టారు. తాము అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేస్తామని అభ్యర్థులు హామీ ఇచ్చారు. ఇప్పుడా హామీ నిలుపుకునే అవకాశం రావడంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టారు. ఎన్నికలకు ముందే పంచాయతీలను ఏర్పాటు చేస్తే పార్టీకి కూడా కలిసి వస్తుందని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. గూడేలు, తండాలు, అనుబంధ గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజలకు దూరభారం కూడా తగ్గుతుంది. కేంద్ర, రాష్ట్రం నుంచి ప్రత్యేక నిధులు కూడా పెరిగి వల్ల అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

# హోమ్ మంత్రి పీఏ పై వేటు

విజయవాడ, జనవరి 4,: హోం మంత్రి అనిత పీఏ జగదీశ్‌పై వేటు.. అసలేం జరిగిందంటే.. ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వద్ద ప్రైవేటు పీఏగా పనిచేస్తున్న సంధు జగదీష్‌పై వేటు పడింది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో జగదీష్‌ను ఆ పోస్టు నుంచి తొలగించారు. ఇక, బదిలీలు, పోస్టింగులు, సిఫార్సుల కోసం జగదీష్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సెటిల్‌మెంట్ దందాలు కూడా చేస్తున్నారని కూడా పలువురు ఆరోపించారు. జగదీష్ వ్యవహారంపై ప్రభుత్వానికి, టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదులు అందాయి. దీంతో జగదీష్ వేటు పడింది. ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వద్ద ప్రైవేటు పీఏగా పనిచేస్తున్న సంధు జగదీష్‌పై వేటు పడింది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో జగదీష్‌ను ఆ పోస్టు నుంచి తొలగించారు. వివరాలు.. వంగలపూడి అనిత వద్ద జగదీష్ ప్రైవేటు పీఏగా పనిచేస్తున్నారు. అయితే జగదీష్‌పై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. బదిలీలు, పోస్టింగులు, సిఫార్సుల కోసం అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సెటిల్‌మెంట్ దందాలు కూడా చేస్తున్నారని కూడా పలువురు ఆరోపిస్తున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు అనితను కలవడానికి వెళ్లిన సమయంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే మంత్రి అనిత తర్వాత తానే అన్నట్టుగా జగదీష్ వైఖరిపై టీడీపీ క్యాడర్ సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే జగదీష్‌పై ఎన్ని ఆరోపణలు, విమర్శలు వచ్చినప్పటికీ హోం మంత్రి అనిత మాత్రం వాటిని పట్టించుకోలేదు. దీంతో అనిత అండతోనే జగదీష్ ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నాడనే ప్రచారం కూడా తెరమీదకు వచ్చింది. అయినప్పటికీ అనిత వైపు నుంచి ఎలాంటి చర్యలు లేవు. ఈ నేపథ్యంలో జగదీష్ వ్యవహారంపై ప్రభుత్వానికి, టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదులు అందాయి. దీంతో జగదీష్‌ను అనిత పీఏ పోస్టు తొలగించారు. ఈ విషయాన్ని అనిత స్వయంగా కార్యకర్తల సమావేశంలో వెల్లడించడం గమనార్హం.

# ముందుకు సాగేదెలా...

## ఆరాం ఘర్ బ్రిడ్జి ప్రారంభానికి ముహూర్తం

హైదరాబాద్, జనవరి : హైదరాబాద్‌లోని ఆరాంఘర్ నుండి జూ పార్క్ వరకు నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభ తేదీ వాయిదా పడింది. దీంతో ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం పొందేందుకు హైదరాబాద్ వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభమైతే.. ఆరాంఘర్– బహదూర్‌పురా మధ్య ట్రాఫిక్ కష్టాలు తప్పనున్నాయి. ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. ఎందుకంటే ఇది ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌ను తగ్గిస్తుందని అంటున్నారు. ఫ్లైఓవర్ ప్రారంభం అయితే.. కొన్ని సంవత్సరాలుగా ఉన్న గుంతల రోడ్డు నుండి ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు. మొదట డిసెంబర్ 3, 2024న ప్రారంభించాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. అయితే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీన్ని ప్రారంభించాలని అనుకున్న తర్వాత.. వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు అనేది ఇంకా ప్రకటించలేదు. ఈ ఫ్లైఓవర్ 4.04 కిలోమీటర్లు ఉంది. ఇది హైదరాబాద్‌లోని రెండో పొడవైన ఫ్లైఓవర్‌గా నిలిచింది. ఆరు లేన్లలో దీన్ని నిర్మించారు. రెండు వైపులా రాకపోకలు సాగించవచ్చు. ఆరాంఘర్ ఫ్లైఓవర్ ప్రారంభించిన తర్వాత.. హైదరాబాద్‌లోని అనేక కీలక ప్రాంతాలలో ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. ముఖ్యంగా ఆరాంఘర్, శాస్త్రిపురం, కాలాపత్తర్, దారుల్ ఉలూమ్, శివ్రాంపల్లి, హసన్‌నగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తగ్గనున్నాయి. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం నగర అభివృద్ధికి ఒక నిదర్శనం అని అధికారులు చెబుతున్నారు. ఇది నగరాన్ని ఆధునికంగా మార్చడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ఈ ప్రాంతంలోని సామాజిక, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని భావిస్తున్నారు.

## సీబీఐ విచారణకు అనుమతి అవసరం లేదు

న్యూఢిల్లీ, జనవరి : దేశంలోని 10 రాష్ట్రాలకు సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) విచారణకు రాష్ట్రాల సమ్మతి అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ రాష్ట్రాల్లో తెలంగాణ, పంజాబ్, జార్ఖండ్, కేరళ, మిజోరం, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మేఘాలయ, తమిళనాడు ఉన్నాయి. సీబీఐకి రాష్ట్రాల ఎంట్రీలో ఆ రాష్ట్రాల జనరల్ కన్సంట్ అవసరం లేదని తెలిపింది. అవినీతి కేసులో ఇద్దరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై సీబీఐ దర్యాప్తును రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును న్యాయమూర్తులు సీటీ రవికుమార్, రాజేష్ బిందాల్‌లతో కూడిన ధర్మాసనం జనవరి 2న కొట్టివేసింది. పోస్టింగ్ స్థలంతో సంబంధం లేకుండా, పై వాస్తవ పరిస్థితులను బట్టి వారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు/కేంద్ర ప్రభుత్వ అండర్‌టేకింగ్ ఉద్యోగులు అని, అలాగే అవినీతి నిరోధక చట్టం ప్రకారం తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారని బెంచ్ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై సీబీఐ ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడంతో ఈ కేసు వచ్చింది. అయితే రాష్ట్రంలో సీబీఐ దర్యాప్తు చేయాలంటే ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుండి అనుమతి తీసుకోవాల్సి ఉండేది. ఈ నిబంధన తెలంగాణ, జార్ఖండ్, పంజాబ్, కేరళ, మిజోరం, బెంగాల్, చత్తీస్ గఢ్, రాజస్థాన్, మేఘాలయ, తమిళనాడు రాష్ట్రాలలో అమలులో ఉంది.

దూరంగా ఉంటామని భావిస్తున్నారు. అది గ్రహించి వైసీపీ నుంచి కీలక నేతలు పార్టీని వీడి వెళ్లిపోతున్నారన్నది కూడా జగన్ దృష్టికి వచ్చిందట. కూటమిని వచ్చే ఎన్నికల్లోనూ ఎదుర్కొనడం కష్టమని భావించిన నేతలు తమ దారి తాము చూసుకుంటున్నారు. జగన్ కు ఇప్పుడు బీజేపీ నేరుగా సాయం అందించే పరిస్థితుల్లో మాత్రం లేదు. అధికారంలో లేకపోవడంతో పాటు చంద్రబాబు, పవన్ కల్యాణ్ నుంచి మద్దతు పుష్కలంగా ఉండటంతో జగన్ ను పార్టీ కేంద్ర నాయకత్వం కూడా పట్టించుకోవడం మానేసిందంటున్నారు. అంతేకాకుండా జగన్ పార్టీ వల్ల బీజేపీకి పరోక్షంగా, ప్రత్యక్షంగా ఉపయోగం ఏమీ లేనందున జగన్ ను దూరం పెట్టారంటున్నారు. ఢిల్లీలో వైసీపీకి చెందిన నేతలు చేసిన సయోధ్య ప్రయత్నాలు కూడా ఫలించలేదని చెబుతున్నారు ఈ క్రమంలోనే ఈ గండం నుంచి బయటపెడేదెలా? అన్నది జగన్ కు అర్థం కాకుండా ఉంది. కీలక నేతలు వెళ్లిపోయినా క్యాడర్ లో నుంచి లీడర్లను ఎంపిక చేస్తున్నప్పటికీ వారు ఎంత వరకూ విజయం దిశగా పయనిస్తారన్నది పెద్దడౌటు. పర్చూరు నియోజకవర్గంలో గాదె కుటుంబానికి మళ్లీ టిక్కెట్ ఇవ్వడం కూడా ఇందులో భాగమేనంటున్నారు. అదే సమయంలో ఇటు గెలుపుపై అనుమానాలు, అటు కేసులు చుట్టుముడతాయన్న సమాచారంతో జగన్ కొంత ఇబ్బంది పడుతున్నారని తెలిసింది. లాబీయింగ్ చేసేందుకు కూడా జగన్ కు దారులు మూసుకుపోయాయని, ఈ తరుణంలో మరోసారి ఓటమి పాలయితే ఇక పార్టీని చాపచుట్టేయాల్సిందేనంటున్నారు. అదే జగన్ బెంగ.. అసలు భయమన్నది పార్టీ వర్గాల ద్వారా తెలుస్తున్న విషయం.

## యాదాద్రిలో అగ్నిప్రమాదం.. ఒకరు మృతి

నల్గొండ, జనవరి : యాదాద్రి భువనగిరి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పెద్దకందుకూరులో భారీ పేలుడు సంభవించింది. ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్ పరిశ్రమలో పేలుడు సంభవించడంతో ఒక కార్మికుడు మృతిచెందగా.. మరో 10 మంది కార్మికులకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు సంభవించడంతో కార్మికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రాణ భయంతో కంపెనీ నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు. గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్ లలో ఆసుపత్రికి తరలిస్తున్నారు. పేలుడు సమాచారం అందుకున్న వెంటనే కార్మికుల కుటుంబసభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పేలుడు జరిగిన వెంటనే సైరన్ మోగించి మిగతా కార్మికులను అప్రమత్తం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలిస్తున్నారు. ఘటన ఎలా జరిగిందన్న దానిపై ఆరా తీస్తున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని దూలపల్లిలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ కెమికల్ గోదాంలో భారీగా మంటలు ఎగిసి పడి.. నిమిషాల్లో దట్టమైన పొగలు వ్యాపించాయి. పొగలతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది రెండు ఫైరింజన్లతో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదం సంభవించడంతో దూలపల్లిలో కొంత సమయం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు

# నాలుగు జిల్లాల్లో భూములు బంగారం



రంగారెడ్డి, జనవరి రీజనల్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ అభివృద్ధి వేరే లెవల్‌కు వెళ్తోందనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా నగరం చుట్టుపక్కల 4 జిల్లాల్లో అభివృద్ధి వేగంగా జరగనుంది. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే హైదరాబాద్ సంస్థానం చాలా రిచ్. స్వాతంత్ర్యం వచ్చాక.. భాగ్యనగరంలో వేలాది ఎకరాల ప్రభుత్వ ఆస్తులు ఉండేవి. అప్పటికే దేశంలో ఎక్కడా లేనివిధంగా కట్టడాలు, నిర్మాణాలు హైదరాబాద్‌లో వెలిశాయి. ఆ తర్వాత కాలక్రమేనా పరిశ్రమల అభివృద్ధి, ఫార్మా రంగం అభివృద్ధి హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చింది. సైబర్ టవర్స్ నిర్మాణం, ఐటీ ఎగుమతులు హైదరాబాద్ అభివృద్ధి బంగారు బాటలు వేశాయి. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు హైదరాబాద్ అభివృద్ధికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాయి. తద్వారా నగర అభివృ ద్ధితో పాటు.. భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంతో.. నగర రూపురేఖలు మారిపోయాయి. గతంలో ఉన్న నగరం కంటే.. దాదావు 10 నుంచి 15 కిలోమీటర్ల వేర అభివృద్ధి చెందింది. తాజా గా.. రీజనల్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ అభివృద్ధిని ఎవరూ ఆప లేని విధంగా తయారైంది. ముఖ్యంగా రియల్ రంగంలో దేశంలోని ప్రధాన నగరాలతో పోలిస్తే.. హైదరాబాద్ భూములకు ఎక్కువ డిమాండ్ పెరిగింది. ఇతర రాష్ట్రాల వారు కూడా హైదరాబాద్ పరిసరాల్లో భూములు కొనుగోలు చేయాలని ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా ఇటీవల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణమయ్యే 4 నాలుగు జిల్లాల్లో భూములు కొనుగోలు చేయడానికి ముందుకొస్తున్నారు. రింగ్ రోడ్డు ఉత్తర భాగం పనులు మొత్తం ఐదు ప్యాకేజీల్లో చేపడుతున్నారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల మీదుగా దీన్ని నిర్మించనున్నారు. ప్రధానంగా ఔటర్ రింగ్ రోడ్డు తోపాటు.. జాతీయ రహదారులు, ఇతర జిల్లా కేంద్రాలకు వెళ్లే మార్గాలను దృష్టిలో పెట్టుకుని ఇంటర్‌ఛేంజ్‌లను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 11 ఇంటర్‌ఛేంజ్‌లతో పాటు టోల్‌ప్లాజాలు, రెస్టరూంలు, సర్వీసు రోడ్లు, బస్‌బేలు, ట్రక్ బేలు నిర్మించనున్నారు. ప్రస్తుతం నాలుగు వరుసలుగా నిర్మిస్తున్నా.. భవిష్యత్తులో ఆరు, ఎనిమిది వరుసలుగా పెంచుకునే అవకాశం ఉంది. దీంతో ఇప్పుడైతే.. ఈ 4 జిల్లాల పరిధిలో భూముల ధరలు బంగారంతో పోటీ పడుతున్నాయి. ఉత్తరభాగంలో నిర్మించే నాలుగు వరుసల రహదారికి 11 జాతీయ, రాష్ట్ర రహదారులు అనుసంధానం కానున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ రీజినల్ ఎక్స్‌ప్రెస్‌వేగా వ్యవహరించే ఈ రహదారికి అనుసంధానంగా ఉండే మార్గాల ద్వారా.. హైదరాబాద్ నగరంతో పాటు నగర శివారులోకి కూడా రాకుండానే నేరుగా ఇతర రాష్ట్రాలకు ప్రయాణం చేయవచ్చు. అందుకే ఈ జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటు, నివాస సముదాయాల కోసం భూముల కోసం ఎక్కువమంది అన్వేషిస్తున్నారు. రిజనల్ రింగ్ రోడ్డు వినియోగంలోకి వస్తే.. వివిధ జిల్లా కేంద్రాలకు కూడా నేరుగా వెళ్లవచ్చు. అంతర్రాష్ట్ర వాహనాలకు దూరం తగ్గనుంది. ఫలితంగా హైదరాబాద్ ప్రాంత పరిధిలో వీటి తాకిడి తగ్గే అవకాశాలున్నాయి. కనెక్టివిటీ పెరగడంతో ఎకనామిక్ కారిడార్‌గా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది. ఈ రహదారితో అనుసంధానమయ్యే జిల్లాల్లోనూ వ్యాపారరంగం మరింత వృద్ధి చెందనుంది. ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద వివిధ ఆకృతుల్లో రోడ్లను నిర్మించనుండడంతో ఈ ప్రాంత రూపురేఖలు కూడా పూర్తిగా మారిపోనున్నాయి.

# ఏపీలో కొత్తగా ఏడు విమానాశ్రయాలు

## గన్నవరంలో గొప్పగా టెర్మినల్ భవనం

అమరావతి: కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, నాగార్జునసాగర్, తుని అన్నవరం, ఒంగోలులో కొత్త విమానాశ్రయాలు నిర్మించబోతున్నట్టు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఉండవల్లిలోని తన నివాసంలో నిన్న పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ అధికారులతో నిర్వహించిన సమీక్ష అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. శ్రీకాకుళంలో విమానాశ్రయ నిర్మాణానికి ఇప్పటికే ఫీజిబిలిటీ సర్వే పూర్తయిందని, అక్కడ రెండు దశల్లో 1,383 ఎకరాల్లో నిర్మించనున్నట్టు చెప్పారు. ఇందుకోసం భూసేకరణ జరుపుతున్నట్టు తెలిపారు. దగదర్తిలో 1,379 ఎకరాల్లో నిర్మించనున్న విమానాశ్రయం కోసం ఇప్పటికే 635 ఎకరాలు సేకరించినట్టు పేర్కొన్నారు. అలాగే, నాగార్జునసాగర్‌లో 1,670, తాడేపల్లిగూడెంలో 1,123 ఎకరాల్లో ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నట్టు వివరించారు. ఒంగోలులో 657 ఎకరాలు, తుని–అన్నవరం మధ్య 757 ఎకరాలను గుర్తించినట్టు చంద్రబాబు తెలిపారు. కూచిపూడి నృత్యం, అమరావతి స్తూపం థీమ్ గన్నవరం విమానాశ్రయంలో నిర్మించే టెర్మినల్ భవనాన్ని కూచిపూడి నృత్యం, అమరావతి స్తూపం థీమ్‌తో రూపొందించిన ఆకృతులతో నిర్మించేందుకు సీఎం ఆమోదం తెలిపారు. విమానాశ్రయ విస్తరణ, కొత్త టెర్మినల్ భవన నిర్మాణ పనులను ఆరు నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే, దగదర్తి ప్రాంతంలో బీపీసీఎల్ చమురు శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తోందని, అనకాపల్లి జిల్లాలో కొత్త పరిశ్రమలు, నక్కపల్లిలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కాబోతున్నట్టు వివరించారు. శ్రీసిటీలో ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఏవియేషన్ విశ్వవిద్యాలయం, శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా ఉన్నట్టు చెప్పారు. భవిష్యత్తులో ప్రైవేటు విమానాల పార్కింగ్ అవసరాలు పెరుగుతాయి కాబట్టి అందుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందని చంద్రబాబు పేర్కొన్నారు.

# అనకాపల్లి, ఆనందపురం రోడ్లకు లైన్ క్లియర్



విశాఖపట్టణం, జనవరి : వైజాగ్ వాసులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఎన్నో ఏళ్లుగా వైజాగ్ వాసుల ఎదురు చూపులకు నేటి ప్రకటనతో తెరపడింది. విశాఖపట్నం జిల్లాలోని ఔఊ-516అలో అనకాపల్లి ? ఆనందపురం ఔఊ-16 కారిడార్‌ను షీలానగర్ జంక్షన్‌కు కలుపుతూ రహదారిని అభివృద్ధి చేసేందుకు కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ప్రకటన విడుదల చేశారు.విశాఖపట్నం జిల్లాలోని ఔఊ-516అలో అనకాపల్లి ? ఆనందపురం ఔఊ-16 కారిడార్ ఉంది. ఈ రహదారిలో నిరంతరం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. అయితే దగ్గరలోని షీలానగర్ జంక్షన్‌కు 6 లైన్ల రహదారిని విస్తృత పరచాలని ఎప్పటి నుండో డిమాండ్ వినిపిస్తోంది. ఈ రహదారిని అభివృద్ధి పరచడం ద్వార, వైజాగ్ పోర్టుకు వెళ్లే వాహనాలు అతి త్వరగా తమ గమ్యానికి చేరుకుంటాయి. ఈ విషయాన్ని ఏపీ ప్రభుత్వం, కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. దీనితో తాజాగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ప్రకటన జారీ చేశారు.విశాఖపట్నం పరిధిలోని అనకాపల్లి ? ఆనందపురం ఔఊ-16 కారిడార్‌ను షీలానగర్ జంక్షన్‌కు కలుపుతూ 6 లైన్ల హైవే నిర్మాణం కోసం ?963.93 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. 12.66 కి.మీ విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్ట్ సబ్బవరం గ్రామానికి తూర్పు వైపున ప్రారంభమై షీలానగర్ జంక్షన్‌లోని ప్రస్తుత పోర్టు రోడ్డులో గెయిల్ కార్యాలయం దగ్గర ముగుస్తుందన్నారు. ఈ రహదారి అభివృద్ధి చేయడం ద్వార, ట్రాఫిక్ అంతరాయాలను అధిగమించడం సాధ్యమవుతుందన్నారు. షీలానగర్ ? ఆనందపురం ట్రాఫిక్‌ను వేరు చేయడం ద్వారా విశాఖపట్నం పోర్టుకు కనెక్టివిటీ గణనీయంగా పెంచుతుందని గడ్కరి అన్నారు.ఈ ప్రకటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి గడ్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పీఎం నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబుల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, ఏపీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఏపీ విశేషమైన పురోగతిని సాధిస్తోందని పవన్ అభిప్రాయపడ్డారు. తాజాగా రహదారిని విస్తరించడం ద్వార, వైజాగ్ వాసుల కల నెరవేరిందని పవన్ ట్వీట్ చేశారు.

# వైసీపీకి షాక్ ఇవ్వనున్న ఎమ్మెల్సీలు




విజయవాడ, జనవరి 4,: ఏపీలో అధికారం కోల్పోయిన వైసీపీకి వరుస పెట్టి షాక్‌లు తగులుతున్నాయి. ఓవైపు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు వలస బాట పడుతుండగా..ఇక సిట్టింగ్ ఎమ్మెల్సీలు కూడా జంపింగ్ జపాంగ్ అంటున్నారు. మండలిలో మెజార్టీ ఉండటంతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్న వైసీపీకి సొంత పార్టీ ఎమ్మెల్సీలు ఝలక్ ఇస్తున్నారు. పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కళ్యాణ్ చక్రవర్తి ఇప్పటికే టీడీపీలో చేరారు. ఆ ముగ్గురి రాజీనామాలను మండలి ఛైర్మన్ ఆమోదించలేదు.ఇక లేటెస్ట్‌గా జయమంగళ వెంకటరమణ జనసేన కండువా కప్పుకున్నారు. ఇక రాయలసీమకు చెందిన ఎమ్మెల్సీ, మండలి వైస్ ఛైర్మన్ జకియా ఖానమ్..ఈ మధ్యే కడప పర్యటనకు వెళ్లిన డిప్యూటీ సీఎం పవన్‌ను కలిశారు. అంతకముందు మంత్రి లోకేశ్‌ను కలిశారు జకియా. అయితే టీటీడీ సిఫార్సు లేఖల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జకియాను చేర్చుకోవడంపై టీడీపీ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే జనసేనలో చేరే ప్రయత్నాలు ముమ్మరం చేశారట జకియా. ఇక ఇందుకూరి రఘురాజు టీడీపీ కండువా కప్పుకోకపోయినా ఎన్నికల ముందు కూటమి గెలుపునకు సహకరించారు.ఏపీ శాసనమండలిలో 58 మంది సభ్యులకు గాను ప్రస్తుతం వైసీపీకి 30 మంది, టీడీపీకి 9, జనసేనకు 1, పీడీఎఫ్‌కు 2, ఇండిపెండెంట్లు 4, నామినేటెడ్ సభ్యులు 8 మంది ఉన్నారు. అయితే వైసీపీ 30 మంది సభ్యుల్లో చాలా మంది టీడీపీలోకి టచ్‌లోకి వెళ్లినట్లు జరుగుతున్న ప్రచారమే హీట్ పుట్టిస్తోంది. రాయలసీమకు చెందిన ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్సీలు టీడీపీలో చేరడానికి సిద్ధమవుతున్నారని టాక్. అదే విధంగా వైసీపీ మద్దతుతో ఉపాధ్యాయ కోటాలో గెలిచిన ఇద్దరు ఎమ్మెల్సీలు కూడా సైకిల్ సవారీకి ఆసక్తిగా ఉన్నారంటున్నారు.అయితే ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకునే విషయంలో టీడీపీ ఆచితూచి వ్యవహరిస్తోంది. గత ఐదేళ్లలో టీడీపీ లీడర్లు, క్యాడర్‌ను ఇబ్బంది పెట్టిన వారిని ఎట్టి పరిస్థితుల్లో పార్టీలో చేర్చుకోకూడదని భావిస్తున్నారు. అందుకే దాదాపు పది మంది మండలి సభ్యులు టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నా, సైకిల్ పార్టీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం లేదట. ఇదే ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ డిబేట్‌గా మారింది.టీడీపీ డోర్స్ ఓపెన్ చేస్తే మండలిలో వైసీపీ సీట్ల సంఖ్య తగ్గడం ఖాయమన్న చర్చ జరుగుతోంది. అయితే వైసీపీ బలాన్ని మండలిలో తగ్గించేద్దామని కూటమి వేస్తున్న స్కెచ్‌కు పలువురు ఎమ్మెల్సీలు అట్రాక్ట్ అవుతున్నారు. కొందరు ఎమ్మెల్సీలు అయితే తామంతట తామే..అయితే టీడీపీలో లేకపోతే జనసేనలో చేరేందుకు ఉవ్విళ్లూరుతున్నారటమరోవైపు పార్టీ కండువా మారిస్తే అనర్హత వేటు పడుతుందన్న అంశం తెరమీదకు వస్తోంది. పార్టీ మారిన ఎమ్మెల్సీల విషయంలో వైసీపీ న్యాయపోరాటం చేస్తోంది. మండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేసి ఒత్తిడి తెస్తుంది. అయితే ఎమ్మెల్సీలు రాజీనామా చేసి పార్టీ మారుతుండటం..వాళ్ల రిజైన్ లెటర్లు మండలి ఛైర్మన్ దగ్గర పెండింగ్‌లో ఉండటంతో ఇప్పటికే పార్టీ మారిన ఎమ్మెల్సీలకు సమస్యలు రావడం లేదు. నలుగురైదుగురు వెళ్లినా ప్రస్తుతానికి అయితే శాసన మండలిలో వైసీపీ సేఫ్‌గానే ఉంది. పెద్ద మొత్తంలో ఎమ్మెల్సీలు పార్టీ మారేందుకు రెడీ అయితే మాత్రం విలీనం వైపు అడుగులు పడే అవకాశం ఉంది. ప్రస్తుతం మండలిలో ప్రతిపక్ష నేతగా వైసీపీని లీడ్ చేస్తున్నారు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ.గత ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే టికెట్ దక్కని నేతలు కొందరు ఎమ్మెల్సీలు.. తమ సొంత పనుల కోసం, వ్యక్తిగత అవసరాల కోసం జంప్ అవుతున్న వారు మరికొందరు ఉన్నారు. ఇలా అధికారం కోల్పోయిన షాక్ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వైసీపీకి వరుస ఝలక్‌లు ఇబ్బందికి గురి చేస్తున్నాయి. చూడాలి మరి రాబోయే రోజుల్లో ఇంకా వైసీపీ లీడర్లు ఎవరో..కూటమి టార్గెట్‌లో ఉన్న నేతలెవరో.

# ఆ మూడింటిపైనే ఆశలు

విజయవాడ,జనవరి ,: రాష్ట్ర విభజన జరిగి 2014 తర్వాత ముఖ్యమంత్రి అయిన తర్వాత నుంచి కేవలం మూడు అంశాలనే ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. నాడు ఐదేళ్లలో ఆ మూడు పనులు పూర్తి చేయలేకపోయారు. అందులో ఒకటి రాజధాని అమరావతి. రెండోది పోలవరం. మూడోది నదుల అనుసంధానం. ఇప్పుడు 2024లోనూ అవే సబ్జెక్టులు ఏపీ చుట్టూ తిరుగుతున్నాయి. కాదు.. కాదు.. చంద్రబాబు వాటిని ఏమాత్రం మర్చిపోలేదు. వాటి వెనక పడుతున్నారు. ఆ మూడింటి గురించే ఎక్కువగా ప్రస్తావిస్తుంటారు. ? వేదిక ఎక్కడయినా... ఏ సభలో ఆయన ప్రసంగించినా... అది వేదిక ఎక్కడయినా.. ఏపీలోనైనా.. విదేశాల్లోనైనా ఈ మూడు అంశాలు ప్రస్తావనకు రాకుండా ఆగవు. అయితే ఈసారి మాత్రం అమరావతిపై కొంత అడుగులు వేస్తున్నట్లే కనిపిస్తుంది. ఎక్కడ పట్టినా ఆయన అమరావతి గురించి మాత్రమే ప్రస్తావిస్తున్నారు. రాజధాని నిర్మాణం పూర్తయితే సంపద దానంతట అదే పెరుగుతుందని ఆయన భావిస్తున్నారు. కానీ మళ్లీ హైకోర్టు, అసెంబ్లీ భవనాల నిర్మాణాలను చేపడుతున్నారు. అలాగే రహదారుల నిర్మాణం కూడా పూర్తి కావాలని సంకల్పించారు. ఈ నెలలోనే పనులను ప్రారంభించేందుకు సిద్ధమవుతారు. ప్రతిష్టాత్మకమైన సంస్థలను అమరావతికి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడే ఆయన ఐదు ఎకరాలను కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపడతానని ప్రకటించి ఇక్కడి భూములకు హైప్ తెచ్చే ప్రయత్నంచేశారు.. ఇక పోలవరం పనులను కూడా ఈ నెలలోనే ప్రారంభించాలని రెడీ అవుతున్నారు. ఇటీవల పోలవరం ప్రాజెక్టును సందర్శించి సమీక్ష చేసిన అనంతరం ఆయన జనవరి నెల నుంచి పనులు ప్రారంభించాలని అధికారులకు టైం బౌండ్ కార్యక్రమాన్ని కూడా నిర్దేశించారు. పోలవరం నిర్మాణ పనులను ఈసారైనా పూర్తిచేయగలరా? అన్న అనుమానం టీడీపీ నేతల్లోనే వ్యక్తమవుతుంది. ఎందుకంటే భారీ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావాలంటే కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో సహకారం కావాల్సి ఉంటుంది. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వంటివి కల్పించాల్సి ఉంటుంది. వీటన్నింటినీ అధిగమించుకుని ఈ టర్మ్ లో దానిని పూర్తిచేయగలిగితేనే చంద్రబాబుకు రాజకీయంగా ఇబ్బందులుండవు మరోవైపు నదుల అనుసంధానం గురించి కూడా పదే పదే ప్రస్తావిస్తుంటారు. గోదావరి నది నీటిని రాష్ట్ర మంతటా నింపి ఆయకట్టు పెంచాలన్నది ఆయన ఆకాంక్ష. దానికి జలహారతి అని పేరు పెట్టారు. మరి దీనిని ప్రారంభించాలంటే వేల కోట్ల రూపాయల నిధులు అవసమవుతాయి. ప్రాజెక్టుల నిర్మాణం,నిర్వహణ ప్రయివేటు సంస్థలకు అప్పగించాలనుకుంటున్నారన్న విమర్శలు కూడా ఆయన లెక్కచేయడం లేదు. తాను అనుకున్నదే చేస్తానని చెబుతున్నారు. ఈ మూడు అంశాలకు సంబంధించి వేల కోట్ల రూపాయలు వెచ్చించేందుకు సిద్ధమయిన చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల అమలుకు వచ్చేసరికి మాత్రం బీదపలుకులు పలుకుతుండటంపై ప్రజల్లో ఒకరకమైన అసంతృప్తి నెలకొంది. కానీ చంద్రబాబు మాత్రం ఈ మూడు అంశాలనే ముందుకు తెస్తూ ఆ విధంగా ముందుకు వెళుతున్నారన్నమాటమంత్రులకు క్లాస్: అదే సయమంలో కేబినెట్ లో అధికారిక చర్చముగిసిన తర్వాత ప్రత్యేకంగా చంద్రబాబు నాయుడు మంత్రులతో సమావేశమయ్యారు. అయితే ఈ సందర్భంగా మంత్రులకు క్లాస్ పీకినట్లు తెలిసింది. ఆరు నెలలు కావస్తున్నప్పటికీ ఇంకా పనితీరు మెరుగుపర్చుకోక పోవడంపై ఒకింత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సీనియర్లను పక్కన పెట్టి జూనియర్లయినా పార్టీకి, ఇటు ప్రభుత్వానికి ఉపయోగపడతారని భావించి కేబినెట్ లో చోటు కల్పిస్తే కనీస బాధ్యతలేకుండా వ్యవహరించడమేంటని ప్రశ్నించినట్లు తెలిసింది. కొందరి పేర్లు పెట్టి మరీ ఇలాగయితే తాను తీవ్రమైన నిర్ణయాలను తీసుకోవాల్సి ఉంటుందని, ఎప్పటికప్పుడు తప్పులు కౌంట్ అవుతున్నాయని కూడా చంద్రబాబు హెచ్చరించినట్లు సమాచారం.

# ఆరాం ఘర్ బ్రిడ్జి ప్రారంభానికి ముహూర్తం

హైదరాబాద్, జనవరి : హైదరాబాద్‌లోని ఆరాంఘర్ నుండి జూ పార్క్ వరకు నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభ తేదీ వాయిదా పడింది. దీంతో ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం పొందేందుకు హైదరాబాద్ వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభమైతే.. ఆరాంఘర్- బహదూర్‌పురా మధ్య ట్రాఫిక్ కష్టాలు తప్పనున్నాయి. ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించారు.ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. ఎందుకంటే ఇది ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌ను తగ్గిస్తుందని అంటున్నారు. ఫ్లైఓవర్ ప్రారంభం అయితే.. కొన్ని సంవత్సరాలుగా ఉన్న గుంతల రోడ్డు నుండి ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు. మొదట డిసెంబర్ 3, 2024న ప్రారంభించాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. అయితే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీన్ని ప్రారంభించాలని అనుకున్న తర్వాత.. వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు అనేది ఇంకా ప్రకటించలేదు.ఈ ఫ్లైఓవర్ 4.04 కిలోమీటర్లు ఉంది. ఇది హైదరాబాద్‌లోని రెండో పొడవైన ఫ్లైఓవర్‌గా నిలిచింది. ఆరు లేన్లలో దీన్ని నిర్మించారు. రెండు వైపులా రాకపోకలు సాగించవచ్చు. ఆరాంఘర్ ఫ్లైఓవర్ ప్రారంభించిన తర్వాత.. హైదరాబాద్‌లోని అనేక కీలక ప్రాంతాలలో ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. ముఖ్యంగా ఆరాంఘర్, శాస్త్రిపురం, కాలాపత్తర్, దారుల్ ఉలూమ్, శివ్రాంపల్లి, హసన్‌నగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తగ్గనున్నాయి.ఈ ఫ్లైఓవర్ నిర్మాణం నగర అభివృద్ధికి ఒక నిదర్శనం అని అధికారులు చెబుతున్నారు. ఇది నగరాన్ని ఆధునికంగా మార్చడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ఈ ప్రాంతంలోని సామాజిక, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఈ ఫ్లైఓవర్‌ను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక రహదారి అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ)లో భాగంగా నిర్మించారు

# జాతీయ కరాటే పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన మంథని విద్యార్థిని



మంథని , జనవరి జాతీయ కరాటే పోటీల్లో మంథని పట్టణానికి చెందిన కరాటే విద్యార్థిని బంగారు, వెండి పతకాలు సాధించింది. మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్లో మూడు రోజులపాటుజరిగిన జాతీయస్థాయి కరాటేపోటీల్లోకరాటే శిక్షకులు, రాష్ట్రరిఫరీ కమిషన్ కావేటి సమ్మయ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా మంథని కి చెందిన జపాన్ సిటోరియు కరాటే అకాడమీ విద్యార్థిని మెట్టు హాసిని సీనియర్ 66 కేజీలు 18 సంవత్సరాల కథ లో బంగారు పతకం మరియు కుమితే విభాగంలో వెండి పతకం సాధించింది. ఈ పథకాలు సాధించిన విద్యార్థిని జపాన్ సిటోరియు కరాటే జాతీయ ఉపాధ్యక్షులు పాలకుర్తి పాపయ్య, రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు గుంటుపల్లి సమ్మయ్య, కాయ్ రాష్ట్ర అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్, ప్రసన్న ఇన్స్ట్రక్టర్స్ నాగెల్లి రాకేష్, కావేటి శివ గణేష్ జడగల శివానిలు అభినందించారు.

# అంబేద్కర్ భవనంలో నిర్వహిస్తున్న అంగన్వాడి 2 ను తొలగించాలి

నేరేడుచర్ల: మండల పరిధిలోని పెంచికల్ దిన్నె గ్రామంలో గల అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రం 2 ను తక్షణమే తొలగించాలని అంగన్వాడీ టీచర్ మరి సైదమ్మకు వినతి పత్రాన్ని అందజేసిన నేరేడుచర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వూట్కూరి భార్గవ్ సైదులు.ఈ సందర్భంగా భార్గవ్ సైదులు మాట్లాడుతూ...గ్రామంలో అంగన్వాడి కేంద్రం రెండు కు అధికారిక భవనం లేనందున అంబేద్కర్ కమ్యూనిటీ హాలులోనే గత కొన్ని సంవత్సరాలుగా దాదాపు 16 నుండి 20 మంది చిన్నారులకు విద్యాభ్యాసాన్ని అందిస్తూ అదే భవనంలో కొనసాగుతున్నారని ఆయన అన్నారు.ఆ భవన నిర్మాణం అయి దాదాపు 30 సంవత్సరాలు అవుతుందని ప్రస్తుతం భవన స్లాపు పెచ్చులుగా రాలుతూ పిల్లలకు చాలా ప్రమాదకరంగా ఉందని తక్షణమే భవనాన్ని కాళీ చేసి మరో స్థానంలో అంగన్వాడి కేంద్రంను ఏర్పాటు చేసుకోగలరని ఆయన కోరారు.ఇట్టి భవనాన్ని నూతనంగా నిర్మించేందుకు నిధుల కోసం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో కలిసి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మరియు నీటిపారుదల శాఖ మాత్యులు కెప్టెన్ ఉత్తంకుమార్ రెడ్డికి తెలియజేసి మరల అదే స్థానంలో నూతనభవన ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన అన్నారు.

# ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో భారీ పేలుడు

**పేలుడు ధాటికి ఒకరు మృతి... ఏడుగురికి తీవ్ర గాయాలు**

యాదాద్రి భువనగిరి, జనవరి : యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట మండలంలో శనివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. పెద్దకందుకూరులో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో సంభవించిన పేలుడు ధాటికి ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుడిని బచ్చన్నపేట్ గ్రామానికి చెందిన ఎం కనకయ్యగా గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉన్న ప్రకాశ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మిగతా కార్మికులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ సైరన్‌తో పరిశ్రమ యాజమాన్యం కార్మికులను అప్రమత్తం చేసింది. దీంతో భయంతో కార్మికులు బయటకు పరుగులు తీశారు. బాధితుల కుటుంబాలు పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఆరువేల కోట్లు ఎక్కడ..

ముంబై, జనవరి ,: రూ.2,000 నోట్లను దేశీయ మార్కెట్లో వినియోగం నుంచి ఆర్బీఐ ఎప్పుడో తీసేసింది. అవును.. ఈ నోట్లు ఇప్పుడు వినియోగంలో లేవు. ఆగండి.. ఆగండి.. అంటే అప్పట్లో రూ.1000, రూ.500 నోట్ల రద్దులా పూర్తిగా పనికి రాకుండా పోలేదు. కేవలం వినియోగంలో లేవు అంతే. తేడా ఏంటి అంటారా.. ఏంటంటే.. ఈ నోట్ల విలువను ఆర్బీఐ రద్దు చేయలేదు. కేవలం.. మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంటోంది. అంటే.. బ్యాంకుల ద్వారా ఈ నోట్లను ఎవరికీ ఇవ్వరు.బ్యాంకుల దగ్గరకు వచ్చిన నోట్లన్నింటినీ సేకరించి.. ఆర్బీఐ దగ్గరకు పంపుతారు. అలా.. ఆర్బీఐ జారీ చేసిన రూ.2 వేల నోట్లన్నీ తిరిగి వచ్చేసిన తర్వాత.. వాటిని రద్దు చేసే అవకాశాలున్నాయి..పెద్ద నోట్ల రద్దు సమయంలో ప్రవేశపెట్టిన రూ.2,000 నోట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనకి తీసేసుకుంది. అప్పటి అవసరాలు మేరకు ఈ నోట్లను ముద్రించి వినియోగంలోకి తీసుకువచ్చిన ఆర్బీఐ? ఇప్పుడు వీటి అవసరం తీరడంతో వ్యవస్థ నుంచి తొలగిస్తోంది. ఇందులో భాగంగానే.. 2023 మే 19న రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దీంతో సామాన్య జనం నుంచి వ్యాపారుల వరకు.. వారి దగ్గరున్న రూ.2,000 నోట్లను బ్యాంకుల్లో మార్పిడి చేసుకున్నారు. కాగా తాజాగా ఆర్బీఐ కీలక ప్రకటన విడుదల చేసింది. దేశీయ విపణిలో ఉన్న మొత్తం రూ.2 నోట్లలో దాదాపు 98.12% తిరిగి వచ్చేసినట్లు తెలిపింది. ప్రజల వద్ద ఇంకా.. 6,991 కోట్ల విలువైన నోట్లు ఉన్నట్లు వెల్లడించింది. ఈ డబ్బులు సైతం తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి వస్తే.. రూ.2 వేల నోట్ల విలువను పూర్తిగా రద్దు చేయాలని భావిస్తోంది. కానీ.. రోజులు గడుస్తున్నా.. అవి మాత్రం తిరిగి రావడం లేదు.ఎప్పుడు వస్తుందని ఆర్మీ ఎదురుచూస్తుంది కానీ ఇప్పటివరకు అవి తిరిగి బ్యాంకులు చేరుకుపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆర్బీఐ కీలక మార్గదర్శకలను విడుదల చేసింది మీ వద్ద 2000 రూపాయల నోట్లు ఉంటే వాటిని ఏ విధంగా మార్చుకోవచ్చు తెలుపుతూ ప్రకటన విడుదల చేసింది.కాగా.. 2023 మే నెలలో రూ.2 వేల నోట్ల ఉపసంహరణ ప్రకటన చేసే నాటికి దేశీయ విపణిలో ఏకంగా రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు చలామణిలో ఉన్నాయని ఆర్బీఐ వెల్లడించింది. ఆ తర్వాత క్రమంగా వాటిని విపణి నుంచి తిరిగి ఉపసంహరించుకుంటూ వస్తున్న ఆర్బీఐ..మొదట్లో దేశంలోని అన్ని బ్యాంక్ శాఖల్లో వీటిని మార్చుకునేందుకు అవకాశం కల్పించింది. ఇప్పుడు మాత్రం..బ్యాంకులు వీడిని స్వీకరించేందుకు, మార్పిడి చేసేందుకు అనుమతి లేదు. దీంతో.. ప్రత్యామ్నాయంగా.. దేశంలోని 19 ప్రాంతీయ కార్యాలయాల్లోనే ఈ నోట్లను మార్పిడి చేసుకునేందుకు అవకాశం కల్పించారు.మీ దగ్గర ఇంకా రూ.2 వేల నోట్లు ఉంటే వాటిని మార్చుకునేందుకు ఆర్బీఐ సులభతర విధానాన్ని అమలు చేస్తుంది. ఇందులో భాగంగా ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో ఈ నోట్లను మార్పిడి చేసుకోవచ్చు. ఈ కార్యాలయాలు అహ్మదాబాద్, బెంగళూరు, బేలాపూర్, భోపాల్, భువనేశ్వర్, చండీఘర్, చెన్నై, గౌహతి, హైదరాబాద్, జైపూర్, జమ్మూ, కాన్పూర్, కోల్ కత్తా, లక్నో, ముంబై, నాగపూర్, న్యూఢిల్లీ, పాట్నా మరియు తిరువనంతపురంలోని కార్యాలయాల్లో నోట్లను డిపాజిట్ చేసుకోవచ్చు లేదా మార్పిడి చేసుకోవచ్చుమరో మార్గంలో సామాన్యులకు ఉపయోగపడేలా.. వారు పెద్ద నగరాల్లోని కార్యాలయాలకు వెళ్ళలేని పరిస్థితుల్లో తపాలా శాఖ ద్వారా రూ.2 వేల నోట్లను మార్చుకునే అవకాశం ఉంది. ఇందు కోసం ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్ఆర్ అనే రక్షణ కలిగిన కవర్ ని వినియోగించుకొని సురక్షితమైన మార్గంలో ఈ రూ.2 వేల నోట్లని మార్చుకోవచ్చని పోస్టల్ అధికారులు వెల్లడిస్తున్నారుఇందులో భాగంగా పోస్టల్ శాఖ జారీ చేసే ప్రత్యేక అప్లికేషన్ ను నోట్లు మార్చుకునేవారు పూర్తి చేయాల్సి ఉంటుంది ఇందులో వారి వ్యక్తిగత వివరాలతో పాటు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్ మొదటి పేజీ జిరాక్స్ ను జత చేసి పోస్ట్ ఆఫీసులో రూ.2 వేల నోట్లను డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలన్నిటినీ ఆర్బీఐ తనిఖీ చేసి వివరాలను సరిచూసుకుని రూ.2 వేల నోట్లను మార్పిడి చేసి.. ఆ సొమ్మును అప్లికేషన్ లో అందించిన బ్యాంక్ అకౌంట్ లోకి జమ చేస్తుంది. ఒక వ్యక్తి ఒకేసారి గరిష్టంగా రూ.2 లక్షలు ఈ విధానంలో నోట్ల మార్పిడి చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

(మొదటి పేజీ తరువాయి..)

## సంక్రాంతి రద్దీకి ప్రత్యేక రైళ్లు

మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకుంటుంది. అలాగే, జనవరి 12, 16 తేదీల్లో శ్రీకాకుళం రోడ్ నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు కాచిగూడ చేరుకోనుంది. ఈ రైలు మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగనుంది. ఈ రైలులో అన్నీ థర్డ్ ఏసీ కోచ్‌లే. చర్లపల్లి – శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు (07617) జనవరి 8న చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకోనుంది. అలాగే, శ్రీకాకుళం రోడ్– చర్లపల్లి (07618) రైలు.. జనవరి 9న మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళంలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు స్లీపర్, జనరల్ కోచ్‌లు ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ. శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగనుంది.

## కుప్పంలో సూర్య ఘర్' సోలార్ పైలట్ ప్రాజెక్టు

వాడుకోవచ్చు.. మిగతా 120 యూనిట్లను గ్రిడ్‌కు అనుసంధానం చేయొచ్చన్నారు. ఏడాదికి రూ.4వేల విలువైన కరెంట్ ఉచితంగా వినియోగించుకోవచ్చని, అదనంగా మరో రూ.5వేలు వరకు ఆదాయం వస్తుందని సీఎం వెల్లడించారు. ప్రజలు భవిష్యత్తులో కరెంట్ బిల్లు కట్టే భారం ఉండదన్నారు. ఈ సందర్భంగా 'స్వర్ణ కుప్పం విజన్–2029' డాక్యుమెంటరీని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘనంగా ఆవిష్కరించారు. కుప్పంలోని ద్రవిడ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్యుమెంటరీని సీఎం చంద్రబాబు విడుదల చేశారు. అంతకుముందు నడిమూరు గ్రామంలో సోలా సోలరైజేషన్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు, మంత్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'అసాధ్యం అన్న వాటిని సుసాధ్యం చేసి నిరూపించిన పార్టీ తెలుగుదేశం. విజన్–2020 తయారు చేసినప్పుడు చాలా మంది విమర్శించారు. ఒక డైరెక్షన్ లేకుండా జీవితాల్లో ఎవ్వరూ పైకి రాలేరు. ఏ వ్యక్తి అయినా సరే పద్ధతి ప్రకారం పని చేయగలిగితే జీవితంలో ఏదైనా సాధించే స్థితికి చేరుతారు. తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే ప్రజలకు శాపాలుగా మారుతాయి. సరైన నిర్ణయాలు తీసుకుంటే చరిత్ర మారిపోయే పరిస్థితి ఉంటుంది. మన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు దేశ ప్రధాని అయిన తర్వాత అనేక ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఈ సంస్కరణల వల్ల ఆయన దేశం దశదిశ మార్చారన్న విషయం మనందరం గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. మన్మోహన్ సింగ్ కూడా మంచి ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి మరవలేని వ్యక్తిగా నిలిచారు. ద్రవిడ యూనివర్సిటీ రావడానికి కారణం నందమూరి తారక రామారావు. బాగా కష్టపడితే 2030 నాటికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే భారత్ నెంబర్ వన్‌గా నిలుస్తుంది. అమెరికాలో అమెరికన్ల తలసరి ఆదాయం కంటే భారతీయులు, తెలుగు వారిదే ఎక్కువని చెప్పారు.

## కూటమిలో వేలుపెట్టే ప్రయత్నంలో జగన్

స్థాయి వరకూ మనమందరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఇటీవల తండ్రిని కోల్పోయిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మను ఆయన నివాసంలో నారా లోకేష్ పరామర్శించారు. అనంతరం కూటమిలోని పార్టీ శ్రేణులతో మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రతీ నెల నాలుగు వేల కోట్ల రూపాయిల లోటుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నడుస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తుందని చెప్పారు. గత సైకో పాలనలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడిందని విమర్శించారు. వంద సంవత్సరాల వెనక్కి పోయిందని ఆయన సోదాహరణగా వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ.. దేశాభివృద్ధి కోసం పాటుపడుతోన్నారని పేర్కొన్నారు. మీ సమస్యలు ఏమైనా ఉంటే తనకు చెప్పాలని ఆయన కూటమిలోని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే మీరు తనతో సమన్వయం చేసుకోండి.. లేకుంటే.. మీతో తానే సమన్వయం చేసుకుంటానని వారికి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అంతేకానీ విడాకులు లాంటివి మాత్రం ఉండవని కుండ బద్దలు కొట్టారు. గత ఎన్నికల్లో 94 శాతం సీట్లు ఎన్డీయే కూటమి సాధించిందని చెప్పారు. గత ఐదు సంవత్సరాలు రాష్ట్రాన్ని సైకో పాలించాడని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ రోజుకూ తెలుగుదేశం పార్టీ అన్ కండిషనల్‌గా కొనసాగుతొందన్నారు. అయితే మనం ఏమి అడిగినా కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తుందని వివరించారు. ఎక్కడైతే పవన్ అన్నపై దాడి చేశారో.. అక్కడే తనపై దాడి చేశారన్నారు. ఆ క్రమంలో నిలబడ్డాం కానీ.. భయపడలేదని ఆయన స్పష్టం చేశారు. ఎస్ఐ వచ్చి రాత్రికి రాత్రి 52 మందిని రాజమండ్రి జైలుకు పంపించాడన్నారు. 151 స్థానాలు గెలిచిన పార్టీకి 11 స్థానాలను మాత్రమే ప్రజలు ఇచ్చారంటే.. మనం ఒళ్ళు దగ్గర పెట్టుకుని పని చేయాల్సి ఉందని కూటమిలోని పార్టీల కేడర్‌కు సూచించారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఫించన్ అందిస్తుందని చెప్పారు. రాష్ట్రం కోసం.. దేశ కోసం.. మనం పని చేయాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి డెవలప్డ్ కంట్రీ గా నిలబడాలనేది ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కల అని మంత్రి నారా లోకేష్ గుర్తు చేశారు.

## అభివృద్ధి పనులకు సీతక్క శంకుస్థాపనలు

**ఆదిలాబాద్,జనవరి6 :**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి సోమవారం భూమిపూజ చేశారు. బల్దియాలో రూ.10 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో సీసీ, బీటీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరించారు. మావల మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా గృహ నిర్మాణానికి పూజ చేశారు. దుబ్బకూడా గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి పనులను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి శా, ఎస్పీ గౌష్ ఆలం, మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమెందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


# చైనా విజృంభణతో భారత్ అప్రమత్తం

**శ్వాసకోశ వ్యాధుల మాదిరే ఉంటుందని వెల్లడి**

**ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్న కేంద్ర ఆరోగ్య శాఖ**

**కోవిడ్ ప్రోటోకాల్ పాటించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ సూచన**





**న్యూఢిల్లీ/హైదరాబాద్,జనవరి6 :**
చైనాలో హ్యూమన్ మెటానిమోవైరస్ విజృంభిస్తోన్న వార్తలు వస్తోన్న నేపథ్యంలో.. భారత్‌లోనూ ఈ కేసులు వెలుగు చూడటం కలవరపాటుకు గురిచేస్తోంది. దీనిపై స్పష్టతనిచ్చిన కేంద్ర ఆరోగ్య శాఖ.. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా హెచ్ఎంపీవీ ఇప్పటికే వ్యాప్తిలో ఉందని తెలిపింది. మిగతా శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే ఉంటుందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. అయితే కోవిడ్ ప్రోటోకాల్‌ను పాటిస్తేమంచిదని సూచించింది. దేశంలో ఇన్‌ఫ్లుయెంజా మాదిరి వ్యాధులు లేదా తీవ్ర శ్వాసకోశ వ్యాధులు అసాధారణ రీతిలో ఏమీ లేవని కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. 'ఇతర శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే హెచ్ఎంపీవీ ఉంటుంది. సాధారణ జలుబు, ఫ్లూ మాదిరి లక్షణాలు కనిపిస్తాయి. చిన్నారుల్లో, వృద్ధుల్లో ఈ ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా కనిపిస్తుంది' అని కేంద్ర ఆరోగ్యసేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయల్ పేర్కొన్నారు. సీజనల్ శ్వాసకోశ సంబంధిత కేసులను ఎదుర్కొనేందుకు అవసరమైన వైద్య సామగ్రి, పడకలు, ఇతర వసతులతో భారత్‌లోని ఆసుపత్రులు సంసిద్ధంగా ఉన్నాయన్నారు. శీతాకాలంలో అవసరమైన జాగ్రత్తలు వహించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు జన్యు పరివర్తన జరిగిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొనడం మినహాయించి హెచ్ఎంపీవీ వైరస్ గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం లేదని ఐసీఎంఆర్ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ రామన్ గంగాఖేడ్కర్ ఓ మీడియా సంస్థతో చెప్పారు. ప్రస్తుత రకం వైరస్‌తో ఎటువంటి ఆందోళన అవసరం లేదన్నారు. హ్యూమన్ మెటానిమోవైరస్ అనేది ఇదివరకే తెలిసిన వైరస్. ప్రపంచవ్యాప్తంగా పిల్లల్లో సంభవించే శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లలో 12శాతం వరకు ఇదే కారణమవుతోందని అంచనా. రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ ని పోలి ఉండే ఈ వైరస్.. ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల మాదిరిగానే కనిపిస్తుంది. తక్కువ రోగనిరోధక శక్తి కలిగిన వాళ్లలోనే ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. కొన్ని సందర్భాల్లో మాత్రమే ఆసుపత్రిలో చికిత్స అవసరం అవుతుంది. సాధారణంగా 11ఏళ్ల చిన్నారుల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. తొలిసారిగా దీనిని 2001లో నెదర్లాండ్స్‌లో 28 మంది చిన్నారుల్లో గుర్తించారు. ఈ క్రమంలో దేశంలో అత్యున్నత మెడికల్ బాడీ అయిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ బాంబు పేల్చింది. హ్యూమన్ మెటాప్‌న్యూమోవైరస్ ఇప్పటికే భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా 'సర్క్యులేషన్'లో ఉందని హెచ్చరించింది. అయితే శ్వాసకోశ వ్యాధుల పెరుగుదలను ఎదుర్కొనేందుకు భారత్ సన్నద్ధంగా ఉందని తెలిపింది. దేశంలో మూడు హెచ్ఎంపీవీ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఐసీఎంఆర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా, భారత్‌తో సహా అనేక దేశాల్లో హెచ్ఎంపీవీతో సంబంధం ఉన్న శ్వాసకోశ వ్యాధుల కేసులు నమోదైనట్లు ఐసీఎంఆర్ తెలిపింది. ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడీఎస్పీ) నెట్‌వర్క్, ఐసీఎంఆర్ డేటా ప్రకారం ఇన్‌ఫ్లూఎంజా లేదా తీవ్రమైన శ్వాసకోశ అనారోగ్యంలో అసాధారణ కేసుల పెరుగుదల పరిస్థితి దేశంలో లేదని పేర్కొంది. ఈ వైరస్ వ్యాప్తి పరిస్థితిని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే హెచ్ఎంపీవీ వ్యాప్తి ట్రెండ్‌ను ఈ ఏడాది అంతా ఐసీఎంఆర్ ట్రాక్ చేస్తుందని వివరించింది. హెచ్ఎంపీవీ వైరస్ కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ పరిధిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రజలకు కీలక విజ్ఞప్తి చేసింది. 'నమస్కారం ముద్దు, హ్యాండ్‌షేక్ వద్దు' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. షేక్ హ్యాండ్స్ కారణంగా వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపింది. సీజనల్ వ్యాధులు తరుచుగా పిల్లలు, వృద్ధుల్లో అధికంగా వచ్చే అవకాశం ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రభు కుమార్ తెలిపారు. హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తి చెందితే శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కాబట్టి వీలైనంత వరకు ఈ వైరస్ నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వైరస్ సోకిన వారికి షేక్‌హ్యాండ్ ఇచ్చినా, తాకినా వైరస్ సోకవచ్చు. దగ్గు, తుమ్ముల నుంచి వచ్చే తుప్పిర్లు ద్వారా కూడా వైరస్ వ్యాపిస్తుందని తెలిపారు. ఈ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో చల్లని గాలులకు దూరంగా ఉండడంతో పాటు దూర ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిదని చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా మాస్కు ధరించాలి. తరుచుగా సబ్బు లేదా శానిటైజర్‌తో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. జన సమూహాలకు దూరంగా ఉండాలి.. భౌతిక దూరం తప్పనిసరిగా పాటించాలి. రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఆహారం తీసుకోవాలి. వీలైనంత వరకు ఇంట్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. జలువు, దగ్గు విపరీతంగా ఉంటే.. తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు.

# రెరా వ్యవహారాలన్నీ ఇక ఆన్‌లైన్‌లోనే

**రెరా పెండింగ్ దరఖాస్తులపై స్పెషల్ డ్రైవ్**

**అధికారుల తీరుపై మంత్రి నారాయణ ఆగ్రహం**



**విజయవాడ,జనవరి6 :**
ఆఫ్‌లైన్ కాకుండా ఇక ఆన్‌లైన్‌లోనే రెరా కార్యకలాపాలు వచ్చే నెల నుంచి అమలు చేసేలా చూస్తామని పురపాలకశాఖ మంత్రి నారాయణ ప్రకటించారు. రెరాలో ఆలస్యాలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తూ..రెరా అధికారుల తీరుపై మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టడంపై మంత్రి ఫైర్ అయ్యారు. ఏపీ రెరాలో పెండింగ్ దరఖాస్తులపై మంత్రి ఈరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రేరా అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెరాలో అనుమతుల కోసం నెలల తరబడి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి పలువురు బిల్డర్లు, డెవలపర్లు తీసుకొచ్చారు. ఎనిమిది నెలలుగా ఎందుకు దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే దరఖాస్తుదారులను వేధింపులకు గురి చేస్తునట్లు మంత్రికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని కొంతమంది అధికారుల తీరుపై మండిపడ్డారు. అంశాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై మంత్రి నారాయణ ఆరా తీశారు. రెరా అధికారులతో నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి ఏపీ రెరాకు సంబంధించి అనేక వినతులు వచ్చాయని.. 167 దరఖాస్తులు షార్ట్ ఫాల్స్ పంపారని తెలిపారు. పరిష్కారం కావడంలేదని కొన్ని ఫిర్యాదులు వచ్చాయన్నారు. మా సమాచారం అందుకుని 30 మంది క్లయింట్లు, ప్రతినిధులు వచ్చారు. అనేక అంశాల పై ఈరోజు వారితో చర్చించాం. ఇబ్బందులు పరిష్కారం కోసం కొన్ని సూచనలు చేశాం. ఇతర రాష్ట్రాల్లో అమలు చేసిన విధానాలను కూడా కొన్ని పరిశీలించాం. కమిటీ వేసి మరింత సరళతరంగా ఉండేలా చూస్తాం. అపార్ట్‌మెంట్, విల్లాలుకొనే వారు నష్టపోకుండా చూస్తాం. ప్రకటనలు చూసి కొనేవారు మోసపోకూడదనే రెరా తీసుకు వచ్చాం. అక్కడ ఉన్న సదుపాయాలు అగ్రిమెంట్ ప్రకారం ఉన్నాయా లేదా అనేది రెరా అథారిటీ పరిశీలిస్తుంది. నాలుగైదు అంశాలు మినహా అన్ని సమస్యలు పరిష్కరించాం' అని మంత్రి వెల్లడించారు. 2016 లో రెరా చట్టం అమల్లోకి వస్తే 2017 నుంచి నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు. 167 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఈనెలాఖరుకు పరిష్కరించాలని ఆదేశించామన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు పడ్డారని.. ఇప్పుడు వీటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. ఆఫ్ లైన్‌లో జరిగే విధానాన్ని ఆన్ లైన్‌లోకి తెస్తామన్నారు. టీడీఆర్ బాండ్‌లను తాత్కాలికంగా అన్ని చోట్లా ఆపామన్నారు. తణుకు అంశంపై విచారణ పూర్తి అయ్యాక సీఎం చంద్రబాబుతో చర్చిస్తామని తెలిపారు. శుక్రవారం , శనివారం మధ్యాహ్నం మున్సిపల్ కమిషనర్‌లతో మాట్లాడానని.. ఈరోజు సాయంత్రం కూడా కాన్ఫరెన్స్ పెట్టినట్లు చెప్పారు. 822 టీడీఆర్‌లు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈనెలాఖరులోపు వీటిని కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశఆరు. విశాఖలో అత్యధికంగా 184 టీడీఆర్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ బాగా అభివృద్ధి చెందాలని.. అనుమతుల విషయంలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని చెప్పారు. అన్ని రకాల నిబంధనలు పరిశీలించి సరళ తరం చేస్తామన్నారు. సెంట్రల్ యాక్ట్ ప్రకారం లిబరైజ్ చేస్తున్నామని వెల్లడించారు. బిల్డర్లు కూడా నిబంధనలు పాటించి నిర్మాణాలు చేయాలని కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. చాలా మంది బిల్డింగ్‌లు నిర్మించారని.. సెంట్రల్ యాక్ట్ ప్రకారం మార్పులను రెరా సూచనలు చేస్తుందన్నారు. బిల్డర్లకు పూర్తిగా చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేయాల్సిందే అని స్పష్టం చేశారు. డబ్బు పెండింగ్‌లో ఉన్నప్పటికీ కొంతమంది ఫిర్యాదు చేస్తున్నారన్నారు. కోర్టులో ఉన్న అంశాలు అక్కడ పరిష్కారం అయ్యాకే అనుమతి ఇస్తామని తెలిపారు. నూతననంగా విధి విధానాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ' రెరాపై ఫిర్యాదులు వచ్చాయనే నేను ఈరోజు పరిశీలించా. యాక్ట్‌లో లేని అంశాలు కొన్ని పెట్టినందున కొన్ని ఇబ్బందులు వచ్చాయి.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పెట్టుబడి సాయం

**వ్యవసాయ భూములకే సాయం.. మంచి నిర్ణయం**

**మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కితాబు**



**హైదరాబాద్,జనవరి6:**
ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పెట్టుబడి సహాయం పెంచడానికి ధైర్యం కావాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇవ్వడం మంచి నిర్ణయమని అన్నారు. రేవంత్ ప్రభుత్వ పనితీరుపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. తనకు ఫార్ములా రేసుల గురించి ఎలా తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అర్థమైందని తెలిపారు. ప్రభుత్వం ఆదాయం పెంచుకునే ప్రయత్నం చేయాలని అన్నారు. ఆర్థిక పరిస్థితి వల్ల చేయలేకపోతున్నామని ప్రజలకు వివరిస్తే అర్థం చేసుకుంటారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కూడా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చలేదని చెప్పారు. దళితులకు మూడు ఎకరాల భూమి విషయంలో బీఆర్ఎస్ చేతులు ఎత్తేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జైపాల్ రెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం అభినందనీయమని అన్నారు. జైపాల్ రెడ్డి పేరు పెట్టడానికి కొందరు వ్యతిరేకించడం సరైంది కాదని చెప్పారు. నూటికి నూరు శాతం ఇచ్చిన హామీలు నెరవేర్చిన ప్రభుత్వాలు ఇప్పటిదాక లేవు అని తెలిపారు. సేద్యయోగ్యమైన భూములకే పెట్టుబడి సహాయం ఇవ్వాలని తాను కూడా సూచించానని అన్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లకు, గుట్టలకు, రోడ్లకు రైతుబంధు తొలగించాలని ప్రభుత్వానికి సూచించామని అన్నారు. అసెంబ్లీకి రావడం రాకపోవడం కేసీఆర్ ఇష్టమన్నారు. తమపై అక్రమ కేసులు పెడుతున్నారని అంటున్న వాళ్లే ప్రభుత్వానికి గ్రిప్ రాలేదు అంటున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలపై కమిషన్లు వేసి ఆరు నెలలే అయింది. అప్పుడే రిజల్ట్ ఎలా వస్తుందని అన్నారు. ఏపీ ప్రభుత్వంపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. టీటీడీ దర్శనాలకు తెలంగాణ ప్రజాప్రతినిధుల లెటర్స్ అనుమతించినందుకు ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఒక ప్రభుత్వం ఆపిన పక్రియను కొత్త ప్రభుత్వం అనుమతివ్వడం అభినందనీయమని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.

## హీరో విశాల్ ఆరోగ్యంపై పుకార్లు

**వైరల్ ఫీవర్‌తో ఇబ్బందిపడుతున్నారన్న వైద్యులు**

చెన్నై,జనవరి6: హీరో విశాల్ ఆరోగ్యంపై ఆదివారం సాయంత్రం నుంచి పలు కథనాలు చక్కర్లు కొడుతోన్న విషయం తెలిసిందే. 'మదగజరాజ' ప్రెస్‌మీట్‌లో ఆయన వణుకుతూ కనిపించడం అభిమానులను ఆందోళనకు గురి చేసింది. ఆయనకు ఏమైంది? అని అందరూ మాట్లాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలియజేసేలా హెల్త్ రిపోర్ట్‌ను విశాల్ టీమ్ విడుదల చేసింది. ఆయన వైరల్ ఫీవర్‌తో ఇబ్బందిపడుతున్నారని.. వైద్యులు బెడ్ రెస్ట్ సూచించినట్లు రిపోర్ట్‌లో రాసి ఉంది. విశాల్ హీరోగా సుందర్.సి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మదగజరాజ'. అంజలి, వరలక్ష్మి శరత్‌కుమార్ కథానాయికలుగా నటించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఈసినిమా విడుదలవుతోంది. సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం సాయంత్రం చెన్నైలో ఈవెంట్ నిర్వహించారు. ఇందులో విశాల్, ఖుష్బూ, సుందర్.సితోపాటు చిత్ర సంగీత దర్శకుడు విజయ్ ఆంటోనీ పాల్గొన్నారు. సినిమా విశేషాలు పంచుకున్నారు. సినిమా గురించి విశాల్ మాట్లాడుతున్న సమయంలో ఆయన చేతులు వణుకుతూ కనిపించాయి. ఆయన ఒకింత నీరసంగా ఉన్నారు. అక్కడే ఉన్న యాంకర్ మాట్లాడుతూ.. విశాల్ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారని చెప్పింది. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. విశాల్‌కు ఏమైంది? అంటూ స్థానిక, ఆంగ్ల పత్రికల్లోనూ వార్తలు వచ్చాయి. దీనిపై అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. గెట్ వెల్ సూన్ అంటూ పలువురు పోస్టులు పెట్టారు.



# విశ్వాజ మత్తు వదిలిస్తున్నారు

## ఫేస్ మేకప్‌ను ఇలా సాధారణ చిట్కాలతో తొలగించుకోండి..



అమ్మాయిలకు మేకప్ అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అది లేకుండా ఇంట్లో నుంచి అసలు బయటకురారు. ముఖానికి అప్లై చేసే రిమూవల్‌లో కొంచెం తేడా వచ్చినా చర్మమే దెబ్బతింటుంది. అయితే, ఫేస్ మేకప్‌ను సాధారణ చిట్కాలతో ఎలా తొలగించుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం..

ఆడపిల్లలకు అందంగా రెడీ అవ్వడం అంటే మహా ఇష్టం. పెళ్లిళ్లతోపాటు ఇతర ఫంక్షన్లలో మేకప్ కంపల్సరీగా ఉండాల్సిందే. కొంతమంది మేకప్ లేకుండా బయట అడుగు కూడా వేయరు. అయితే, మేకప్ వేసే ముందు దాన్ని తొలగించడం గురించి కూడా తెలుసుకోవాలి. ముఖానికి మేకప్ ఎక్కువ సేపు ఉంచడం చర్మ ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిది కాదు. అలాంటి మేకప్‌ని తొలగించడం అనుకున్నంత సులభం కాదు. మేకప్‌ను సరైన మార్గంలో తొలగించడానికి ఈ కొన్ని చిట్కాలను అనుసరించండి.

క్లెన్సింగ్ ఆయిల్:
క్లెన్సింగ్ ఆయిల్‌తో ముఖంపై మేకప్‌ను శుభ్రం చేసుకోవచ్చు. క్లెన్సింగ్ ఆయిల్ మొండి మేకప్‌ను తొలగించడమే కాకుండా, రసాయనాలతో నిండిన మలినాలను తొలగించడంలోనూ సహాయపడుతుంది. ఇది చర్మానికి హాని కలిగించదు.

మేకప్ రిమూవర్:
మార్కెట్‌లో లభించే ఈ లిక్విడ్ మేకప్ రిమూవర్ తేమ కారణంగా మేకప్‌ను సులభంగా తొలగించగలదు. ఇది చర్మాన్ని తేమగా ఉంచుతుంది. అలాగే ఎటువంటి జిడ్డు లేకుండా ముఖాన్ని శుభ్రపరుస్తుంది.

మేకప్ రిమూవర్ వైప్స్:
మార్కెట్‌లో లభించే వైప్స్‌తో మేకప్ తొలగించుకోవచ్చు. ఈ మేకప్ రిమూవల్ వైపర్ చర్మంలోని మలినాలను తొలగిస్తుంది, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.

బాదం నూనె:
వంటగదిలో ఉండే ఈ వస్తువులు మేకప్‌ను తొలగించడానికి కూడా ఉపయోగపడతాయి. కాబట్టి ఇంట్లో జీడిపప్పు, బాదం నూనె ఉంటే మేకప్‌ను తొలగించుకోవచ్చు. దూదిని నూనెలో ముంచి ముఖంపై రుద్దితే మేకప్ తొలగించుకోవచ్చు.

కొబ్బరి నూనె:
స్వచ్ఛమైన కొబ్బరి నూనె చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మేకప్‌ను తొలగించడానికి కొబ్బరి నూనెను ఉపయోగించవచ్చు. ఇది చర్మం నుండి రసాయనాలను తొలగిస్తుంది.

ఇంటి యజమాని మద్యానికి బానిసైతే ఆ కుటుంబం అనుభవించే బాధ వర్ణనాతీతం.. అలాంటి నరకాన్ని ఎన్నో ఏళ్ళు అనుభవించారు చెన్నైకి చెందిన భాను సురేషబాబు. కష్టనష్టాలు భరించి, ఓర్పుతో, నేర్పుతో తన భర్తను మార్చుకున్నారు. తన దుస్థితి మరే మహిళా అనుభవించకూడదనే ఆలోచనతో... డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి... వందలాదిమందికి కొత్త జీవితాన్ని దిస్తున్నారు. స్ఫూర్తిమంతమైన భాను జీవన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...



"మావారు స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసేవారు. చీఫ్ మేనేజర్‌గా రిటైరయ్యారు. అయితే మా పెళ్లయిన కొత్తలో ఆయన రేయింబవళ్లు తాగేవారు. ఆయనవల్ల నాతో పాటు మొత్తం మా ఉమ్మడి కుటుంబంలోని 20 మంది సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. సరిగ్గా ఆఫీసుకు వెళ్లేవారు కాదు. దాంతో ఉద్యోగం నుంచి తీసేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నేను వారిని కాళ్లా వేళ్లా పడి బతిమాలితే వదిలేశారు. అలా 1985–94 మధ్య నరకం అనుభవించాను. ఆయనను ఎలాగైనా బాగు చేసుకుందామని ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఎన్నో ఆలయాలకు వెళ్లాను. వ్రతాలు చేశాను. కొంతమంది మాటలతో మతం మార్చుకొనేందుకూ సిద్ధమయ్యాను. అవేవీ ఫలించలేదు.

జీవితం మీద విరక్తి కలిగేది...



చివరకు తిరువాన్మియూరు టీటీకే హాస్పిటల్లో ఒక డి-అడిక్షన్ చికిత్సా కేంద్రం ఉందని తెలిసి, మావారిని చేర్పించాను.. అక్కడ మద్యం బానిసలతో పాటు వారి కుటుంబీకుల్లో ఒకరు తోడు ఉండాలి. దాంతో మావారి వెంట నేనే వున్నాను. అప్పట్లో చెన్నై మొత్తం మీద అలాంటి కేంద్రం అదొక్కటే ఉండేది. ట్రీట్‌మెంట్ తరువాత ఒక నెల బావుండేవారు. తరువాత మళ్లీ పాత పద్ధతే. దాంతో నాకు జీవితం మీద విరక్తి కలిగేది. ఆ కేంద్రంలో చికిత్స పొందుతున్నవారి కుటుంబ సభ్యులకు కూడా సైకో థెరపీ, కౌన్సెలింగ్ ఇచ్చేవారు. దాంతో నాకు కూడా మద్యపాన సమస్య మీద ఎంతో అవగాహన వచ్చింది. చివరికి... సుమారు పదేళ్ల తరువాత మావారిలో మార్పు వచ్చింది. పూర్తిగా మద్యం మానేశారు. అప్పుడు నేను ఆలోచనలో పడ్డాను. ఒక వ్యక్తి చేత మద్యం మానిపించడానికి నేను ఇంత కష్టపడ్డాను. ఇదే సమస్య ఎదుర్కొంటున్న మిగిలిన మహిళల సంగతేమిటి? అందరూ ఇంతగా పోరాడాల్సిందేనా? ఒక వ్యక్తి మద్యపానంలో కూరుకుపోతే, ఆ కుటుంబం మొత్తం నష్టపోవాలా? దేవుడు నాకు చూపించిన మంచిని నలుగురికి పంచాలనుకున్నాను. అదే కేంద్రానికి వెళ్లి బాధితులకు స్వచ్ఛందంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించాను. అవగాహన కల్పించాను. ఆ సెంటర్లో ఒక పెద్దాయన దీనికి సంబంధించి కోర్సు చేస్తే అధికారికంగా కౌన్సెలింగ్ ఇవ్వవచ్చని సూచించారు. అప్పటికే నేను బీఏ హిస్టరీ చేశాను. అప్పటికి నా వయసు 33 ఏళ్లు.. ఎంఏలో చేరే అవకాశం ఉన్నా... కావాలనే బీఏ సైకాలజీలో చేరాను. తరువాత ఎంఏ సైకాలజీ, ఎంఫిల్ చేశాను. డి-అడిక్షన్ సెంటర్‌లో పని చేయడానికి అవసరమైన శిక్షణ పొందాను. అనేక కోర్సులు చేశాను. ఆ తరువాత టీటీకే సెంటర్ వారు ఫ్యామిలీ థెరపిస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సెలర్‌గా అవకాశం ఇచ్చారు. అక్కడ ఏడేళ్ల పాటు పని చేశాను. ఆ తరువాత చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 'కెపాక్స్' అనే కేంద్రంలో చేరాను. అక్కడి నుంచి 15 సంవత్సరాల పాటు వివిధ కేంద్రాల్లో పని చేశాను.

పరిమితులు లేని సేవకోసం...

డి-అడిక్షన్, మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనం తదితర అంశాలపై పని చేశాను. అక్కడ నాకు పరిమితులు ఉండేవి. వాటిని అధిగమించి సేవ చేయడానికి సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థను, దానికి అనుబంధంగా డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని దృఢంగా అనుకున్నాను. ఆ కేంద్ర భవనంలో వార్డులు, ఓపెన్ ఏరియా, థెరపీ సెంటర్, కిచెన్, థియేటర్ హాల్ లాంటివన్నీ ఉండేలా ప్రణాళిక వేసుకున్నాను. దాని గురించి మా వారికి చెబితే "ఇవన్నీ కావాలంటే కొన్ని కోట్లు కావాలి. మనకంత శక్తి ఎక్కడిది?" అన్నారు.. దాంతో మా ఆర్థిక స్థోమత మేరకు పరిమితంగానే పని ప్రారంభించాను. 2005లో 'కన్సర్న్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. అనంతరం డబుల్-బెడ్‌రూమ్ ఇంటిని అద్దెకు తీసుకొని, అయిదు పడకలతో డి-అడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించాం. ఇప్పుడు మాడంబాక్కంలో ఇది నడుస్తోంది. ఈ కేంద్రానికి వచ్చిన వారికి అన్నీ బోధపడేలా చెప్పి, వ్యసనం మాన్పించడానికి ప్రయత్నిస్తాం. ఇప్పుడు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖతో కలిసి పని చేస్తున్నాం. మా 'కన్సర్న్'లో ఆహారం, చికిత్స, కౌన్సిలింగ్, మందులు తదితరాలన్నీ ఉచితమే. ఇప్పటి వరకూ 2 వేల మందికి చికిత్స అందించాం.

కుటుంబ మద్దతు అవసరం

మద్యపాన బానిసలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. చాలామంది "ఏం చేసినా ఆయన మారరు" అంటూ ఉంటారు. అది తప్పు. అలా అనుకుంటే మా వారు మారేవారా? ఇంతమంది జీవితాలను మేం ప్రభావితం చేయగలిగేవారమా?. కాబట్టి నిరంతరం ప్రయత్నం చేయాల్సిందే. మద్యానికి అలవాటుపడిన వారిని అలాగే వదిలేయకండి. మానసికంగా వారికి దగ్గరవ్వండి, వారి బాగోగులు చూసుకునేందుకు మీరున్నారన్న నమ్మకం కలిగించండి. వారిని ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువచ్చి చికిత్స చేయించండి. చికిత్స పొందిన తరువాత కూడా ఏడాదిపాటు కుటుంబ సభ్యులు వారిని గమనిస్తూ, అదుపులో ఉంచాలి. ఏడాదిపాటు మద్యం జోలికి పోలేదంటే, ఇక జీవితంలో అటువైపు వెళ్లరు.

ఆ సంతృప్తి మాటల్లో చెప్పలేను...

మాకు ఒకే అబ్బాయి. అతను ఆర్కిటెక్ట్. జీవితంలో స్థిరపడ్డాడు. మాకు ఎలాంటి బరువు బాధ్యతలు లేవు. అందుకే నాలాంటి బాధితుల్ని గట్టెక్కించాలన్న ఉద్దేశంతో ఈ సేవను ఎంచుకున్నాను. మా వారు రిటైరయ్యాక ఆయన కూడా నాకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. మా దగ్గర చికిత్స పొందిన వారి కుటుంబ సభ్యులు సంతోషంగా మా దగ్గరకు వచ్చినప్పుడు మాకు కలిగే సంతృప్తిని మాటల్లో చెప్పలేను."

# వ్యాపారం

## ఈ లావాదేవీలకు ఆదాయపు పన్ను శాఖ నోటీసు పంపుతుందా?

ఒక వ్యక్తి ఆస్తిని కొనుగోలు చేసేటప్పుడు రూ.30 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేస్తే, దానికి సంబంధించిన సమాచారం రిజిస్ట్రేషన్ శాఖ నుండి ఆదాయపు పన్ను శాఖకు పంపబడుతుంది. దాని ఆధారంగా, ఆదాయపు పన్ను శాఖ మీ డబ్బు క్యాపిటలైజేషన్‌ను వివరించమని కోరుతూ మీకు నోటీసు జారీ..

భారతదేశంలో డిజిటల్ లావాదేవీలు విపరీతంగా పెరుగుతున్నందున చాలా మంది ప్రజలు బ్యాంకుల ద్వారా డబ్బు లావాదేవీలు జరుపుతున్నారు. బ్యాంకుల ద్వారా లేదా ఆన్‌లైన్ సేవల ద్వారా ఏదైనా డబ్బు లావాదేవీలు చిన్న మొత్తాలకు ఎటువంటి సమస్యలను కలిగించవు. కానీ, పెద్ద మొత్తాల్లో లావాదేవీలు చేయడం వల్ల కొన్ని సమస్యలు ఎదురవుతాయి. అంటే పెద్ద మొత్తాలను పెట్టుబడి పెట్టడం ఆదాయపు పన్ను శాఖ నుండి నోటీసు రావచ్చు. అందుకు సంబంధించిన వివరాలు చెప్పాల్సి ఉంటుంది. ఏ మొత్తంలో లావాదేవీలు సురక్షితంగా ఉంటాయి? ఏ మొత్తాన్ని ఆదాయపు పన్ను శాఖకు నివేదించాలి అనే వివరాలను చూద్దాం.

ఈ మొత్తానికి మించిన లావాదేవీలకు నోటీసులు రావచ్చు:
బ్యాంకు ఆన్‌లైన్ సేవలు, బ్యాంకింగ్ సేవలను ఉపయోగించి పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిగినప్పుడు ఆదాయపు పన్ను శాఖ నోటీసు పంపుతుంది. అందుకు సంబంధించి వివరాలను కోరుతుంది. ప్రతి రకమైన లావాదేవీకి ఈ పరిమితి మారుతూ ఉంటుంది.

బ్యాంక్ ఖాతా డిపాజిట్:
సాధారణంగా ప్రజలు తాము సంపాదించిన డబ్బును బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేస్తారు. ఆ విధంగా ఒక్కో ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షల వరకు మాత్రమే డిపాజిట్ చేయాలని చెబుతున్నారు. మీరు రూ.10 లక్షల కంటే ఎక్కువ పెట్టుబడి పెడితే, ఆదాయపు పన్ను శాఖ వివరణ కోరుతుంది. నెలకు లక్ష కంటే ఎక్కువ డిపాజిట్ చేస్తూ ఆర్థిక సంవత్సరంలో లిమిట్ దాటినా ఆదాయపు పన్ను శాఖ వివరణ కోరవచ్చు.

ఫిక్స్‌డ్ డిపాజిట్ ఫండ్ పెట్టుబడి:
ఫిక్స్‌డ్ డిపాజిట్ ఫండ్ స్కీమ్‌లో దాదాపు రూ. 3 కోట్ల వరకు పెట్టుబడి పెట్టడానికి ఒకరికి అనుమతి ఉంది. మీరు ఆర్థిక సంవత్సరంలో రూ. 10 లక్షల కంటే ఎక్కువ ఎఫ్‌డిలో ఇన్వెస్ట్ చేస్తే, ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ క్యాపిటలైజేషన్ వివరణ కోరుతూ మీకు నోటీసు పంపుతుంది.


క్రెడిట్ కార్డ్ చెల్లింపు:
మీరు ఏకమొత్తంలో లక్ష రూపాయల కంటే ఎక్కువ క్రెడిట్ కార్డ్ బిల్లును చెల్లిస్తుంటే ఆ మొత్తం క్యాపిటలైజేషన్‌ను వివరించాలని ఆదాయపు పన్ను శాఖ మీకు నోటీసు పంపుతుంది.

పెద్ద ఆస్తి లావాదేవీ
ఒక వ్యక్తి ఆస్తిని కొనుగోలు చేసేటప్పుడు రూ.30 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేస్తే, దానికి సంబంధించిన సమాచారం రిజిస్ట్రేషన్ శాఖ నుండి ఆదాయపు పన్ను శాఖకు పంపబడుతుంది. దాని ఆధారంగా, ఆదాయపు పన్ను శాఖ మీ డబ్బు క్యాపిటలైజేషన్‌ను వివరించమని కోరుతూ మీకు నోటీసు జారీ చేస్తుందని గమనించడం ముఖ్యం.

## చైనా వైరస్‌తో కుప్పకూలిన స్టాక్ మార్కెట్.. రూ.10 లక్షల కోట్లు నష్టపోయిన ఇన్వెస్టర్లు

పీఎస్‌యూ బ్యాంకులు, రియల్ ఎస్టేట్ స్టాక్స్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో భారీ క్షీణత కనిపిస్తోంది. బ్యాంక్ ఆఫ్ బరోడా, పీఎన్‌బీ, కెనరా బ్యాంక్‌లు 4 శాతానికి పైగా క్షీణించాయి. దిగ్గజాలు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్), కోటక్ మహీంద్రా బ్యాంక్‌లలో కూడా పెద్ద క్షీణత ఉంది. ఈ HMPV వైరస్ కారణంగా స్టాక్ చైనాలో కొత్త వైరస్ వ్యాప్తి భయాందోళనకు గురి చేస్తోంది. తాజాగా చైనాలో HMPV వైరస్ వ్యాప్తి నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ భారత్‌కు వ్యాప్తించడంతో ఆందోళన మొదలైంది. బెంగళూరులో ఇద్దరికి ఈ వైరస్ సోకినట్లు నిర్ధారించారు. ఈ వైరస్ కారణంగా స్టాక్ మార్కెట్‌లో కలకలం రేగింది. సెన్సెక్స్ 1,100 పాయింట్లకు పైగా పడిపోగా, నిఫ్టీ దాదాపు 1.4 శాతం పడిపోయింది. ఈ పతనం కారణంగా స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు రూ.10 లక్షల కోట్లకు పైగా నష్టపోయారు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో భారీగా అమ్మకాలు జరుగుతున్నాయి.

పీఎస్‌యూ బ్యాంకులు, రియల్ ఎస్టేట్ స్టాక్స్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో భారీ క్షీణత కనిపిస్తోంది. బ్యాంక్ ఆఫ్ బరోడా, పీఎన్‌బీ, కెనరా బ్యాంక్‌లు 4 శాతానికి పైగా క్షీణించాయి. దిగ్గజాలు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్), కోటక్ మహీంద్రా బ్యాంక్‌లలో కూడా పెద్ద క్షీణత ఉంది. ఈ HMPV వైరస్ కారణంగా స్టాక్ మార్కెట్‌లో ఎలాంటి క్షీణత కనిపిస్తుందో కూడా చూద్దాం..



చైనాలో వ్యాప్తి చెందిన ఈ వైరస్ ఇప్పుడు భారత్‌కు చేరడంతో ఆందోళల నెలకొంది. దీంతో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. కర్ణాటకలోని బెంగళూరు నగరంలో రెండు కేసులు నిర్ధారించిన తర్వాత, స్టాక్ మార్కెట్‌లో పెద్ద పతనం కనిపిస్తోంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,100 పాయింట్ల మేర క్షీణించింది. దీంతో సూచీ 77,959.95 పాయింట్లకు పడిపోయింది. కాగా ఈ ఉదయం స్వల్ప పెరుగుదలతో 79,281.65 పాయింట్ల వద్ద ప్రారంభమైంది.

భారత స్టాక్ మార్కెట్ పతనానికి అనేక కారణాలున్నాయి. విదేశీ పెట్టుబడిదారులు విక్రయించడం నుండి ముడి చమురు ధరల పెరుగుదల వరకు అన్నీ ఇందులో ఉన్నాయి. నివేదికలు ప్రకారం.. చైనా HMPV వైరస్ ప్రభావం సోమవారం మార్కెట్‌లో క్షీణత రూపంలో కనిపించింది. బెంగళూరులోని ఒక ఆసుపత్రిలో రెండు చైనీస్ HMPV వైరస్ కేసులను గుర్తించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ICMR) ధృవీకరించిన తర్వాత, పెట్టుబడిదారులు భయాందోళనలకు గురయ్యారు. దీంతో వైరస్ స్టాక్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడింది.

## తగ్గిన బంగారం ధర.. హైదరాబాద్‌లో తులం ఎంతంటే..?

దేశ వ్యాప్తంగా బంగారం, వెండి ధరలు నిత్యం మారుతుంటాయి. కొన్నిరోజులు తగ్గితే, మరికొన్ని రోజులు పెరుగుతూ ఉంటాయి. బులియన్ మార్కెట్‌లో వీటికి ఫుల్ డిమాండ్ ఉంటుంది.. అంతర్జాతీయ మార్పులతో ఈ మార్పులు చోటు చేసుకుంటుంటాయి. తాజాగా దేశంలో బంగారం, వెండి ధలు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దాం..

బంగారం, వెండికి బులియన్ మార్కెట్‌లో ఎల్లప్పుడూ డిమాండే ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతర్జాతీయ పరిణామాలతో.. బంగారం, వెండి ధరల్లో ప్రతిరోజూ మార్పులు జరుగుతుంటాయి. ఓసారి తగ్గితే, మరోసారి పెరుగుతూ ఉంటాయి. తాజాగా బంగారం ధర తగ్గగా.. వెండి ధర కూడా తగ్గింది. సోమవారం (06 జనవరి 2025) ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.72,140, 24 క్యారెట్ల పసిడి ధర రూ.78,700 గా ఉంది. వెండి కిలో ధర రూ.91,400 లుగా ఉంది.

దేశంలోని ప్రధాన నగరాల్లో గోల్డ్, సిల్వర్ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం..

బంగారం ధరలు..
హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.72,140, 24 క్యారెట్ల ధర రూ.78,700 గా ఉంది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.72,140, 24 క్యారెట్ల ధర రూ.78,700 గా ఉంది.
ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.72,290, 24 క్యారెట్ల ధర రూ.78,850 గా ఉంది.
ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.72,140, 24 క్యారెట్ల ధర రూ.78,700 గా ఉంది.
చెన్నైలో 22 క్యారెట్ల రేట్ రూ.72,140, 24 క్యారెట్ల ధర రూ.78,700 గా ఉంది.
బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.72,140, 24 క్యారెట్ల ధర రూ.78,700 గా ఉంది.

వెండి ధరలు..
హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.98,900 విజయవాడ, విశాఖపట్నంలో రూ.98,900లుగా ఉంది.
ఢిల్లీలో వెండి కిలో ధర రూ.91,400, ముంబైలో రూ.91,400, బెంగళూరులో రూ.91,400, చెన్నైలో రూ.98,900 లుగా ఉంది.

# మెటాన్యూమోవైరస్ పై కేంద్రం కీలక ప్రకటన


**దీంతో భయపడాల్సిన పనిలేదన్న మంత్రి నడ్డా**



**న్యూఢిల్లీ,జనవరి6 :**
మెటాన్యూమోవైరస్ పై కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఈ వైరస్ గురించి ఎవరూ ఆందోళనపడొద్దని, ఇది కొత్త వైరస్ కాదని, దేశ ప్రజలు ప్రశాంతంగా ఉండాలని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా అన్నారు. 2001లో తొలిసారి గుర్తించిన ఈ వైరస్ ప్రపంచ వ్యాప్తంగా చాలా ఏళ్లుగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం పరిస్థితిని చురుగ్గా పర్యవేక్షిస్తోందని, ప్రజారోగ్యాన్ని కాపాడటానికి అవసరమైన చర్యలను అమలు చేస్తుందని ప్రజలకు హామీ ఇస్తూ నడ్డా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇది కొత్త వైరస్ కాదని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేశారు. ఇది 2001లో మొదటిసారిగా గుర్తించబడింది, ఇది చాలా సంవత్సరాల నుండి ప్రపంచం మొత్తం వ్యాపిస్తోంది. గాలి ద్వారా, శ్వాస ద్వారా వ్యాపిస్తుంది. ఇది అన్ని వయసుల వ్యక్తులను ప్రభావితం చేస్తుంది. శీతాకాలం, వసంత ఋతువులో ఈ వైరస్ ఎక్కువగా వ్యాపిస్తుంది' అని జేపీ నడ్డా చెప్పారు. కర్ణాటక, గుజరాత్‌లకు చెందిన ముగ్గురు పిల్లలకు ఊఓఖ పాజిటివ్ అని తేలిన తర్వాత జేపీ నడ్డా నుంచి ఈ ప్రకటన వచ్చింది. భారత ఆరోగ్య సంస్థలు పరిస్థితిని చురుకుగా పర్యవేక్షిస్తున్నాయని నడ్డా చెప్పారు. ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ , నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ చైనా ఇతర దేశాల పరిణామాలను నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు. దేశంలో శ్వాసకోశ వైరల్ ఇన్ఫెక్షన్ల గణనీయమైన పెరుగుదల లేని కేంద్రమంత్రి చెప్పారు.

## మోహన్‌బాబు ముందస్తు బెయిల్ కేసు


**గురువారానికి వాయిదా వేసిన ధర్మాసనం**



**న్యూఢిల్లీ,జనవరి6 :**
జర్నలిస్టుపై దాడి కేసులో సినీ నటుడు మోహన్ బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణను అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వాయిదా వేసింది. సోమవారం మోహన్ బాబు బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ సుధాంశు దులియా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ అందుబాటులో లేకపోవడంతో మోహన్ బాబు తరఫు న్యాయవాది ధర్మాసనాన్ని పాస్ ఓవర్ కోరారు. అయితే ఇందుకు న్యాయమూర్తులు అంగీకరించ లేదు. దీంతో కేసు విచారణను గురువారానికి వాయిదా వేశారు. కొద్దిసేపటి తర్వాత సుప్రీంకోర్టు వద్దకు ముకుల్ రోహత్గీ చేరుకున్నారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ససేమిరా అన్న ధర్మాసనం.. గురువారానికి కేసు విచారణను వాయిదా వేసినట్లు తెలిపింది. గత సంవత్సరాంతంలో మంచు మోహన్ బాబు ఫ్యామిలీలో వివాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించింది. ఆస్తి పంపకాల్లో తేడాలు రావడంతో మంచు మనోజ్, మోహన్ బాబు మధ్య వివాదం చెలరేగింది. ఈ వివాదంలో మోహన్ బాబు, విష్ణు ఒక సైడ్ ఉండగా.. మనోజ్ మాత్రం మరో సైడ్ అయిపోయారు. ఈ నేపథ్యంలో విష్ణు, మనోజ్ మధ్య తీవ్ర గొడవలు చోటు చేసుకున్నాయి. ఇద్దరూ పెద్దఎత్తున బౌన్సర్ల పెట్టి మరీ ఘర్షణకు దిగారు. అయితే డిసెంబర్ 10వ తేదీన హైదరాబాద్ జల్‌పల్లిలోని తన నివాసంలోకి మనోజ్‌ను రానీయకుండా మోహన్ బాబు ఆపేశారు. అదే ఇంట్లో తన కుమార్తె ఉండడంతో మనోజ్ పెద్దఎత్తున తన అనుచరులు, జర్నలిస్టులతో ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నించారు. గేట్లు బద్దలు కొట్టి మరీ లోపలికి వెళ్లారు. గేట్లు బద్దలు కొట్టుకుని మనోజ్ ప్రవేశించడంతో మోహన్ బాబు ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఇదే సమయంలో ఓ టీవీ ఛానల్‌కు చెందిన జర్నలిస్టు ఆయన్ను ప్రశ్నించేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన మోహన్ బాబు.. రిపోర్టర్ వద్ద ఉన్న మైక్ లాక్కొని అతడిపైనే దాడి చేశారు. దీంతో జర్నలిస్టు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. ఘటనపై బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అయితే పోలీసులు తనను అరెస్టు చేయకుండా ఆదే చాలంటూ తెలంగాణ హైకోర్టును మోహన్ బాబు ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం అతని పిటిషన్‌ను కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును మోహన్ బాబు ఆశ్రయించారు. కాగా, ఇవాళ జరగాల్సిన విచారణను అత్యున్నత న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది.

## 27లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

**మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**



**అమరావతి,జనవరి6 :**
ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆదివారం నాటికి 27లక్షల మెట్రిక్ టన్నులు సేకరించామని చెప్పారు. ధాన్యం సేకరణపై మంత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. '4,15,066 మంది రైతుల నుంచి ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరించాం. వైకాపా హయాంలో కేవలం 2 లక్షల మంది రైతుల నుంచే ధాన్యం కొన్నారు. ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నాం. రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.6,083.69 కోట్లు జమ చేశాం. వైకాపా హయాంలో ధాన్యం డబ్బులు కూడా సక్రమంగా ఇవ్వలేదు. రైతుల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం సంక్రాంతి సందడి తెచ్చింది'అని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# బటన్ నొక్కుడెప్పుడు

## వివిధ వర్గాల నుంచి ప్రశ్నలు



**విజయవాడ, జనవరి 6, :**
గత ప్రభుత్వంలో అలవాటయిన బటన్ నొక్కే కార్యక్రమం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత లేదు. 2019 నుంచి 2024 వరకూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ చంద్రబాబు ప్రాధాన్యతలు వేరు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందచేయాలనుకుంటున్నారు తప్పించి నేరుగా డబ్బులు వారి ఖాతాల్లో నగదు జమ చేసేందుకు పెద్దగా సుముఖత చూపరు. అందుకే గత ఏడు నెలల నుంచి బటన్ నొక్కడం అనేది లేదు. జనాల ఖాతాల్లో కూడా నగదు కనపడటం లేదు. కేవలం పింఛనుదారులకు మినహా ఇప్పటి వరకూ ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం అందించింది లేదనే చెప్పాలి. అందుకు రాష్ట్ర ఖజానా కూడా ఒక కారణమని అధికార పార్టీ చెబుతుందిగత ప్రభుత్వంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ దాదాపు నెలలో ఒకటి రెండు సార్లు ఎవరో ఒకరికి బటన్ నొక్కి నగదును నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేవారు. వారికి ఆర్థికంగా ఇవి ఉపయోగపడేవి. అమ్మఒడి, వసతి దీవెన, చిరు వ్యాపారులు, చేనేతలు, మత్స్యకారులు ఇలా అన్ని సామాజికవర్గాల వారికి కూడా క్యాలెండర్ ను రూపొందించుకుని మరీ నగదును జమ చేసేవారు. తమకు ఈ డబ్బులు గ్యారంటీగా వస్తాయని భావించేవారు. సంక్రాంతి పండగను హుషారుగా ఆనందంగా జరుపుకునే వారు. కానీ గడిచిన ఏడు నెలల నుంచి రూపాయి కూడా బ్యాంకు అకౌంట్ లో పడకపోవడంతో ఒకింత అసంతృప్తితో ఉన్నారన్నది వాస్తవం. బ్యాంకు ఖాతాల్లో నగదు లేక ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు... గత ప్రభుత్వం అప్పులు చేసి వెళ్లిందని, ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని అధికార పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ దానిని ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే తమకు అవన్నీ అనవసరం. తమకు అవసరమైనది నగదు. అది అందనప్పుడు అభివృద్ధి, సంక్షేమం అంటూ ప్రకటనలు తమకు కూడు బెడతాయా? ని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతలు వేరుగా ఉండటంతోనే ప్రజలకు తొలి రెండు నెలల్లోనే అర్థమయింది. చంద్రబాబు అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రయారిటీ ఇస్తారు. ఆ రెండు దీర్ఘకాలంలో సంపదను సృష్టిస్తాయని ఆయన బలంగా నమ్ముతున్నారు. అప్పుడు ఆర్థికంగా పేదలు బలపడతారని భావిస్తున్నారు. కానీ జనం మాత్రం అలా అనుకోవడం లేదు. తమకు ఎలాంటి నగదు ఇవ్వకపోవడమేంటని కొందరు ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను నిలదీసే పరిస్థితికి గ్రామాల్లో వచ్చిందని అంటున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఒక ఎమ్మెల్యే అయితే గ్రామస్తులకు నచ్చచెప్పలేక వెనుదిరిగారు. ప్రభుత్వం పాలసీ ప్రకారం వెళుతుంది. రహదారులు బాగాలేకున్నా, రాష్ట్రానికి రాజధానికి లేకున్నా వారికి ఫరక్ పడదు. తమకు అలవాటుగా మారిన నగదు బ్యాంకు ఖాతాల్లో కనిపించకపోయే సరికి ఆ ఫ్రస్టేషన్ ను ప్రజా ప్రతినిధులపై చూపిస్తున్నారంటున్నారు. అయితే ఏడు నెలలే అయినందున ప్రభుత్వం తన ప్రాధాన్యతలను అమలు చేస్తుందని, గతంలో జగన్ కూడా అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలల తర్వాతనే పథకాలు అమలు చేశారని, తాము కూడా అంతేనని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. మొత్తం మీద కూటమి పార్టీ పాలనపై మాత్రం తమకు నగదు బదిలీ చేయడం లేదన్న అసంతృప్తి మాత్రం గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తుందంటున్నారు,గత ప్రభుత్వంలో అలవాటయిన బటన్ నొక్కే కార్యక్రమం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత లేదు. 2019 నుంచి 2024 వరకూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ చంద్రబాబు ప్రాధాన్యతలు వేరు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందచేయాలనుకుంటున్నారు తప్పించి నేరుగా డబ్బులు వారి ఖాతాల్లో నగదు జమ చేసేందుకు పెద్దగా సుముఖత చూపరు. అందుకే గత ఏడు నెలల నుంచి బటన్ నొక్కడం అనేది లేదు. జనాల ఖాతాల్లో కూడా నగదు కనపడటం లేదు. కేవలం పింఛనుదారులకు మినహా ఇప్పటి వరకూ ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం అందించింది లేదనే చెప్పాలి. అందుకు రాష్ట్ర ఖజానా కూడా ఒక కారణమని అధికార పార్టీ చెబుతుంది. గతంలో అలవాటయి... గత ప్రభుత్వంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ దాదాపు నెలలో ఒకటి రెండు సార్లు ఎవరో ఒకరికి బటన్ నొక్కి నగదును నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేవారు. వారికి ఆర్థికంగా ఇవి ఉపయోగపడేవి. అమ్మఒడి, వసతి దీవెన, చిరు వ్యాపారులు, చేనేతలు, మత్స్యకారులు ఇలా అన్ని సామాజికవర్గాల వారికి కూడా క్యాలెండర్ ను రూపొందించుకుని మరీ నగదును జమ చేసేవారు. తమకు ఈ డబ్బులు గ్యారంటీగా వస్తాయని భావించేవారు. సంక్రాంతి పండగను హుషారుగా ఆనందంగా జరుపుకునే వారు. కానీ గడిచిన ఏడు నెలల నుంచి రూపాయి కూడా బ్యాంకు అకౌంట్ లో పడకపోవడంతో ఒకింత అసంతృప్తితో ఉన్నారన్నది వాస్తవం. బ్యాంకు ఖాతాల్లో నగదు లేక ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసిందన్నా... గత ప్రభుత్వం అప్పులు చేసి వెళ్లిందని, ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని అధికార పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ దానిని ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే తమకు అవన్నీ అనవసరం. తమకు అవసరమైనది నగదు. అది అందనప్పుడు అభివృద్ధి, సంక్షేమం అంటూ ప్రకటనలు తమకు కూడు బెడతాయా? ని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతలు వేరుగా ఉండటంతోనే ప్రజలకు తొలి రెండు నెలల్లోనే అర్థమయింది. చంద్రబాబు అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రయారిటీ ఇస్తారు. ఆ రెండు దీర్ఘకాలంలో సంపదను సృష్టిస్తాయని ఆయన బలంగా నమ్ముతున్నారు. అప్పుడు ఆర్థికంగా పేదలు బలపడతారని భావిస్తున్నారు. గ్రామాల్లో నిలదీత మొదలు... కానీ జనం మాత్రం అలా అనుకోవడం లేదు. తమకు ఎలాంటి నగదు ఇవ్వకపోవడమేంటని కొందరు ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను నిలదీసే పరిస్థితికి గ్రామాల్లో వచ్చిందని అంటున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఒక ఎమ్మెల్యే అయితే గ్రామస్తులకు నచ్చచెప్పలేక వెనుదిరిగారు. ప్రభుత్వం పాలసీ ప్రకారం వెళుతుంది. రహదారులు బాగాలేకున్నా, రాష్ట్రానికి రాజధానికి లేకున్నా వారికి ఫరక్ పడదు. తమకు అలవాటుగా మారిన నగదు బ్యాంకు ఖాతాల్లో కనిపించకపోయే సరికి ఆ ఫ్రస్టేషన్ ను ప్రజా ప్రతినిధులపై చూపిస్తున్నారంటున్నారు. అయితే ఏడు నెలలే అయినందున ప్రభుత్వం తన ప్రాధాన్యతలను అమలు చేస్తుందని, గతంలో జగన్ కూడా అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలల తర్వాతనే పథకాలు అమలు చేశారని, తాము కూడా అంతేనని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. మొత్తం మీద కూటమి పార్టీ పాలనపై మాత్రం తమకు నగదు బదిలీ చేయడం లేదన్న అసంతృప్తి మాత్రం గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తుందంటున్నారు.

## ఎంజిబిఎస్ నుంచి చంద్రాయణగుట్టకు మెట్రో

**పాతబస్తీ నిర్వాసితులకు పరిహారం అందచేత**

**ఎండి ఎన్వీఎస్ రెడ్డితో కలసి అందించిన ఓవైసీ**

**హైదరాబాద్,జనవరి6 :**
హైదరాబాద్ పాతబస్తీ మెట్రో రైలు భూ నిర్వాసితులకు హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెక్కుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మెట్రో రైలు ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. రూ.741 కోట్ల వ్యయంతో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర మెట్రో లైను నిర్మిస్తున్నట్లు చెప్పారు. నాలుగేళ్లలో మెట్రో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. మెట్రో



నిర్మాణంలో జర్మన్ సాంకేతికత వినియోగిస్తామని చెప్పారు. భూ నిర్వాసితులకు గజానికి రూ. 81వేల పరిహారం చెల్లిస్తున్నట్లు తెలిపారు. తొలుత సోమవారం 40 మందికి చెక్కుల పంపిణీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మొదటి దశలోనే పూర్తి చేయాల్సి ఉండగా.. ఆస్తుల సేకరణ, అలైన్‌మెంట్ వివాదాలతో పదేళ్లుగా నిలిచిపోయింది. దీంతో రెండో దశలో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైన రైట్ ఆఫ్ వే కోసం ముందుగా రహదారులు విస్తరించాలి. సర్వే చేపట్టగా 1100 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని అధికారులు తేల్చారు. ఇందుకు సంబంధించి భూసేకరణ నోటిఫికేషన్లు విడతల వారీగా జారీ చేశారు. చదరపు గజానికి రూ.81 వేలుగా పరిహారం ఇవ్వడానికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ నిర్ణయించారు.

# అందుబాటులోకి ఆరాంఘర్- జూ పార్క్‌పై ఓవర్

**లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేంవత్ రెడ్డి**

**దివంగత మన్మోహన్ సింగ్ పేరు పెడుతున్నట్లు ప్రకటన**


**పాతబస్తీ అభివృద్ధిలో ఎంతో కీలకమన్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్**



**హైదరాబాద్,జనవరి6:**
ఆరాంఘర్– జూ పార్క్ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. రూ.799 కోట్ల జీహెచ్ఎంసీ నిధులతో ఆరంఘర్ చౌరస్తా నుంచి జూపార్క్ వరకూ 6 లైన్ల ఫ్లై ఓవర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. 4.08 కిలోమీటర్ల పొడవు, 23 మీటర్ల వెడల్పుతో అధికారులు దీన్ని నిర్మించారు. నగరంలో పీవీ ఎక్స్‌ప్రెస్ వే తర్వాత ఇదే రెండో అతి పెద్ద ఫ్లై ఓవర్.సోమవారం మధ్యాహ్నం సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రులు, అధికారులతో కలిసి దీన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం దీనికి దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు పెడుతున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ ఫ్లై ఓవర్ ప్రారంభం కావడంతో నగరంలో ట్రాఫిక్ కష్టాల నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. ఆరంఘర్ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే బెంగళూరు హైవే నుంచి హైదరాబాద్ నగరంలోకి ట్రాఫిక్ అంతరాయం లేకుండా తేలికగా ప్రవేశించవచ్చు. అలాగే ఎంజీబీఎస్ బహదూర్ పుర నుంచి ఎయిర్‌పోర్ట్, బెంగళూరు హైవేకు సులువుగా వెళ్లొచ్చు. తాడ్ బన్ జంక్షన్, దానమ్మ హట్స్, శాస్త్రీపురం, హాసన్ నగర్, శివరాంపల్లి జంక్షన్ల



వద్ద ట్రాఫిక్ చిక్కులు లేకుండా దీనిపైనుంచి నగర వాసులు సులభంగా ప్రయాణించవచ్చు. ఎస్ఆర్డీపీ కింద నిర్మిస్తున్న 42 ప్రాజెక్టుల్లో ఇప్పటివరకూ 36 ఫ్లై ఓవర్లు, అండర్ పాసులు అందుబాటులోకి వచ్చాయి. కాగా, 37వ ప్రాజెక్టుగా ఆరంఘర్–జూ పార్క్ ఫ్లై ఓవర్ తాజాగా అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఓల్డ్ సిటీ చాలా అందమైన నగరమని.. ఇక్కడ ఉండే ప్రజలంతా ప్రేమానురాగాలతో ఉంటారని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తెలిపారు.. ఈ కార్యక్రమంలో అక్బరుద్దీన్ పాల్గొని ప్రసంగించారు. 'ఓల్డ్ సిటీలో ఇంత పెద్ద ఫ్లై ఓవర్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రూ.301 కోట్లతో సివరేజ్ పనులు ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు. వర్షం నీరు, మురుగు నీరు కలవకుండా వేర్వేరు లైన్ ఏర్పాటు చేయడం సంతోషం. మురుగు నీరును కూడా బాగు చేయడానికి ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారని.. దీంతో మూసీలో మురుగు లేకుండా చేయడానికి అవకాశం కలుగుతుంది.'అని వివరించారు. గత ప్రభుత్వం ఓల్డ్ సిటీని ఇస్తాంబుల్, సింగపూర్ చేస్తామని అన్నారని.. కానీ చార్మినార్ పాదచారుల ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. ఓల్డ్ సిటీకి ప్రతి రోజు వేల సంఖ్యలో టూరిస్టులు వస్తారని.. ఓల్డ్ సిటీని మరింత డెవలప్ చేస్తే టూరిజం మరింత పెరిగే అవకాశం ఉందని సూచించారు. ప్రభుత్వం తీసుకొస్తామన్న టూరిజం పాలసీలో మక్కా మసీదుతో పాటు ఇతర మసీదులను కూడా చేర్చితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఓల్డ్ సిటీలో కూడా హైరేంజ్ అపార్ట్‌మెంట్ కల్చర్ వస్తుందన్నారు. కొత్తగా నిర్మించనున్న ఉస్మానియా ఆస్పత్రిపై ప్రభుత్వం దృష్టిసారించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. సిటీలో ఉన్న స్టేడియాలను పొలిటికల్ పార్టీ మీటింగ్స్ ఇవ్వకుండా స్పోర్ట్స్‌ను పెంచే విధంగా ఉండాలన్నారు. ఓల్డ్ సిటీ నుంచి ఒలంపిక్స్‌లో మెడల్స్ తీసుకువచ్చే ఫుడ్ బాల్ ప్లేయర్స్ ఉన్నారని.. వారికి ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఓల్డ్ సిటీలో హిందూ– ముస్లిం అనే తేడా లేకుండా కలిసిమెలిసి ఉంటారన్నారు. ఓల్డ్ సిటీకి మెట్రో రైలు తీసుకొస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి అక్బరుద్దీన్ ధన్యవాదాలు తెలిపారు.



## బీచ్‌లో ఛిల్ అయిన అలియాభట్

గ్లామరస్ రోల్స్‌తోపాటు నటనకు ఆస్కారమున్న పాత్రలు చేస్తూ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారే భామల్లో టాప్‌లో ఉంటుంది బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్. గతేడాది జిగ్రా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ భామ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉంది. కాగా ప్రొఫెషనల్‌గా బిజీగా ఉండే ఈ బ్యూటీ షూటింగ్ పనుల నుంచి బ్రేక్ తీసుకుంది. ప్రస్తుతం వెకేషన్ టూర్‌ను ఎంజాయ్ చేస్తోంది. ఈ భామ ఇంతకీ ఎక్కడికెళ్లిందో తెలుసా..? ప్రపంచ ప్రఖ్యాత టూరిజం స్పాట్స్‌లో ఒకటైన థాయ్‌లాండ్. బికినీలో థాయ్‌లాండ్ దీవుల్లోని సముద్రంలో జలకాలాడింది. సాగరతీరంలో విహరిస్తూ ప్రకృతిని అందాలను ఆస్వాదించింది. బ్లాక్ గాగుల్స్ పెట్టుకొని స్టైలిష్‌గా బోటు రైడ్ చేసింది. ఉదయాన్నే జిమ్ సెషన్‌కు వెళ్లింది. ఆ తర్వాత తనకిష్టమైన పుస్తకం చదివింది. అలియాభట్ థాయ్‌లాండ్ వెకేషన్‌లో సూపర్ ఛిల్ అవుట్ మూడ్‌లో ఉన్న ఫొటోలు ఇప్పుడు నెట్టింటిని షేక్ చేస్తున్నాయి. అలియాభట్ ప్రస్తుతం అల్ఫా, లవ్ అండ్ వార్ సినిమాల్లో నటిస్తుండగా.. చిత్రీకరణ దశలో ఉన్నాయి.



## బాలయ్యకు తగ్గని క్రేజ్

### గంటలోనే లక్షా 56వేలకుపైగా టికెట్స్ సేల్

నందమూరి బాలకృష్ణ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం డాకు మహారాజ్. బాబీ దర్శకత్వంలో ఎన్‌బీకే 109గా తెరకెక్కుతున్న ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. డాకు మహారాజ్ జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. విడుదలకు ఇంకా రెండు రోజులే ఉండటంతో టికెట్ బుకింగ్ అప్‌డేట్ వచ్చేసింది. డాకు మహారాజ్ టికెట్ బుకింగ్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వ్యాప్తంగా థియేటర్లలో టికెట్ బుకింగ్స్ ఇవాళ మొదలయ్యాయి. పరిమిత షోలతో బుకింగ్స్ మొదలైన గంటలోనే లక్షా 56వేలకుపైగా టికెట్స్ సేల్ అయ్యాయి. బాలకృష్ణ సినిమాకు క్రేజ్ ఎలా ఉందో ఈ వార్త మరోసారి చెప్పేస్తుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు. రోనిత్ రాయ్, శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.




## బాలకృష్ణతో నటించడం అదృష్టం : ప్రగ్య జైస్వాల్

'ఇందులో నా పేరు కావేరి. అభినయానికి ఆస్కారమున్న డీ గ్లామరస్ రోల్. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన పాత్ర. ఛాలెంజ్‌గా తీసుకొని చేశాను. దర్శకుడు బాబీ ఈ పాత్రను అద్భుతంగా డిజైన్ చేశారు.' అని కథానాయిక ప్రగ్య జైస్వాల్ తెలిపారు. బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన చిత్రం 'డాకు మహారాజ్'. ఈ సినిమాలో వన్ ఆఫ్‌ది హీరోయిన్‌గా నటించింది ప్రగ్యా జైస్వాల్. సంక్రాంతి కానుకగా ఈ నెల 12న చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ప్రగ్యా విలేకరులతో ముచ్చటించింది. 'బాలకృష్ణగారితో వరుసగా సినిమా చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా. 'అఖండ'తో నా కెరీర్ మలుపు తిరిగింది. ఇప్పుడు 'డాకు మహారాజ్' లాంటి గొప్ప సినిమాలో మళ్లీ ఆయనతో కలిసి నటించే భాగ్యం దొరికింది' అంటూ ఆనందం వెలిబుచ్చింది ప్రగ్య జైస్వాల్. దర్శకుడు బాబీ ఈ కథ చెప్పినప్పుడే పెద్ద హిట్ అవుతుందని నమ్మానని, నిర్మాత నాగవంశీ పాషన్‌తో సినిమా నిర్మించారని ప్రగ్య పేర్కొన్నారు. జనవరి 12 తన పుట్టినరోజు అని, అదేరోజు 'డాకు మహారాజ్' విడుదల అవుతుండటం సంతోషంగా ఉందని ప్రగ్యా జైస్వాల్ పేర్కొంది.




## మరోసారి ప్రేక్షకుల ముందుకు ఆదిత్య ఓం

లాహిరి లాహిరి లాహిరి సినిమాతో తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై మెరిశాడు ఆదిత్య ఓం. ఆ తర్వాత తెలుగులో పలు చిత్రాల్లో నటించిన ఈ యాక్టర్ 2023లో నాతో నేను సినిమాలో కీలక పాత్రలో నటించాడు. 2024లో పాపులర్ టీవీ రియాలిటీ షో బిగ్ బాస్ సీజన్ 8లో కూడా సందడి చేశాడు. డైరెక్టర్ కమ్ ప్రొడ్యూసర్ కూడా అయిన ఈ నటుడు ప్రస్తుతం బందీ సినిమాలో నటిస్తున్నాడు. ఈ మూవీలో ప్రకృతిని నాశనం చేస్తున్న కార్పొరేట్ కంపెనీలకు మద్దతుగా నిలిచే పాత్రలో ఆదిత్య ఓం కనిపించనున్నాడు. కార్పోరేట్ కంపెనీలకు న్యాయ సలహాదారుగా వ్యవహరించే పాత్రను పోషిస్తుండగా.. అతడిని అడవిలో వదిలేస్తే ఏం జరుగుతుంది..? అతడు ప్రకృతిని ఎలా కాపాడుతాడనే కాన్సెప్ట్‌తో సినిమా ఆసక్తికరంగా ఉండబోతుందని మేకర్స్ వెల్లడించారు. ఆదిత్య ఓం ఈ సినిమాలో ఎలాంటి డూప్స్ లేకుండా సొంతంగా యాక్షన్ సీక్వెన్స్‌లో కనిపించబోతున్నారని తెలియజేశారు. ఈ చిత్రానికి తిరుమల రఘు దర్శకత్వం వహిస్తున్నాడు. గల్లీ సినిమా బ్యానర్‌పై వెంకటేశ్వర్ రావు దగ్గు, తిరుమల రఘు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.



## డికెక్టివ్‌గా మమ్ముటి

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డొమినిక్ అండ్ ది లేడీస్ పర్స్. తమిళ అగ్ర దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మమ్ముట్టి సొంత ప్రోడక్షన్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా జనవరి 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలోనే మూవీ నుంచి ట్రైలర్‌ను వదిలారు మేకర్స్. ఈ మూవీ ట్రైలర్ చూస్తుంటే.. మమ్ముట్టి ఇందులో డొమినిక్ అనే డిటెక్టివ్ పాత్రలో నటించబోతున్నాడు. ఆసుపత్రిలో దొరికిన లేడీస్ పర్సుకి సంబంధించి ఈ కథ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. తప్పిపోయిన ఆ లేడీస్ పర్స్ ఎవరిది అని డొమినిక్ కనిపెట్టాడా.. ఇంతకీ ఆ పర్స్‌లో ఏముంది.. ఈ పర్స్‌కి మర్డర్స్‌కి సంబంధం ఏంటి అనేది తెలియాలంటే ఈ సినిమా వచ్చేవరకు వెయిట్ చేయాల్సిందే. డా.నీరజ్ రాజన్ ఈ సినిమాకు కథను అందిస్తుండగా.. గోకుల్ సురేష్ , సుస్మితా భట్ , విజి వెంకటేష్ , వినీత్ , విజయ్ బాబు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించబోతున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com